NPROIA 272

ఆంధ్రనాడుకొమ్ము

శ్రీనివాస చక్రవర్తి

NIPRO/A 272

ఆంధ్ర నాటక పరిశీలన

శ్రీనివాస చక్రవర్తి

కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన
శ్రీగురుపాటి బుచ్చిరామయ్య గారి
డా॥ చిలుకూరి దేవపుత్ర గారి
సహకారంతో ముద్రించిన పుస్తకం

జయంతి పబ్లికేషన్స్
గోపాలరెడ్డిరోడ్డు :: విజయవాడ-2

ప్రథమ ముద్రణ

ఆగస్టు 63

సర్వస్వామ్య సంకలితం

శ్రీ శారదా ప్రెస్,

విజయవాడ-2.

వెల రు 1-50

సంపాదకులు:

యం. వెంకటస్వామి

పితృపాదులు

శ్రీనివాసాచార్య

దివ్యస్మృతికి

భక్తిపూర్వకంగా

సమర్పితం

ఆంధ్ర నాటక సమీక్ష

సంస్కృతాలంకారికులు, "నాటకాంతంహి సాహిత్యం", "కావ్యేషు నాటకం రమ్యం," అని సాహిత్య ప్రక్రియలలో నాటకానికి అగ్రతాంబూల మిచ్చినా, వారి ననుసరించిన పూర్వాంధ్ర కవులు దాని జోలికి పోలేదు. సంస్కృత లక్షణ గ్రంథాలను అనువదించిన తెలుగు లాక్షణికులు నాటక పరిచ్ఛేదం వదలివేస్తూ వచ్చారు. 1550 ప్రాంతంలో చిత్రకవి పెద్దన మాత్రం లక్షణసార సంగ్రహంలో మొదట దేశీయ నాటక రూపం యక్షగానికి లక్షణం చెప్పి ఆ తరవాత క్లుప్తంగా సంస్కృత నాటకలక్షణాలను తెలిపాడు. కానిఆంధ్ర మహా భారతంలో నన్నయభట్టు, "ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు పెక్కుచూచి", "నాటక ప్రయోగంబునుం బోని ఘనరసపాత్ర శోభిత రంగరమ్యంబైన," రాయడాన్నిబట్టి నన్నయ నాటికే నాటకాలు ప్రదర్శిస్తూండే వారని తెలుస్తుంది. అయితే అవి నాటకాలో, యక్షగానాలో నిర్ధారణగా చెప్పలేం. తిక్కనగారి కీచక వధ, పింగళి సూరన గారి ప్రభావతీ ప్రద్యుమ్నం చదివితే వారికి నాటక కళలో విశేష ప్రజ్ఞ గలదని పొడగట్టుతుంది. కాని ఆ మహానుభావులకు తెలుగులో నాటకం రాయాలని బుద్ధిపుట్టలేదు. పిల్లల మర్రి పినవీరభద్రుడు, నంది మల్లయ్య, ఘంట సింగయ్య మంచన ప్రభృతులు సంస్కృత శాకుంతలం, ప్రబోధ చంద్రో

దయం, కేయూరబాహు చరిత్ర ప్రబంధాలుగా రూపొందిం చారేగాని నాటకాలుగా అనువదించలేదు. ఆనాటి సాహిత్యం రాజుల ఆదరాభిమానాలమీద, ఇష్టా యిష్టాలమీద ఆధార పడి ఉండడం, నటీ నటులంటే ప్రజలలో గౌరవం లేకపోవడం తెలుగులో నాటకాలు అవతరించక పోవడానికి కారణాలయి వుండవచ్చు.

తెలుగులో పూర్వం నాటకాలు వెలువడనంతమాత్రాన తెలుగువారికి నాటకప్రక్రియతో పరిచయం లేదని భావించ డానికి వీలులేదు. సుప్రసిద్ధ సంస్కృత నాటకాలు రచించిన భవభూతి, మురారి, భట్ట నారాయణ ఆంధ్రులని కొందరి ఊహ. భట్ట నారాయణుడే నన్నయకు భారత రచనలో సహక రించిన నారాయణ భట్టని తలచేవారూ ఉన్నారు సంస్కృ తంలో ఉన్మత్త రాఘవం, మదన విలాసభాణం, మహా భారతం, నరకాసుర విజయ వ్యాయోగం, రత్నపాంచాలిక, రచించిన భాస్కరుడు, పశుపతి, నాగనాథుడు, గంగాధర కవి, ధర్మసూరి, సింగభూపాలుడు సిసలైన ఆంధ్రులే. వీరుగాక నరసింహకవి, వెంకటాధ్వరి, భట్టబాణుడు మొదలైన ఆంధ్ర కవులు సంస్కృతంలో నాటకాలు రాశారు. కాటయవేముడు, కోలాచలం శ్రీనివాసాచార్యులు మొదలయిన ఆంధ్రులు సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రచించారు. నన్నె చోటుడు కుమార సంభవంలో, "సూత్రధారుడై నాట్యాభి నయము లెసగనాడె నారదుండు," అనిన్నీ, పింగళి సూరన, "...ముఖాదులగు సంధులు సొంగత బెంపుమీర గంగావ తారాది నాటకములాడె," అనిన్నీ చెప్పడంబట్టి సంస్కృత

నాటక లక్షణాలను అనుసరించి తెలుగు నాటకాలాడేవారని అనుమానించవలసి వస్తోంది. ఇవి గాక, "అటుగాక సాంగ భాషాంగ క్రియాంగ, పటు నాటకంబుల నటించువారు," అని పాలకుకి సోమనాధుడు బసవపురాణంలో ఉదాహరించాడు. ఈ నాటకాల స్వరూపం నిర్ధారణగా తెలియదు.

పూర్వకవులు నాటకసరస్వతిమీద ఎంత శీతకన్ను వేసినా ఎలానో ఒక రూపకం 14వ శతాబ్దంలో తెలుగులో వెలువడింది. అదే ప్రతాపాభిరామం. దీనిని రచించింది వినుకొండ వల్లభరాయడో లేక శ్రీనాధుడో. రచయిత ఎవరయినా, ఇదే ప్రప్రథమ తెలుగు రూపకమని భావించవలసివస్తోంది. అయితే ఇది పూర్తిగా స్వతంత్ర నాటకంగాదు. సంస్కృత ప్రేమాభిరామ నాటకాన్ని అనుసరించి రచించింది. ఇది దశ విధ రూపకాలలోని వీధిజాతికి చెందింది. "నటులది దోర సముద్రము, విటులది యోర్గల్లు, కవిది వినుకొండ", అని నాందీప్రస్తావనలో చెప్పడంవల్ల దీనిని మోపూరి భైరవుని తిరునాళ్ళలో ప్రదర్శించేవారని తెలుస్తుంది. ఇందులో, శృంగారం కొంచెం పచ్చిగా నడిచినా, ఆనాటి ఆంధ్రప్రజల సాంఘికాచారాలు, వినోదాలు, వివిధ కళారూపాలు ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నాయి.

ఆనాటి ఆంధ్రమహాజనులకు యక్షగానాలు, వీధినాటకాలు, పగటివేషాలు, తోలుబొమ్మలు, బుర్రకథలు మొదలయిన జానపద కళారూపాలే వినోదం, విజ్ఞానం చేకూరుస్తుండేవి. అయితే ఆ కళారూపాలలక్ష్యం, మూలసూత్రం నాటకత్వమే. సంభాషణ, సన్నివేశాలు, ప్రక్రియలు కూర్చి కథకు

రూపకత్వం ఇచ్చి దృశ్యమానంచేయడమే వీటిలక్ష్యం. సజీవ వ్యక్తులకుబదులు నిర్జీవ ప్రతిమలను చలింపజేయడంద్వారా కథకు రూపకత్వం ఇచ్చినవే తోలుబొమ్మలాట, కీలుబొమ్మలాట. అలాగే సంగీతం నృత్యంద్వారా కథకు రూపకత్వమిచ్చిన ప్రదర్శనాలే వీధినాటకాలు. పగటి వేషాలలో పగలు ప్రదర్శించేవేగాక, రాత్రిళ్ళు ప్రదర్శించే పంతులు పఠాణీ వేషాలవంటివికూడా ఉన్నాయి ఈ ప్రదర్శనాలు సంస్కృత ప్రహసనాలకు దగ్గరగా ఉంటాయి. ఈ జానపద నాటకకళా రూపాలకు సంస్కృత నాటకలక్షణాలు పట్టకపోయినా, సామాన్య నాటకధర్మాలు ప్రారంభం, పరాకాష్ఠ, నిర్వహణ లాంటి నాటకసంధులు వీటిలో గోచరిస్తాయి.ఇవన్నీ ఉచితంగా ఆరుబయట ప్రదర్శించేవారు కాబట్టి జనులు తండోపతండాలుగావచ్చి చూచేవారు. కొన్ని కులాలవారు, శాఖలవారు ఈప్రదర్శనాలను కులవృత్తిగా పెట్టుకోవడంవల్ల;,నటులుపంక్తి బాహ్యులనే నియమంతో సంఘంలోగౌరవంలేకపోవడంవల్ల, సామాన్య ప్రజానీకంలో నాటకకళాతృష్ణ నటించాలనే ఉత్సాహరూపం ధరించకుండా, ప్రదర్శనాలుచూచి ఆనందించడానికే పరిమితమయి ఉండిపోయింది.

1860లో తెలుగులో స్వతంత్ర నాటక రచన ప్రారంభమయింది. బందరు నోబుల్ కళాశాలలో పండితులు కోరాడ రామచంద్ర శాస్త్రిగారు ప్రప్రథమంగా, "మంజరీ మధుకరీయం"; అనే నాటకంగా రచించారు. ఇందులో నాటక లక్షణాలకంటె సంస్కృత నాటికా లక్షణాలు ఎక్కువగా గోచరిస్తాయి. క్షీణ దశలోని సంస్కృతి నాటకాల రచనా

విశ్వనాన్ని శాస్త్రిగారు అనుసరించడంవల్ల మంజరీ మధుకరీయం ప్రదర్శన యోగ్యం కాలేకపోయింది. భాష, సరళంగా, నటకీయంగా లేదు ఈనాటకం 1860లో రచించినా 1908 లో గాని అచ్చుకాలేదు. శాస్త్రిగారు సంస్కృతంనుంచి ఉన్మత్త రాఘవం, ముద్రారాక్షసం, శాకుంతలం, వేణీ సంహారం, ఉత్తరామ చరితలు అనువదించాడు. సంస్కృతంలో స్వయంగా నాలుగు నాటకాలు రచించాడు. సంస్కృత నాటకం ఆంధ్రీకరించడానికికూడా వీరే ప్రథములు. గాని వీరి ఆంధ్రీకరణ ప్రచురణకంటే ముందుగా కొక్కొండ వెంకట రత్నం పంతులుగారి నరకాసుర విజయ వ్యాయోగం 1872లో ముద్రిత మయింది దీనిని అనువదించడంలో వీరు సంస్కృతం లోని వచనాన్ని వచనంగా, శ్లోకాలను పద్యాలుగా అనువదించి అనువాదానికి ఒరవడి పెట్టారు. అయితే 1870 లోనే యం. శేషాచార్యులు ఆనే వారు శాకుంతలం ప్రచురించినట్లు తెలుస్తుంది. అది రూపకమో, వీధి నాటకమో తెలియదు. కొక్కొండవారు నరకాసుర విజయ వ్యాయోగమే గాక ధనంజయ విజయ వ్యాయోగం(1894), ప్రసన్న రాఘవం (1897) ఆంధ్రీకరించారు. వీరి శైలి పచ్చి గ్రాంధికం. ప్రదర్శనానికి అనువయిన భాష కాదు.

1872 లో పరవస్తు వెంకట రంగాచార్యులుగారు శాకుంతలం అనువదించారు. వీరూ గ్రాంధికమే వాడారుగాని మూలంలోని ప్రాకృత భాషల స్థానంలో అచ్చ తెలుగు ప్రవేశ పెట్టారు. ఈ దశలోని ఇంకొక ప్రఖ్యాత రచయిత వావిలాల వాసుదేవ శాస్త్రిగారు. వీరు 1875 లో ప్రప్రథ

మంగా పేక్స్పియర్ 'జూలియస్ సీజరు' అనే ఆంగ్ల నాట కాన్ని తెలిగించారు. పాశ్చాత్య నాటకం తెలిగించడానికి వీరే ఆద్యులు. ఈ ఆంధ్రీకరణంలో వారు మూలంలోని పేర్లు మార్చలేదు. నాటకమంతా తేట గీతిలో రాసి ప్రప్రథమ పద్య నాటక కర్తగా కీర్తి పొందారు. వీరు మృచ్ఛకటిక, ఉత్తరరామచరిత తెనిగించడమేగాక, నందక రాజ్య మనే స్వతంత్ర నాటకం రచించారు. ఇదికూడా పూర్తిగా పద్య రూపంలోనే ఉంది. పైగా సాంఘిక నాటకం. ఆనాడు ఆంధ్ర దేశంలో చెలరేగిన వైదీకి, నియోగి వైషమ్యాలను, వాటి వల్ల కలిగే అనర్థకాలను చిత్రిస్తూ శాస్త్రిగారు ఈ నాటకం రచించి ప్రథమ సాంఘిక నాటక కర్త అని పేరొందారు.

1880 వ సంవత్సరంలో ఆంధ్ర సాహిత్య చరిత్రలో నూతన యుగం ప్రారంభమయింది ఆ సంవత్సరమే ధార్వాడ కంపెనీవారు ఆంధ్రదేశ మంతటా పర్యటించి నాటకాలాడి వెళ్ళారు. ధార్వాడవారు నాలుగు వేషాలా మూసిన తాటాకుల పాకలో మూడు వేషాల మూసిన రంగస్థలంమీద నాటకా లాడడం. పైకో కిందకో కప్పీలమీద కదిలే తెరలు, సీనరీలు చూసేసరికి తెలుగువారికో అలాగే నాటకా లాడాలనే ఉత్సాహం రేకెత్తింది. రాజమండ్రిలో ధార్వాడవారు నాట కాలాడి వదలి వెళ్ళిన పాకలో కందుకూరి వీరేశలింగంగారు 'రత్నావళి', 'చమత్కార రత్నావళి'అని రెండు నాటకాలు ఆడించారు. ఇదే తెలుగు దేశంలో బహిరంగంగా తెలుగులో నాటకాలాడడానికి మొదలు. అంతకు ముందు ఆ సంవత్సరమే వీరేశలింగంగారు బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని

ఆని అవహేళన నాటకాలు రాసి వున్నాను. వ్యవహార ధర్మ బోధినిని 1880 లోనే రాజమండ్రిలోని బాలికా పాఠశాలలో ప్రదర్శింప జేశారు. ఈ రెండూ పేరుకు నాటకాలేగాని, నిజానికి సంభాషణ కావ్యాలనవచ్చు వీరేశలింగంగారివంటి యుగ పురుషుడు నాటకాలు రాసి ఆడిస్తూండడంవల్ల నాటకాలాడడం గౌరవహీనమనే భావం తొలగిపోసాగింది. వీరేశలింగంగారు ప్రదర్శింపజేసిన రత్నావళి సంస్కృత రత్నావళికి తెలుగు. చమత్కార రత్నావళి మేక్స్‌వియర్ కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే నాటకానికి అనువాదం రత్నావళి గద్య పద్యాత్మకం. చమత్కార రత్నావళి వచన నాటకం.

పటణ పటణానా నాటక సమాజాలు వెలిశాయి. కాని ఆడడానికి నాటకా లేవీ? తెలుగులో నాటకాలు లేవు సరిగదా సరైన నాటక లక్షణ గ్రంథాలుకూడా లేవు నాటి నాటక రచయితలు, సంస్కృత నాటకాలను, ధార్వాడ వారి నాటకాలను, దేశీయ రూపాలయిన పగటివేషాలు ఆధారం చేసుకుని తెలుగులో నాటకాలు రాయడం మొదలు పెట్టారు. పగటి వేషాలలో చాలా వేషాలు ఉత్తమ ప్రహసన లక్షణాలతో విరాజిల్లుతూ నాటి నాటకాలకు ప్రాతిపదికలయినాయి.

ధార్వాడవారు ప్రదర్శించిన నాటకాల ఇతివృత్తాలు పురాణాలనుంచి, జానపద గాథలనుంచి తీసుకున్నవి. అప్పుడు ప్రజలను రంజింపజేస్తున్న వీధి నాటకాలు, తోలు బొమ్మలాట మొదలయి కళా రూపాల ఇతివృత్తాలుకూడా పౌరాణికాలే. నాటి రచయితలు ఇతివృత్తాన్ని ఎంచుకొనవలసి వచ్చేసరికి సహజంగా పౌరాణిక, జానపద గాథలమీదకే వారిదృష్టిమరలి

భారతీయ నాటకాల లాగానే పూర్తిగా వచనంలో నాటకాలు రచించారు. ఒకటి రెండు శ్లోకాలు, ఒకటి రెండు కీర్తనలు మాత్రమే ఉండేనట. అవయినా ఏ నారదుడి వేషానికో. ఇలా వచన నాటకాలు రచించినవారిలో ముఖ్యులు గుంటూరు కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, కంసకూరి వీరేశలింగం, బందరు నాదెళ్ళ పురుషోత్తం, తోలేటి సుబ్బారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగార్లు. కొండుభోట్లవారు గయోపాఖ్యానం, హరిశ్చంద్ర, యుగంధర విజయం, ద్రౌపదీ వస్త్రాపహరణం మొదలైన ముప్పదినాటకాలు వచనంలో(1881-85) రచించారు. అవి ఇప్పుడు లభ్యంకావడంలేదు. వీరి నాటకాలనుగురించి చిలకమర్తివారు నారి స్వీయచరిత్రలో, "వచననాటకములైనను నవియెంతో మనోహరములుగ నుండెను....నాటకముల శైలిగూడ సులభమై ప్రేక్షకులకు సుబోధకముగ నుండెను," అని రాశారు. వీరేశలింగంగారి రాగమంజరి, కళ్యాణకల్పవల్లి, ప్రహ్లాద వచన నాటకాలే. మొదటరెండు షెరిడాన్ ఆంగ్లనాటకాలకుఅనువాదాలు,బందరు నాదెళ్ళ పురుషోత్తంగారు హిందీనాటకాలేగాక హరిశ్చంద్ర, రామదాసుమొదలయిన తెలుగునాటకాలుకూడా రచించారు. పాత్రోచితభాష వీరి నాటకాలలోని విశిష్టత. తోలేటి సుబ్బా రావుగారి హరిశ్చంద్ర నాటకంకూడా వచన నాటకమే. దీనిని ఇమ్మానేని హనుమంతరావుగారి హిందూసమాజం చాలాసార్లు ప్రదర్శించింది. గయోపాఖ్యానంలాంటి గద్య పద్య నాటకాలకు ప్రసిద్ధికెక్కిన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారుకూడా మొదట వచన నాటకాలు రచించినవారే. వీరి

కీచకవధ, ద్రౌపదీపరిణయం, శ్రీరామజననం (1889) గయోపాఖ్యానం (1890) వచననాటకాలే. గయోపాఖ్యాననాటకం మొదటిలో వచనంలో రచించి తరవాత పద్యాలుచేర్చారు. ఆనాటి నటులలో "చక్కగా భాగములుచదివి ప్రయోగించిన పక్షమున పద్య నాటకములకంటె వచన నాటకములే ఎక్కువ మనోహరముగా నుండునను నభిప్రాయమొకటి", (చి. ల. స్వీయచరిత్ర) ప్రబలంగా ఉండేది. ఆ తరవాత నాటకాలన్నింటికీ గద్య పద్యాత్మకంగానే రచించారు.

సరుకుజిల్లాలలో ఇలా వచనాటకాలు వెలువడుతూంటే బళ్ళారినుంచి ఇంకోరకం గద్య పద్య గేయాత్మక నాటకాలు బయలుదేరాయి. అక్కడి వాళ్ళకి నాటకాలాడాలనే ఉత్సుకత కలిగింది. ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారు సరస వినోదిని సభ అని నాటక సమాజం స్థాపించి నాటకాలు రాసి ఆడించారు. కృష్ణమాచార్యులుగారూ వేషాలు వేసేవారు. వీరు రచించిన నాటకాలు 28 వీటిలో 14మాత్రమే అచ్చయినాయి. రోషనార తప్ప తక్కిన వాటిలో చాలా భాగం పౌరాణికాలే. వీరి నాటక రచనతో తెలుగు నాటక సాహిత్యం ఇంకో దశ నందుకుంది. ఈ నాటకాలలోని పద్యాలు ప్రబంధ పద్యాల ఫక్కీలో నడుస్తాయి వీరు స్వయంగా రక రకాల ఛందస్సులూ ప్రసాదించుకుని కొత్త కొత్త పద్యాలు, గేయాలు, రాగమాలికలు, 'మ్యూజియెట్లు' నాటకాలలో ప్రవేశ పెట్టారు. గద్యంలోని భావమే పద్యంలో, అదే భావం కీర్తనలో గాయకం, ప్రతి చిన్న విషయాన్నీ ప్రత్యేక రంగంగా చిత్రించడం మూలంగా వీరి నాటకాలు

కోంచెం పెద్దవిగా ఉంటాయి. సంస్కృత నాటకాల పద్ధతిలో పద్యాలు, ధార్వాడ నాటకాలలోలాగా పార్శ్వ కోర్తనలు, ఆంగ్ల నాటకాలలోలాగా అంకం రంగాలుగా విభజన, దీర్ఘ స్వగితాలు, పూర్వ రంగం, (Prologwe) ఉత్తర రంగం వీని నాటకాలలోని ముఖ్యలక్షణాలు. నాటకాలలో పద్యాలు, పాటలు రాయడానికి కారణాలను కృష్ణమాచారిగారు చిత్ర నళీయంలో సూత్రధారునిచేత ఇలా చెప్పించారు: "ఈ పాంత ములవా రేమి కారణమో నాటకముల జూచునప్పు డెఱదలి సంవిధానచమత్కారమును, అర్థవైశద్యమును, గవితాచమత్కృ తియు నంత సరకు సేయక సంగీతమునమాత్ర మెక్కువనగా నభిలాషగలవారుగా నుండుటచే వారి సంతోషమునకై సం విధాన సందర్భము ననుసరించి వచన సరణిని, పద్య సరణిని గొరంత లేకుండా జేసియున్నాను. అందంపు పాటలు సయి తము నెలకొలపవలసి వచ్చె. ధీర నాటకములకు పాటలు ముఖ్యములు కావనియు, మీదు మిక్కిలి పాటలవలన నెప్ప కిటిని భావ ప్రకటనము సముచితముగా గలుగజాల దనియు, జనులందరు తెలియు వరకు వారి మార్గమే యవలంబింప వలయుగదా!"

చిత్రనళీయం ప్రథమముద్రణ పీఠికలో తాము ఒకే భావమును గద్యంలో పద్యంలో పాటలో పెట్టి ఎందుకు రాసిందీ వివరిస్తూ సంగీతం పాడలేక గద్యంపాగా చెప్పగల వారు గద్యం, పద్యంపాగా పాడగలవారు పద్యం, పాట పాగా పాడగలవారు పాట ఉపయోగించుకోడానికి వీలుగా రచించానని తెలియజేశారు.

నాందీ ప్రస్తావవలలో వీరు కొత్త పోకడపోయారు. సంప్రదాయకంగా వచ్చే నటీ సూత్రధారుల బదులు చిత్ర నళీయంలో ఇద్దరు పౌరులను ప్రవేశపెట్టి తెలుగులో నాటక రచన ఆవశ్యకత మొదలయిన సమకాలీన విషయములు వారిచేత చెప్పించారు.

వీరి చిత్రనళీయం (1886), విషాదసారంగధర (1889), అజామిళ, చంద్రహాస, (1916) ప్రహ్లాద, (1914) ప్రమిలార్జునీయం, (1914) చిరకారి, (1919), ముక్తావళి (1915) రుక్మాంగద (1920) ఎక్కువ ప్రజాదరణను పొందాయి. వీరి నాటకాలు పౌరాణికాలైనా వర్తమానకాల సాంఘిక రాజకీయ సమస్యలపై తమ భావాలను ఆచార్యులవారు నాటకాల ద్వారా ప్రకటించారు. చంద్రహాస నాటకంలో ఉప్పుపన్ను, ప్రమిలార్జునీయంలో స్త్రీ స్వాతంత్ర్యం, పాంచాలీస్వయంబరంలో విదేశీ వస్తుబహిష్కరణ ప్రబోధించారు. సంస్కృత లాక్షణికులు నాటకం సుఖాంతంగా ఉండాలని శాసించినా విషాదాంత నాటకప్రక్రియలోని గొప్పదనాన్ని గుర్తించి ధర్మవంతులు ధైర్యంగా విషాదాంతంగా సారంగధరరచించి తర్వాతి రచయితలకు మార్గదర్శకులయినారు.

విషాదనాటకరచనకు తాము పూనుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆచార్యులవారు. విషాదసారంగధర నాటక పీఠికలో ఇలా తెలియజేశారు: "ఈ నాటకము విషాదాంతముగా నొనర్పబడియున్నది. ఇది కొత్తపద్ధతియగుట యెరుగనివాడగాను, ఆంగ్లేయభాషయందిట్టి విషాదనాటకములనేకములుకలవు. నీతిబోధ విషాదనాటకములయందువలె మంగ

శాంతనాటకముల యందు గలుగజాలదని నాకు తప్పని యభి
ప్రాయం. కావున నీకొత్తపద్ధతి ననుకరించితి".

అప్పటివరకు సారంగధరచరిత్ర నాటకాలుగా రాసిన వారంతా సారంగధరుని సిద్ధుడు బతికించినట్లుగానే చిత్రించారు. అందుకు విరుద్ధంగా ఆచార్యులవారు సారంగధరని చంపించేసరికి, అసలా విషాదాంతనాటకములు రాయవచ్చునా కూడదా అనే విషయమై తర్జనభర్జనలు బయలుదేరాయి కాని ప్రేక్షకులుమాత్రం ఈ కొత్త ప్రక్రియను మెచ్చుకున్నారు. చంద్రహాసనాటకం రెండవముద్రణ (1922) పీఠికలో ప్రకాశకులు, "ఎంత రుచికరములైనను, నెంతనీతిదాయకములైనను నాదరింపబడకుండిన విషాదాంతనాటకము లిప్పుడత్యంతాదరమును బడయుచున్నవి. ఇందులకు విషాదసారంగధర నాటకమే తారకాణము. అది ఇప్పుడే ఐదవ ముద్రణకెదురుచూచుచున్నది. దీనివలన ఖేదాంత నాటములు మనవారి కెంతయో యాకర్షించియుండుట తెల్లమగుచున్నది."

సారంగధర నాటకములోని కథకు చారిత్రకాధారాలు లేవు. రాజరాజ నరేంద్రునికి సారంగధరుడనే కొడుకుగాని, చిత్రాంగి అనే భార్యగాని ఉన్నట్లు చరిత్రలో కనిపించదు. మాళవరాజు పేరూ రాజ రాజ నరేంద్రుడే. ఈ నామ సామ్యాన్నిబట్టి ఆ కథను ఆంధ్ర రాజరాజ నరేంద్రునికి అంటగట్టి ప్రచారం చేశారు. గుడ్డిగా దానిని అంతా నమ్మారు. పూర్వం సారంగధర కథ ప్రబంధాలుగా, ద్విపద కావ్యాలుగా రాసిన చేమకూరి వెంకటపతి మొదలైనవారు రాజ రాజ

నరేంద్రుడు మాళవరాజని, చిత్రాంగి అతని ఉంపుడుకత్తె అనీ రాశారు.

విషాద సారంగధర ప్రజాదరణను చూరగొనడం మూలంగా ఆచార్యులువారు చంద్రహాస, ముక్తావళి, అజామిళ విషాదాంతంగానే రచించారు. హిరణ్యకశ్యపుని నాయకుడని భావించితే ప్రహ్లాదకూడా విషాదాంతమే.

కృష్ణమాచార్యులుగారు రచించిన 28 నాటకాలలోనూ ఇతివృత్తం ప్రఖ్యాతమయిందే. భారత భాగవత రామాయణాది పురాణాలలోనుంచి కథలను తీసుకుని వీరు నాటకాలుగా రచించారు. అక్కడక్కడ కొన్ని కొన్ని కల్పనలు చేశారు. ఈ 28 లో పూర్తి చారిత్రక నాటకం రోషనారా శివాజీ ఒక్కటే. సారంగధర నాటకం అర్ధచారిత్రకం లేదా చారిత్రాభాసం. చిరకారి నాటక ఇతివృత్తం భారతంనుంచి తీసుకున్నా నాటకంలో చాలా భాగం ఆచార్యులవారికల్పితమే. సాంఘిక నాటకంలా ఉంటుంది. కథా సంవిధానంలో, సన్నివేశ కల్పనలో, పాత్ర చిత్రణలో నాటకీయ వ్యంగాన్ని నాడడంలో, కథా విన్యాసంలో, పాత్ర చిత్రణలో వీరు షేక్స్పియర్ పద్ధతిని సాదృశ్య, వ్యత్యాసాలను చేపట్టారు. వీరికి కరుణా రసం ఎక్కువ ఇష్టమైనట్లు తోస్తోంది. చిత్రనళీయం, సారంగధర, పాదుకా, రుక్మాంగద,చిరకారి, హరిశ్చంద్ర మొదలయినవి కరుణారస ప్రధానములయినవే. వీరు తెలుగులోనేగాక కన్నడ భాషలో వామన చరిత్ర, ఉషాపరిణయం అనే రెండు నాటకాలు, ఇంగ్లీషులో హరిశ్చంద్ర నాటకం రచించారు.

ఆచార్యులవారి నాటక రచనా విధానమును కప్పగల్లు సంజీవమూర్తిగారు పరిశోధన పత్రిక ఆంధ్రనాటక పితామహా సంస్మరణ సంచికలో ఇలా వివరించారు:

"ఒక నాటకమునకు ప్రణాళిక నేర్పరచుకుని ఒక మంచి విలేకరిని వేకువజామున తమ ఇంటికి రానియమించి, తాము పచారుచేయుచూ అశువుగా సంభాషణల చెప్పుచుండగా, ఆ వ్రాయసకాడు వ్రాయుచుండువాడు. అది యంతయు అప్పటికి నచన రూపము. నాటకము వ్రాయుట ముగిసిన పిదప, తా మొక్క-సారి చూచి ఆవశ్యకమేని అందందు ఒకటి రెండు సవరణలు గావించి తమకు వలసినచోట పద్యములను, పాటలను చేర్చి, ఆ పై సభ్యులందరిని సమావేశ పరచి ఆ నాటకమును చదివి వినిపించి, వారిలో నెవరైన తెలిసినవారు ఏ నైన సలహా లిచ్చిన యెడల, అది తమకు నచ్చెనేని వానిని స్వీక రించుచుండిరి తమరే సిద్ధాంతమను మొండిపట్టు వారికి లేదు. అవల నటులకు పాత్రలు పంచిపెట్టి వారి వారి యోగ్యతాను సారముగపద్యములను, పాటలను మరిరచించి యిచ్చుచుండిరి."

ఇలా నాటకరచనా విధానంలో నటులను సంప్ర తించడం, వారియోగ్యతకు తగినట్టుగా పద్యాలు పాటలు పెట్టడం మూలంగానే బహుశా వారి నాటకాలు ప్రదర్శన యోగ్యంగా, నటప్రేక్షకులను సంతృప్తిపరిచేవిగా ఉండి అనాటి ప్రేక్షకలోకాన్ని రంజింపజేసి ఉంటాయి.

పద్యాలు పాటలు, వలన "నెప్పటికిని భావప్రకటనను సుచితముగా గలుగజాలదని," తెలిసియు ఆచార్యులువారు ప్రేక్షకుల సంతృప్తికి వాటినివాడారు. బహుశా అనుభవంలో

కూడా ఈ విషయం గోచరించి ఉంటుంది. అజాపుళనాటకం (అచ్చుకాలేదు) పూర్తిగావచనంలోనే రాసినట్టు తెలుస్తోంది.

వీరి నాటకరచనాకౌశలానికి మెచ్చుకుని గద్వాల సంస్థానాధీశులు వీరికి 1910 లో "ఆంధ్రనాటక పితామహ" బిరుదమిచ్చి గౌరవించారు. పుర:ప్రముఖులు రత్నఖచిత కిరీటం బహూకరించారు.

ప్రఖ్యాతఆంగ్లసాహితీవేత్త తణికెళ్ళ వీరభద్రుడుగారు 'విషాదసారంగధర','చిత్రాంగిపాత్రచిత్రణ'అనేరెండు వ్యాసాలలో విషాదసారంగధరనాటక ప్రాశస్త్యాన్ని, చిత్రాంగి పాత్ర చిత్రణలో ధర్మవరంచూపిన ప్రతిభను కొనియాడి వీరభద్రుడు గారు తెలుగులో నాటకసాహిత్యసమీక్షకు ఒరవడిపెట్టారు.

ధర్మనకం రామకృష్ణచార్యులుగారికి పోటా పోటీగా కోలాచలం శ్రీనివాసరావుగారు బళ్ళారిలోనే ఇంకో నాటక సమాజం, సుమనోరమసభ స్థాపించి ముప్పయినరకు నాటకాలు రాసి ధర్మవరంవారివలెనే తామూ దర్శకత్వం వహించి ఆడించారు. వీరి నాటకాలూ గద్య పద్య గేయాత్మకాలే. వీరు మొదట సాంఘిక చారిత్రక నాటకాలు రాయడం మొదలుపెట్టి తరవాత తరవాత పౌరాణిక నాటకాలు రచించారు. వీరు అంకాలను, రంగాలుగా విభజించారు. వీరికి ఆంగ్లేయ నాటక పద్ధతులమీద ఎక్కువ మోజులా కనిపిస్తుంది. వీరి నాటకాలలో షేక్స్పియర్ నాటకభావాలు గోచరిస్తాయి. ధర్మవరంవారికి పౌరాణిక నాటకాలమీద అభిమానమయితే కోలాచలంవారికి చారిత్రక నాటకాలమీద అభిమానం ఎక్కువ. కృష్ణమాచార్యులుగారికంటె ఎక్కువ

చారిత్రక నాటకాలు రాయడం, వాటిని ప్రజలు, నటులు ఎక్కువగా ఆదరించడం మూలంగా వీరికి "ఆంధ్ర చరిత్ర నాటక పితామహ" బిరుదు వచ్చింది. రామరాజు, ప్రహ్లాద, కీచకవధ, ద్రౌపది, చాందుబీ, రుక్మాంగద, సునందినీ పరిణయం ఎక్కువ ప్రజాదరణను పొందాయి.

కథా సంవిధానంలో, సన్నివేశ సృష్టిలో, పాత్ర చిత్రణలలో వీరు ఘటికులు. ఆంగ్లేయ సంప్రదాయాలను తమ నాటకాలలో ఎక్కువగా అనుసరించారు. వీరికి పాత్రోచిత భాషా ప్రయోగంమీద ఆదరణలేదు. రామరాజునాటకంలో ముస్లిం యువకుడు పఠానికి సంస్కృత సమాసభూయిష్టమయిన వచనం పెట్టారు.

నాట్యకళా ప్రపూర్ణ బళ్ళారి రాఘవ వీరి రుక్మాంగద, హరిశ్చంద్ర, ద్రౌపది, రామరాజు, ప్రహ్లాద, కీచకవధ, పాదుకా నాటకాలలో ప్రధాన భూమికలు ధరించేవారు

కోలాచలంవారు నాటకాలు ప్రహసనాలు కలిపి మొత్తం 30 రచనలు తెలుగులో చేశారు. వీటిలో 15 పౌరాణిక నాటకాలు, 7 చారిత్రక నాటకాలు, 2 కాల్పనిక నాటకాలు, 4 సాంఘిక నాటకాలు, రెండు ప్రహసనాలు. రామరాజు, కీచకవధ, శిలాదిత్య, విషాదాంత నాటకాలు. వీరికి ఆంధ్ర చరిత్ర నాటక పితామహ బిరుదు తెచ్చిపెట్టిన నాటకం రామరాజు. ఇది ఫాల్ ఆఫ్ విజయనగర్, విజయనగర రాజ్య పతనం అనే పేర్లతో ఎక్కువ ప్రసిద్ధి కెక్కింది. మహానటుడు బళ్ళారి రాఘవ దీనిని ఆంధ్రదేశమందేగాక మదరాసు, బెంగుళూరు, మైసూరు మొదలయిన పట్టణాలలో

ప్రదర్శించి మెప్పు పొందాడు. రామరాజు నాటకం బళ్ళారి రాఘవకు, బళ్ళారి రాఘవ అభినయ చాతుర్యం రామరాజు నాటకానికి వన్నె తెచ్చాయి. ఈ నాటక కథకు చారిత్రకాధారాలు ఎక్కువగా లేకపోయినా ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించింది. ఇది శృంగార వీర భీభత్స రసాలకు ఆలవాలం. అభినయించే నేర్పుగలవారికి . అభినయించడానికి ఎంతో సావకాశంగల నాటకం. ఇందులో నాయకుడు పతాన్‌రుస్తుం పాత్రను తీర్చి దిద్దడంలో కోలాచలంవారి ప్రతిభగోచరిస్తుంది. ఏదో ఒక రసముగాక శృంగార వీర భీభత్స భయానక కరుణా రసాలు అభినయించవలసి ఉంది ఈ నాటక కథా వస్తువు, నిర్మాణం, పాత్రోచిత భాషలమీద విమర్శక లోకంలో తర్జన భర్జనలు ఎక్కువగా జరిగాయి. "షేక్స్పియర్ కృతుల లోని హామ్లెట్, బ్రూటస్ పాత్రముల మనోవృత్తుల గొన్నిం టిని తమ పటూను కలంకరించినందున యీ నాటకమున రసో ద్రేకము మిక్కుటముగ జేరియున్నది. మరియు నాట్య చమత్కృతికి నవకాశములును మెండుగ నిందు గలవు... శ్రీని వాసరావుగారు పలుతావుల చారిత్రక విరుద్ధముగను, స్వభావ విరుద్ధముగను, శాస్త్ర విరుద్ధముగను ఈ నాటకము రచించి యుండిరి" (పురాణం సూరిశాస్త్రి)

ఇలాంటి గద్య పద్య మేళాత్మక నాటకాలు ప్రజాదరణ ఎక్కువగా పొందడంతో అప్పటివరకు వచనంలో నాటకాలు రాస్తున్న రచయితలంతా పక్కకు మార్చి గద్య పద్య మేళాత్మకంగా నాటకాలు రాయడానికి పూనుకున్నారు. భక్తవత్సలంవారు 217 పద్యాలు, 63 పాటలు, 15 'డ్యూయెట్లు'

పెట్టి చిరంతనీయం రాసి గద్య పద్య నేపథ్యాత్మక నాటకాలకు అంకురారోపణ చేశారు. చిలకమర్తివారి గయోపాఖ్యానంలో పద్యాలు 193. తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగం ఒక్కదానిలోనే పద్యాలు 338. బలిజేపల్లి వారి హరిశ్చంద్రలో 198 పద్యాలు, 22 పాటలు. ఈ పద్యాల పాటల మోజు పరాకాష్ఠకు వెళ్ళి కొందరు నాటక రచయితలు తమ నాటకాల పేర్లకుముందు 'సంగీతం' అనే మాట తగిలించ సాగారు. (సంగీత హరిశ్చంద్ర, సంగీత సావిత్రి వగైరా). పద్యాలు పాటలులేని నాటకం నాటకమేమిటనే స్థితికి నటులు, ప్రేక్షకులు దిగజారారు. తియ్యని మామిడని భ్రమించి ధర్మవరం వారు అలుగగట్టితే ఎవరెంత సాకినా చివరకు విషఫలాలు కాసింది!

1890 నుంచి అర్ధశతాబ్దంపైగా అశేషప్రజల ప్రీతిని ఆదరాభిమానాలను చూరగొన్న నాటకం చిలకమర్తివారి గయోపాఖ్యానం. ప్రఖ్యాతనటుడు ఇమ్మానేని హనుమంతరావు (రాజమండ్రి)గారి కోరికమీద రామకవి ప్రబంధాన్ననుసరించి, గ్రంథకర్త ఇరవై రెండవపట్ట దీనిని రచించారు. ఇందులోనికథకృష్ణార్జునయుద్ధం. కృష్ణార్జునులుప్రాణమిత్రులు. బావమరదులు. పార్థుడు కృష్ణునికి బహిఃప్రాణం. కృష్ణుడు పార్థునికి అర్ధశరీరం. అటువంటివారికి తొందరపాటువల్ల, మాటపట్టింపువల్ల వివాదంవచ్చి కత్తులుదూసుకోవడం అపూర్వంకావడంవల్ల సహజంగా జిజ్ఞాసకతను కలిగిస్తుంది. దానికి తోడు ఈ నాటకంలోని ప్రతి పద్యం ఒక ఆణిముత్యం. ఈ నాటకం అర్ధశతాబ్దంపాటు సర్వాలను తనయింపజేయ

డంలో, లక్ష్మీపై చిలుకు ప్రతులు అమ్ముడుపోవడంలో ఆశ్చ
ర్యంలేదు. ఈ నాటకం ప్రదర్శించని సమాజం ఆంటూ ఆ
కాలంలో లేదనే చెప్పాలి. ఈ నాటకం నాటకీయతకు ఆట
పట్టు కథను మలడంలో, సంభాషణలు నడపడంలో చిలక
మర్తివారి ప్రతిభ అడుగడుగునా ఈ నాటకంలో గోచరిస్తుంది.
ఈ నాటకంలో ప్రధానరసం వీరరసం. ఆ తరవాత ప్రాధాన్య
వంహించేది కరుణ – చివరి అంకంలో ఈ రెండు రసాలను
ఒకటితరవాత ఒకటి ఎంతో చక్కగా పోషించిన చిలకమర్తి
వారి నేర్పు ప్రశంసనీయం. ధీరోధాత్తనాయకులయిన కృష్ణా
ర్జునులు ఒకరినొకరు దెప్పిపొడుచుకోవడం ఔచిత్యభంగమైనా
రసవత్తరమయిన పద్యాలవల్లన మాసిపోతుంది.

మూడు తప్పులతో కూడిన ఈ నాటకసమస్య శంకరుని
'తుదితీర్పుతో' పరిష్కారమై, 'సంధియెనర్చుట ఒప్పు' అని
పిస్తుంది.

1892 లో ఆంధ్ర నాటక సాహిత్యంలో ఇంకో నూతన
యుగం ప్రారంభమయింది. ఆ సంవత్సరమే మహాకవి గుర
జాడ వెంకట అప్పారావుగారు కన్యాశుల్కం అనే మహా
నాటకం రచించారు. ఆ సంవత్సరం ఆగస్టు నెలలో విజయనగ
రంలో జగన్నాథ విలాసినీ నాటక సమాజంవారు ప్రదర్శిం
చారు. కాని అచ్చుమాత్రం 1897 లో పడింది. తెలుగు
నాటకాలలో వాస్తవిక జీవిత చిత్రణకు, వ్యవహారిక భాషలో
నాటక రచనకు అప్పారావుగారు నాందీపూజచేశారు. ఆంధ్ర
నాటక సాహిత్యంమొదట ఇంతిం తనరాని ప్రభావం నెరపిన
మహా నాటకం కన్యాశుల్కం. తెలుగులో స్వతంత్ర సాంఘిక

వచన నాటక సాహిత్యం ఆవిర్భవించడానికి మార్గదర్శక మయింది కన్యాశుల్కం. వ్యవహార భాషావాదానికి విజయ పతాక కన్యాశుల్కం నాటి సమాజంలోనివ్యక్తులలోని వైరు ధ్యాలను, కుళ్ళును, మూఢాచారాలను, అంధ విశ్వాసాలను కళాత్మకంగా తూచ్చారబట్టి నాటి ప్రజలను చైతన్య వంతు లనుజేసి, సంఘ సంస్కరణోద్యమానికి సుమఖులను చేసిన మహా నాటకం కన్యాశుల్కం. హాస్యరసంతో పైకి నొణికిస లాడుతూ, ఎంతో గంభీరతను లోలోపల నింపుకున్న మహా నాటకం కన్యాశుల్కం!

కనాశుల్కం అప్పారావుగారి సృష్టి. పాత్ర చిత్రణలో, రచనా శిల్పంలో, సన్నివేశ కల్పనా నిర్వహణలలో సాటిలేని మేటి నాటకం కన్యాశుల్కం. నాటి వివిధ తరగతుల ఛాందస బ్రాహ్మణులు, లుబ్ధులు, పండితులు, రౌడీలు, సంస్కర్తలు, పోకిరీలు,పోలీసులు,న్యాయవాదులు,తాగుమోతులు,వేశ్యలు, పూటకూళ్ళమ్మలు, అమాయకస్త్రీలు, బాలవితంతువులు, కోర్టుపక్షులు, దొంగబైరాగులు, సిద్ధాంతులు, వైద్యులు, మాంత్రికులు, నటులు, కుహనాసంస్కర్తలు మొదలైనవారి మనస్తత్వాలను, వైరుధ్యాలను, అప్పారావుగారు కన్యా శుల్కంలో ప్రతిబింబింపజేశారు. ఇందులోని పాత్రలు, జీవ కళతో ఉట్టిపడుతూ తెలుగువారి హృదయాలలో పీఠం వేసు కున్నాయి. గిరీశం, రామప్పపంతులు, అగ్నిహోత్రావధాని, వెంకటేశం, మధురవాణి నేటికీ మనకళ్ళముందు తారాడుతూం టారు.ప్రత్యేకంగాఆంధ్రనాటకసాహిత్యానికి అప్పారావుగారు

తీర్చిదిద్ది అర్పించిన పాత్రలు, మనుషులాని పాత్రలు గిరీశం, మధుర వాణి.

కన్యాశుల్కం నాటక రచనకు ప్రోత్సహించిన కారణాలను అప్పారావుగారే స్వయంగా ఇలా చెప్పారు:

"విశాఖపట్టణం జిల్లాలో మూడేళ్ళ కాలంలో జరిగిన బ్రాహ్మణ శుల్క వివరాలను తెలిపే ఒక జాబితా, విజయనగరం మహారాజావారి ఆజ్ఞానుసారం పదేళ్ళ క్రితం తయారు చేయబడింది... యిది ఆసక్తికర అమూల్య పత్రం. మూడేళ్ళల్లో ఏటా సరాసరి మూడు వందల నలభైనాలుగు చొప్పున మొత్తం ఒక వెయ్యి ముప్పైనాలుగు పెళ్ళిళ్ళు జరిగినట్లు ఈ పత్రం దాఖలా చూపింది... పొత్తిళ్ళల్లో వున్న శిశువులకు తల ఒక్కింటికి మూడు వందల యాభైనుంచి నాలుగు వందలదాకా ధర పలుకుతోంది. వింతనింపవచ్చును. కాని వాస్తవానికి కడుపులోవున్న శిశువులను సైతం అప్పుడప్పుడు అడగ వస్తున్నారు. పరువూ ప్రతిష్టా మంటగలిపే ఇలాంటి పరిస్థితులు తలెత్తడం సమాజానికే సిగ్గుచేటు ఇటువంటి దురాగతాలను బహిర్గతం చేస్తూ ఉన్నత నైతిక భావాలను వ్యాప్తిచేయడంకంటే, మిన్న అయిన లక్ష్యమూ, ప్రయోజనమూ సాహిత్యానికి వేరొకటి లేదు. అయితే ఇలాంటి ఆరోగ్యదాయక ప్రభావాన్ని ప్రసరింపజేయడానికి ప్రజలలో పఠనాసక్తీ అభ్యాసమూ కలిగేవరకూ, మనం రంగ భూమి వైపుకు దృష్టిని మళ్ళించక తప్పదు. ఈ ఆలోచనలు నన్ను కన్యాశుల్క నాటక రచనకు ప్రోత్సహించాయి.

"వ్యవహారిక భాష, గ్రాంథిక భాషకంటె ప్రజాసామాన్యానికి సులభదోతకమనేగాక, తెలుగు నాటక రచన కది సముచిత శైలి అనే విశ్వాసంతో నైతం నేనీ నాటకాన్ని వాడుక భాషలో రచించాను." (కన్యాశుల్కం తొలికూర్పు పీఠిక)

రచయిత లంతా గద్య పద్యాత్మకంగా నాటకాలు రచియిస్తుంటే వచనంలో ఎందుకు కన్యాశుల్కం రచించిందీ గురజాడవారు కన్యాశుల్కం తొలి పీఠికలోనే ఇలా తెలియ జేశారు:

"నాటకానికి అత్యావశ్యకమైనది అవిచ్ఛిన్నత,సంభాషణల సౌలభ్యం. ఇందులో దాని అసలు జీవం యిమిడి వుంది. తెలుగున ప్రయుక్తమవుతున్న ఛందస్సులు అనుప్రాసాది నియమాలవల్ల భాషకి అవిచ్ఛిన్నతను సౌలభ్యాన్ని కలిగించ లేకపోతున్నాయి. అలా కలిగించలేకపోతున్నాయి కదా అని నాటక శైలిలో నూత్న పద్య రచనా రీతులను ఎవరైనా కల్పించుకో ప్రయత్నించవచ్చు. కాని ఈ ప్రయత్నం, ప్రపంచ మంతటా నాటక ప్రయోజనాల కోసం, వచనం ప్రాముఖ్యానికి వస్తున్న ఈ రోజుల్లో అనవసరం. కనీసం హాస్య నాటకాలలో, మోదాంతకాలలో యిది శుష్కదంపుగ."

కన్యాశుల్కం ఆచారంమీద ధ్వజం ఎత్తడమేగాక, "స్వతంత్ర సంకీర్ణ యితివృత్త నిర్వహణకు, పాత్రీకరణ, ఔచిత్య పోషణకు కన్యాశుల్కంలో ప్రయత్నించబడింది."

(కన్యాశుల్కం పీఠిక) ఇంతకీ కన్యాశుల్కంలో ఇతివృత్తం కన్యలను అమ్మడం అని పైకి అనిపిస్తుంది.

కాని అప్పారావుగారు, "మానవ జీవితంతో నేను చెలగాటం ఆడడంలేదు... ఎట్టి తృణీకార భావమూ లేకుండా మానవ జీవితాన్ని గంభీరమైన దానినిగా భావించి యీ నాటకంలో దానిని యితివృత్తంగా స్వీకరించాను," అని లేఖలలో రాశారు. అంటే మానవజీవితమే కన్యాశుల్కం ఇతివృత్తం!

1892 ఆగస్టు నెలలో విజయనగరం జగన్నాధ విలాసినీ నాటక సమాజంవారు కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించారు ఆ నాటి ప్రదర్శనానికి నాటి విజయనగర ఆస్థాన పండితులు ముమ్ముంబవరాహ నరసింహస్వామిగారు నాందీ భాగం సంస్కృతంలో రచించి ఇచ్చారు. మేడేపల్లి వెంకట రమణాచార్యులుగారు దీనిని పఠించారు. ఆ నాడు గిరీశం పాత్రను నిష్ఠల చలపతి శాస్త్రిగారు నటించి ప్రశంసలను పొందారు. ఆ నాటి నాటక ప్రదర్శనం తిలకించిన పత్రికలవారు, సాహితీ మిత్రులు కన్యాశుల్కం నాటకాన్ని ఎంతగానో మెచ్చుకుని అభినందల వర్షం కురిపించారు. మచ్చుకు: "కన్యాశుల్కం రచనతో ఆంధ్ర నాటక సాహిత్యంలో ఒక సరికొత్త పద్ధతి, ఒక నూత్న పంథా ప్రారంభమయింది... పాత నాటకాలలో సాధారణంగా మృగ్యమైవుండే పాత్రీకరణమనే ప్రధాన లక్షణంతో కన్యాశుల్కం విరాజిల్లుతోంది," అని తెలుగుహారువపత్రిక అభినందించింది. "క్షీణిస్తున్న ఈ యుగపు అర్థరహిత నిష్ప్రయోజక సాహిత్య ప్రపూర్ణాల ప్రమేయం లేకుండా, తెలుగు సాహిత్య రంగంలో పాతుకుపోయివున్న వ్యాకరణ సూత్రా

లను, కవితా సమయాలను తృణీకరించి వాటికంటే ఉన్నత ప్రమాణాలను రచయిత అందుకుని కృతకృత్యు డయ్యాడు," అని ది పీపుల్స్ ఫ్రెండ్ పత్రిక ప్రశంసించింది.

సుప్రసిద్ధ సాహితీవేత్త రెంటాల నెంకటసుబ్బారావు గారు, అప్పారావుగారికి లేఖ రాస్తూ, "మీ నాటకంలో కొన్ని చోట్ల పాకులు వున్నా అవి చుక్కలు మాత్రమే. నాటక మంతటా విద్యుచ్ఛక్తి ప్రసరించినా, ఎన్నో వింత వింతల మెరుపులు మెరిసినా, అందులోని విద్యుత్ప్రవాహం నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ఎంత వెలుతురు నిచ్చినా ఆది తరగదు, చెదరదు!" అని కొనియాడారు.

కన్యాశుల్కం కథా విన్యాసం విషయంలో, రసం విషయంలో దేశంలో భిన్నాభిప్రాయా లున్నాయి. ఇందులోని ప్రధాన రసం ఏమిటి? హాస్యమా, శృంగారమా, కరుణా, భీభత్సమా? ఇది సుఖాంత నాటకమా, విషాదాంత నాటకమా? కథా నాయకు డెవడు? గిరీశమా? అగ్నిహోత్రావధానులా? లుబ్ధావధానులా? కరటకశాస్త్రులా? సౌజన్యారావా? లేక నాయిక మధురవాణి నాయకత్వం వహించిన నాటకమా? ప్రతి నాయకు డెవడు? కథకు ఆదిమధ్యాంతా లేమిటి? కథా వస్తు వేమిటి? సుబ్బి పెళ్ళా? లేక బుచ్చమ్మమీది గిరీశం ప్రణయమా? ప్రారంభం ఎక్కడ? ప్రయత్న మెక్కడ, ప్రాప్త్యాశ (Crisis) ఎక్కడ? నియమిత ఫలప్రాప్తి ఎక్కడ? ఫలప్రాప్తి ఎక్కడ? పంచు సంధులు సరిగా ఉన్నాయా? లేక ఇబ్సెన్ నాటకాలలోలాగా ఆది, మధ్య, అంత్య సంధులు మూడేనా? గిరీశం పాత్ర శీలంలేని కీలకం ఏమిటి? నిజంగా

బుచ్చెమ్మను వివాహం మాడ దలచాడా? లేక తుణకానందం కోసం ప్రేమిస్తున్నట్లు నటించాడా? సోజన్యారావు బుచ్చెమ్మను పూనాలోని విడ్డోహూంకు పంపకిపోతే ఏమి జరిగేది? ఇలాంటి ప్రశ్నలు కన్యాశుల్కంనాటకివిషయంలో జనిస్తాయి. వీటన్నిం టికీ కావలసిన ఉపపత్తులు దొరుకుతాయి.

ఏ కోణంలోనుంచి చూస్తే దాని కనుగుణండా రంగు గాజులు కనిపించే చిత్రదర్శిని (Keleidoscope) లాంటిది కన్యా శుల్కం. ప్రాచ్య పాశ్చాత్య నాటక లక్షణాలకు అతీత మయిన స్వతంత్ర లక్షణ లక్షిత నాటకం కన్యాశుల్కం. ఆ లక్షణాలతో కన్యాశుల్కాన్ని కొలవడానికి,ఆలక్షణాల చట్టంలో ఇరికించి చూపడానికి యత్నించడంకంటె దీనినే విశ్లేషించి సరికొత్త లక్షణం ఏర్పరచుకోవడం ఉత్తమం. దానికదే సాటి అయిన నాటకం కన్యాశుల్కం. ఇలాంటి నాటకమే రష్యన్ మహా రచయిత మాక్కిం గోర్కీ రచించిన పతిత జీవులు (Lower Depths).

ఇలా చిత్రదర్శినిలాగా కన్యాశుల్కం కనిపించడానికి కారణం గురజాడవారు "అతి సంకీర్ణ సాంఘిక పరిస్థితులతో సంఘటితమైవున్న" ఆనాటి మానవజీవితాన్ని యితివృత్తంగా స్వీకరించడమే. మహాకవి శ్రీ శ్రీ అన్నట్లు "కన్యాశుల్కం గొప్పది. జీవితమంత గొప్పది."

సాంఘిక నాటకాలకే వ్యవహారిక భాష ఉపయోగి స్తుందిగాని పౌరాణిక చారిత్రక నాటకాలకు ఉపయుక్తంకాదని వ్యవహార భాషావాదం గిట్టని పంతులు వాదించడం మొదలు పెట్టారు. ఆ సవాలును అందుకుని ఆప్పారావుగారు 1910 లో

బిల్హణ కవిగాథను నాటక రూపంలో వ్యవహారిక భాషలో రచించడానికి పూనుకున్నారు. రెండు అంకాలు మాత్రమే రచించారు. అది అసంపూర్ణంగానేఉండిపోయింది.కన్యాశుల్కానికి నమూనా అనదగిన కొండుభట్టీయంకూడా అసంపూర్ణమే. కళ్ళికోట యుద్ధాన్ని సౌదామిని అనే పేరుతో రాయాలని పథకం వేసుకున్నారు కాని రచన సాగలేదు. ఇంగ్లీషులో చిత్రాంగి నాటకం రచించారు. అదీ పూర్తిగా లభించినట్టు లేదు. ఏమయినా అప్పారావుగారి ప్రతిభ తార్కాణంగా, వారి నాటక కళావైదుష్యానికివిజయపతాకగాకన్యాశుల్కం నాటకం చిరకాలం వర్ధిల్లుతుంది. ఈసంవత్సరమే కన్యాశుల్కం రష్యన్ భాషానువాదం వెలువడడం ఆంధ్రులకు గర్వకారణం.

అదేమి విచిత్రసంఘటనోగాని కన్యాశుల్కం నాటకం అచ్చయి వెలువడిన సంవత్సరమే (1897) ఇంకో గొప్ప నాటకం కళాప్రపూర్ణ వేదం వెంకటరాయశాస్త్రిగారు రచించిన ప్రతాపరుద్రీయం వెలువడింది. తెలుగులో ఇదే తొలి చారిత్రక నాటకమని భావించవచ్చు. ప్రతాపరుద్రీయంకూడా తెలుగు నాటకాలమీద ఎంతగానో తన ప్రభావం నెరపింది. తెలుగులో చారిత్ర నాటకాల అవతరణకు మార్గదర్శకమయింది. అంతేగాదు. ప్రతాపరుద్రీయ నాటక రచనతో తెలుగు నాటకాల రచనలలోనే పెద్దమార్పువచ్చింది. వేంకట రాయశాస్త్రిగారు సంస్కృతనాటకాలంకార శాస్త్రంలో పండితులు. ప్రతాపరుద్రీయ నాటక రచనకు ముందే శ్రీహర్షుని నాగనంద నాటకం (1891), కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతల నాటకం (1896) అనువదించారు. సంస్కృత నాటకాలలో

ప్రధాన పురుష పాత్రలకు సలక్షణ సంస్కృత భాషను, స్త్రీ పాత్రలకు నీచపాత్రలకు సంస్కృత గ్రామ్యాలైన ప్రాకృతాది దేశ భాషలను నాటక రచయితలు ప్రవేశ పెట్టారు. సంస్కృత నాటక లక్షణకారులుకూడా పాత్రోచితభాషను వాడాలని నిబంధించారు. శాస్త్రిగారు తమ సంస్కృత నాటకానువాదాలలో సంస్కృత నాటక లక్షణానుసారం ప్రధాన పాత్రలకు సలక్షణ ఆంధ్రం, స్త్రీ నీచ పాత్రలకు వ్యవహారిక భాష వాడారు. ఆ పద్ధతినే తమ స్వతంత్ర నాటకం ప్రతాపరుద్రీయంలోకూడా వ్యవహారిక గ్రామ్య భాషలను వాడడమే గాక తురక తెలుగునుకూడా ముస్లిం పాత్రలకు వాడారు. దానిమీద శాస్త్రిగారి ప్రతిపక్షులు వ్యవహారిక భాష వాడినందుకు అధిక్షేపించగా వారికి సమాధానంగా 1901 లో "గ్రామ్యభాషా ప్రయోగ నిబంధనము" అను ప్రామాణిక గ్రంథంచించిపాత్రోచితభాషావాదాన్ని స్థాపించారు.అప్పటి వరకు రాజు పాత్రనుంచి సేవకుని పాత్రవరకు గ్రాంథికభాష వాడుతూ వచ్చిన తెలుగు నాటక రచయితలు స్త్రీ పురుష నీచపాత్రలకు వ్యవహారికాంధ్ర భాష వాడజొచ్చారు. చిత్రనళీయంలో నీచపాత్రలకు గ్రాంథికం పెట్టిన ధర్మవరంవారు విషాద సారంగధరలో తలారులకు గ్రామ్యం వాడారు.

ప్రతాపరుద్రీయంలో కథా విధానంలో, పాత్ర చిత్రణలో, రసపోషణలో పాత్రోచితభాషాప్రయోగంలో ఉత్తమ నాటక స్థాయిని అందుకుని తరువాతి నాటక రచయితలకు మార్గదర్శక మయింది. ఇందులోని పాత్రోచిత భాషా ప్రయోగం అసమానం. వల్లీఖాను మొదలయిన ముస్లింలలో

తురక తెలుగు, పేరిగాడు మొదలయిన నీచపాత్రలకు గ్రామ్యం, ఎంతో సహజంగా ఉండి, ఆ యా పాత్రలకు అతికిపోయి ఆ పాత్రలు మన ముందు ప్రత్యక్షమయి మాట్లాడుతున్నట్లు భ్రమ చెందుతాం.

శాస్త్రిగారికి వీరరసం అంటె అభిమానం హెచ్చు. ప్రతాప రుద్రీయంలోని ప్రధాన రసం ధర్మవీరం. బొబ్బిలి నాటకంలో ప్రధాన రసం యుద్ధవీరం. ఈ రెండు నాటకాల లోను ఆ యా రసాలను కడు సమర్థతతో నిర్వహించి చిప్పిల్లే ట్టు చేశారు. ప్రతాపరుద్రుని చెరనుంచి విముక్తి చేస్తానని యుగంధరుడి ప్రతిజ్ఞా పూర్వక ఉత్సాహంతో నాటక బీజం పడ్డడి, యుగంధరుడు పిచ్చివాని వేషములో ఢిల్లీకి వెళ్ళడంతో ప్రయత్న మారంభమయి, వజ్రాల వర్తకులు ఢిల్లీ సుల్తాన్‌ను దర్శించి వజ్రాలు జూడడానికి ఓడలోకి రమ్మని ఆహ్వానించడంతో ప్రాప్త్యాశ కలిగి, ఓడలో వల్లీఖాన్ ప్రభృతుల వధతో నియతఫలప్రాప్తిగాంచి, ఓడ ఓరుగల్లు చేరి ప్రతాపరుద్రుని చెరవి ముక్తయి తిరిగి సింహాసనం ఎక్కడంతో ఫలప్రాప్తి కలుగుతుంది.

విశాఖదత్తునిముద్రారాక్షసంలాగానే ప్రతాపరుద్రీయం కూడా రాజకీయపు ఎత్తులతోకూడిన నాటకం. యుంగధరుని ఎత్తులు చాణక్య రాక్షసుల ఎత్తులను తలపిస్తూంటాయి.

ఈ నాటకంలో అడుగడుగునా హాస్యం తొణికిసలాడుతూంటుంది. పదగత, వాక్యగత, సన్నివేశగత హాస్యంతో నిండి కడుపుబ్బ నవ్వుపుట్టిస్తుంది! పేరిగాని సారాచెంబు సీను, పిచ్చివాని సీను హాస్య రసానికి ఆటపట్టులు. ఈ హాస్యంలో

నాటకీయ వ్యంగ్యం (Dramatic irony) ఇమిడి ఉండి ప్రేక్షకులను అలరింపజేస్తుంది.

గర్భాంకమనే అంతర్నాటకం తెలుగు నాటకం (ప్రతాపరుద్రీయం)లో ప్రవేశపెట్టడానికికూడా ఆద్యులు శాస్త్రిగారే.

అయితే ప్రతాపరుద్రీయ కథకు చారిత్ర కాధారాలు తక్కువ. నల్లీఖాన్ ప్రతాపరుద్రుని బందీచేసి తీసుకువెళ్ళు తూంటే దోవలో గోదావరిలో ఉరికి ఆత్మహత్య చేసుకున్నట్లు చరిత్ర చెప్పుతుంది. యుగంధరుడు, పేరిగాడు, జనాగన మంత్రి చారిత్ర పురుషులు కారు. నాటకం సుఖాంతం చేయాలనే లక్షణా న్ననుసరించి శాస్త్రిగారు కథ మార్చారు. భాస మహాకవి ప్రతిజ్ఞా యౌగంధరాయణంలోకూడా వత్స రాజును శత్రురాజు మోసంతో బందీనిచేస్తే మంత్రి యౌగంధరాయణుడు పిచ్చివాని వేషంతోవెళ్ళి మోసంతోనే విడిపిస్తాడు. ఈ రెండు నాటకాలకు ఎక్కువ సామ్యం ఉంది. యౌగంధరాయణుడే యుగంధరుడుగా అవతరించాడా? శాస్త్రి గారు భూసుని నాటకం చదివి ప్రతాపరుద్రీయం రాశారా అనిపిస్తుంది

చరిత్రను ఇంతగా మార్చడం తప్పని త్రిపురనేని రామస్వామిచౌదరిగారు అభిక్షేపిస్తూ గేయం రాయడం, చౌదరి గారికి సమాధానంగా,మార్చవచ్చని దువ్వూరి రామిరెడ్డిగారు శాస్త్రిగారిని సమర్థిస్తూ వ్యాసం ప్రచురించడం ఆనాటి సాహితీలోకంలో సంచలనం కలిగించింది.

ఇక శాస్త్రిగారి మూడో నాటకం ఉష. ఉష, 'సుధా రస ప్రవాహం' అని వారే చెప్పుకున్నారు. బొబ్బిలిలో ఉషలో వీరు వాడిన హాస్యం మోటుగా చవకబారుగా ఉండి వెగటు పుట్టిస్తుంది. బాణాసురుని మేనల్లుడికి ఉషోధాప్రతికిమధ్య శృంగార ఘట్టాలు, "చదవడానికి అసహ్యమే. వినడానికిరోతే. మొత్తి అశ్లీలం తప్ప మరేమీ కనిపించదు. శాస్త్రిగారు 'బఫూనరీ'ని హాస్య చమత్కారా లనుకుంటున్నారు...ఉష నాటకంలోని శృంగారం, వైలిపాతఫక్కి. తలనొప్పి.చిరాకు. అన్నీ పాత సంప్రదాయాలే. అంతా కన్వెన్షన్‌మయం... పాత్రౌచిత్యమూలేదు కదలికాలేదు." (గురజాడ లేఖలు).

ఏమయినా ప్రప్రథమాంధ్ర చారిత్రక నాటకకర్తగా పాత్రోచిత భాషావాద నిరూపకుడుగా వేంకటరాయ శాస్త్రి గారి పేరు చిరస్థాయిగా ఉండిపోతుంది.

1880-1909 వరకు తెలుగు నాటక సాహిత్యాన్ని సమీక్షిస్తూ మహాకవి గురజాడ చెప్పింది గమనించ దగ్గది. "పోనీ మంచి నాటకాలయినా మనకు ఆట్టే కనిపించవు. కేవలం వినోద సాఫల్యం కోసం తప్ప అతి సంకీర్ణ సాంఘిక పరిస్థితులలో సంఘటితమైవున్న ఆధునిక జీవితాన్ని నాటక రచయిత లెవరూ స్పృశించక కేవలం నిర్లక్ష్యం చేస్తున్నారు. శృంగార ఘట్టాలనే విసుగుపుట్టే పర్యంతం మన రచయితలు అల్లుకపోతున్నారు. రచయితల స్వతంత్ర కల్పనాశక్తి విహీన తక్కు భావ దారిద్ర్యానికి ఇంతకంటె వేరే నిదర్శనం అక్కర లేదు. అంతోయింతో రచనా శిల్ప పరిజ్ఞానాన్ని ప్రదర్శించ గల రచయితలు కొద్ది మంది."

20 వ శతాబ్దంతోపాటు వెలుగులోకి వచ్చిన ఇంకో సుప్రసిద్ధ నాటక రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు. వీరు సంస్కృ తాంధ్ర నాటకాలను, వాటి లక్షణాలను క్షుణ్ణంగాపరిశీలించినవారు. వీరు షేక్స్పియర్ లాగానే 32నాటకాలు రాశారు. పౌరాణిక,చారిత్రక,సాంఘిక నాటక ప్రక్రియలన్నింటినీ చేటి సమర్థతతో నిర్వహించారు. రాధాకృష్ణ (1901), విప్రనారాయణ (1909), కంఠాభరణం (1917), పాదుక (1919), ప్రచండ చాణక్యం (1909) తెలుగు ప్రజల మన్ననలను ఎక్కువగా చూరగొన్నాయి. రాధా కృష్ణలో మధుక భక్తిని, విప్రనారాయణలో దాస భక్తిని, పాదుకలో పితృ భక్తిని వీరు చిత్రించారు. వీరి కంఠాభరణాన్ని సాంఘిక ఉత్తమ నాటకాలలో ఒకటిగా పరగణిస్తున్నారుగాని,కూతుళ్ళ కోడళ్ళ ముండామోస్తే కూర్చుని ఏడవడానికి వేరు వేరు గదులు కట్టించిన సోమయాజులవంటి ఛాందస పాత్ర ఏ శతాబ్దంలోనైనా ఉంటుందా అని సందేహం పాఠకులను నెంటాడుతూనే ఉంటుంది. పానుగంటివారు హాస్య ప్రియులు. హాస్య రచనలో సిద్ధహస్తులు. వీరి నాటకాలలో హాస్యం ముందుకు దూకుతూ, ఒకొక్కప్పుడు అతియై గభీర రంగాలను, పట్టులను చెడగొట్టడంకూడా కద్దు. నిత్య జీవితంలో తారసిల్లే ఉపమానాలను ఎంచుకున్నా ఒక ఉపమానంతో తృప్తిచెందక అమర శ్లోకంలాగా ఓ డజను ఉపమానాలను ప్రయోగించడం వీరికి పరిపాటి. పాత్ర చిత్రణలో, కథా సంవిధానంలో, సంభాషణా రచనలో దిట్టలు

పానుగంటివారు గ్రాంథికవాదులు పాత్రోచిత భాష వారికి నచ్చలేదు. ఎక్కడా వ్యవహారిక భాష వాడినట్లులేదు. వీరి శైలి అటు పచ్చి గ్రాంథికమూగాక ఇటు శుద్ధ వ్యవహారికమూకాక మధ్యే మార్గంగా ఉంటుంది. సంభాషణలు ఒక దానిలోంచి ఒకటి పుట్టుకువచ్చినట్లు ఎంతో ఉక్తివైచిత్రితో భాశిస్తుంటాయి. లోగోక్తులు కోకొల్లలుగా దొరుకుతాయి. కాని మధ్య మధ్య పాత్రలు ఉపన్యాస ధోరణికి దిగి ప్రేక్షకులకు విసుగెత్తిస్తుంటాయి. సంభాషణల మధ్యలో దీర్ఘ స్వగతాలు, వరస పద్యాలు పెట్టడంవల్ల నాటక ప్రయోగంలో కొంతచిక్కు వస్తూనేఉంటుంది. ఆ దీర్ఘ స్వగతం, ఆ వరసపద్యాలు పూర్తి అయేవరకు పక్కనటునికి అవస్థగానే ఉంటుంది.

నాటకాలలో ఉత్పలమాల చంపకమాల వంటి వృత్తాలు. వింతవృత్తాలు పనికిరావని, తేటగీతి సీసం, ఆట వెలదిలాంటి తెలుగు ఛందస్సులే వాడాలని వాదిస్తూ తదనుగుణంగా నాటకాలు రాశాడు. వారివాదాన్ని ఉద్ఘాటిస్తూ నాటక పద్య పరిశీలన అనే వ్యాసంలో ఇలా రాశాడు:

"వృత్తములకు తాళంబన్నసిద్ధమైయున్నది. తాళంతో తాండవ ముద్భవించును, పాత్రౌచిత్యము భగ్నమగును. రసముధ్వంస మగును. సహజత్వము చచ్చును. పాటల వలెనే యథారూపు వృత్తములు నాటకముల నుండ దగవు. నాటకమున పాటపాడుకొట్లు సహజమో పద్యములు పాడుటట్లే అసహజము. ఆ పద్యములు సామాన్య వృత్తములైనను, వింత వృత్తములైనను, అన్ని వృత్తులు నాటకములనుండి బహి

పకరింప వలసినదే. పూర్వ కవులు పాత్రముల సందర్భోచిత గసావస్థల నెరింగి వానిని ననువగు రీతి ప్రదర్శించుటకు పద్యములు నల్లిరి. తాళ సందర్భ గహితములగు వృత్తముల నిరాకరించి కేవలము వచనమువలె నడుచు వృత్తములను ఉపయోగించినట్లు కనబడుచున్నది. ప్రస్తుతమైన అభిప్రాయమున్నయెడల దాని నుపమా ర్థాంతరన్యాసాలంకారములతో మేళవించి ధారగా యోగ్యము చేయుటకై నడకయందు వచనముకంటె విశేష భేదము లేని వృత్తములలో నినుడ్చి చుండిరి. ఆంగ్లేయుల బ్లాంకు వర్సుకు సమానమైనవి సంస్కృతములో ఆర్యావృత్తము, అనుష్టుపు నున్నవి. వానికి తెలుగులో తేటగీత సమానమై యున్నది. తేటగీతకు జన్మసిద్ధమైన యొక నడక లేదు. దీనికంటె ఛందస్సున వచనమున బోలిన పద్యము లేదు. నాటకములోని గీత పద్యములను, గీతములవలె చదువబోయిన అవి నడవకుండునట్లు ప్రాయవలెను. అవి వచనములని చదువుకొని నడవవలయును. సీసము,ఆటనెలది కూడ నుపయోగ పర్చనచ్చును. వీనిని చదువలసి వచ్చినపుడు ఆ యా రసభేదోచిత కంఠరవ పరిపాకముల జదువ వలయును. గాన ఘోరణిని పాడకూటదు. నాటకప్రయోగ ప్రపంచము. పాత్రము లందలి నయలు."

పానుగంటివారు గద్య పద్య సమ్మిళిత మయిన పౌరాణిక నాటక రచన నర్మదాపుర కుత్సీయం, (1900)లో ప్రారంభించి, వచన సాంఘిక నాటకం రాతి స్తంభం (1930)లో నాటక రచనా వ్యాసంగం పూర్తిచేశారు. వీరు సంస్కృత నాటక మర్యాదలనే ఎక్కువగా పాటించినట్లు కని

పిస్తుంది. నర్మదా పురుకుత్సీయంలో పంచసంధులను తిచ్చి తంగా పాటించారు. పాశ్చాత్య నాటకాలలాగా అంకా లను రంగాలుగా విభజింపలేదు ఒకొక్క అంకం ఒకొక్క రంగం.

సారంగధర కథను మోదాంత నాటకంగా (1909) రచించిన వీరు తరవాత తరవాత విషాదాంత నాటకముల విష యమున మనసు మార్చుకుని పూర్ణిమ (1919), రాతి స్తంభం (1930) విషాదాంతంగా రచించారు. 'సాక్షిలో నాటక ప్రదర్శనము' అను శీర్షికలో, "మన నాటకములు ప్రకృతి ననుసరించి పోవక భరతవాక్య మాంగళ్యనముకై ప్రాకులాడనేల? జీవితమంతయు కష్టభూయిష్టమైయుండ, ప్రపంచము ప్రాగబ్ధ భోగ్యసీమగ నందరు నమ్మ్రచుండనట్టి సాంసారిక కష్టములను సుఖదుఃఖముల చక్రనేమిక్రమమును యథారూపమున ప్రకృతిసిద్ధముగ చిత్రింపక నాటకాంతమున నే రుషినో, శంకరునో, నెయసంభావి తయసందర్భ విశేష మునో ప్రవేశపెట్టి మంగళం సమకూర్చి యత్నించుట మన నాటకముల మిక్కిలి శోచనీయముగ నున్నది.",

నాటకాలలో పద్యాలు కుప్పలు తిప్పలుగా కుప్పించిన పానుగంటివారు వారి రచనల ఆఖరి దశలో గద్య పద్య నాట కాల కంపెు వచన నాటకాలే ప్రదర్శనానికి, అభినయానికి ఎక్కువ అనువయినవని గుర్తించి (పద్మినినాటక పీఠిక) పద్మిని (1928), విచిత్రవివాహం, రాతి స్తంభం (1930) పూర్తి వచన నాటకాలుగా రచించి వచననాటకాల ప్రాశస్త్యాన్ని చాటారు.

వీరి నాటకా లన్నింటినీ సమీక్షిస్తూ నండూరి బంగా రయ్యగారు, 'పానుగంటివాది రచనా పాటవం'అనే వ్యాసంలో చెప్పినది గమనింప తగ్గది. "ఏ యే పాత్రలను నే యే యవస్థ లలో నెట్లు మాటాడింపవలెలో, వారి మనోహర వైఖరుల నెట్లు ప్రకటింపవలెనో వీరికి తెలిసినట్లు మన నాటక కవుల కెవ్వరికీ తెలియదు. వారి వారి పాత్ర పోషణమును, పాత్రో న్మీలనము ఘనన్య సాధ్యములు..."

పౌరాణిక నాటకాలకు విజయపతాక తిరుపతి వెంకట కవుల పాండవ నాటకాలు. వీరు మహా భారత కథ నంతినూ పాండవ జననం (1909), పాండవ రాజసూయం (1921), పాండవ ప్రవాసం (1908), పాండవోద్యోగం (1911),పాండవ విజయం (1914', పాండవాశ్వమేధం (1913) అనే ఆరు నాట కాలుగా రచించారు. ఇవన్నీ గద్య పద్యాత్మకాలయినా పద్య భూయిష్ఠాన్నిబట్టి వీటిని పద్య నాటకాలన్నా తప్పుగాదు. సామాన్య ప్రజానీకానికికూడా చక్కగా అర్థమయేటట్లు చిన్న చిన్న మాటలతో సరళ సులభశైలితో ఈనాటకాలు రచించ డంతో వాటినుంచి ఇవి తెలుగు నాటక రంగాన్ని పాలించ సాగాయి. ఈ నాటకాలలో ముఖ్యంగా పాండవోద్యోగ విజ యాలలో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యం లేకపోవడంతో వీటికి ప్రదర్శనా సౌలభ్యంకూడా అలవడింది. చిలకమర్తివారి పద్యాలలాగానే పాండవోద్యోగ విజయాలలోని పద్యాలు తెలుగుపారి నాలుకలఖిూద తాండవిస్తున్నాయి

అయితే అడుగడుగికి పద్యాలు పెట్టడంతో నాటక ప్రయోగానికి, అభివయానికి కొన్ని కొన్ని పట్టుల గట్టి

చిక్కే వస్తుంది. ఈ నాటకాలలోని కొన్ని కొన్ని పాత్ర లను, కొన్ని కొన్ని ఘట్టాలను ఎత్తివేసి ప్రదర్శించినా నాట కానికేమీ లోటురాదు. ఈ లక్షణం వీరి నాటకాలలోనేగాక ఆనాటి నాటకాలన్నింటిలో కనబడుతుంది. వీరు చూళికల దగ్గరనుంచి సంస్కృత నాటక మర్యాదలను ఎక్కువగా పాటించారు.

పాండవ నాటకాలలోని కథా సంవిధానం, దృక్పథం ఆంధ్ర మహా భారతా న్ననుసరించే ఉన్నాయి. దృశ్య మానం చేయడానికి నాటకీయతగల ఘట్టాలను ఎంచుకొని వాటిని రమణీయంగా నిర్వహించారు. పాత్ర చిత్రణలో కూడా వీరు గొప్ప ప్రతిభ ప్రదర్శించారు. పాండవోద్యోగ విజయాలలో కృష్ణుని ప్రపంచ నాటక సూత్రధారిగా, బహు ముఖ ప్రజ్ఞాశాలిగా చిత్రించారు. దుర్యోధనుని రాజసం, కర్ణుని స్వామిభక్తి,ధర్మరాజు నీతి, భీష్మునికృష్ణభక్తి, అశ్వ త్థామ ఔదత్యం వీరి నాటకాలలో స్పష్టమవుతాయి.

ధీరోదాత్త నాయకుడయిన ధర్మరాజుచేత భారతంలో లాగా అబద్ధమాడించడం నాటకంలో తగదని భావించి ధర్మ రాజుచేతగాక ధర్మరాజు వేషంలోని హిడింబిచేత అశ్వత్థామ మరణించినట్లు చెప్పించడం నాటకౌచితికి వన్నెతెచ్చింది.

సంస్కృతంలో వేణీసంహారం, దూతవాక్యం (కృష్ణ రాయబారం)ఊరుభంగం నాటక.నాటికలతో పాండవోద్యోగ విజయాలను పోల్చిచూస్తే ఆ సంస్కృత నాటక కవుల తిరు పతి వెంకటకవులు రచనా విధాన వైఖరిలోని విభేదం ద్యోతక మవుతుంది. భాసభట్టు నారాయణులు కథను వెనకకునెట్టి

పాత్ర చిత్రణమీాదనే దృష్టి నంతటిని కేంద్రీకరించారు కథా చిత్రణకంటె పాత్ర చిత్రణకు ప్రాధాన్య మెాచ్చు. ఇక తిరుపతి వెంకట కవులు పాత్ర చిత్రణ కంటె కథా చిత్రణకే ఎక్కువ ప్రాముఖ్య మిచ్చారు. ఆ యీ నాటకాలు చదువు తూంటె ఈ వ్యత్యాసం స్పష్టంగా గోచరిస్తుంది. తిరుపతి వెంకట కవులు పండిత రాజం, సుకన్య, అనర్ఘ నాగదం, ప్రభావతి ప్రద్యుమ్నం మొదలయిన స్వతంత్ర నాటకాలు రచించినా, ముద్రారాక్షస, మృచ్ఛకటికాది సంస్కృత నాటకాలు అనువదించినా వారి పేరు ఎత్తేసరికి వారి పాండవ నాటకాలే జ్ఞాపకం వస్తాయి.

మహదాంధ్రాభిమానంతో వేదం వారు ఆంధ్ర చరిత్ర లోని ఘట్టాలను నాటక రూపంగా వెలయించి చారిత్రక నాటకాలకు నాందీపూజ చేయగానే కాళ్ళకూరి సాంబశివరావు గారు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు బొబ్బిలి కథను, కోలాచలంవారు విజయనగర రాజ్య పతన గాథను, ధర్మవరం కృష్ణమాచార్యులుగారువిషాదసారంగధరనుగోపాలాచార్యులు గారు రామదాసు భక్తి గాథను, పానుగంటి, కాళ్ళకూరి నారాయణరావు, విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రభృతులు సారంగధర చరిత్రను నాటకాలుగా రాశారు. 1910-20 మధ్య వచ్చిన చారిత్రక నాటకాలలో ఆంధ్ర చరిత్రకు సంబంధించిన నాటకాలే ఎక్కువ.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి బొబ్బిలి నాటకం రంగస్థలంమీాద పలుసార్లు ప్రదర్శితమై ప్రజాదరణను పొందింది. ఇందులోని పద్యాలుకూడా ఎంతో రమ్యంగా ఉండి ప్రజల

నోట మెచ్చులు తూంటాయి. ధర్మవరం గోపాలాచార్యులు గారు రామదాసు భక్తి తత్వాన్ని పలుభంగుల చిత్రించారు. ఇందులోని పద్యాలను చాలా మంది నిత్య జీవితంలో పూజా భజన సమయాలలో పాడుకుంటూ ఆనందిస్తున్నారు. వీరు నాటకం ఆదినుంచి చివరకు రామదాసుయొక్క భౌతిక ఆంతర సంఘర్షణలను చక్కగా చిత్రించారు. జైలు సీను నటులకు ఒరపిడి రాయివంటిది. చరిత్రకందని అమానుష సంఘటనే (రామ లక్ష్మణులు తానీషాకు కనిపించి రామదాసు అప్పును తీర్చడం) నాటక సమస్యను పరిష్కరిస్తుంది.

ఈ దశలో (1910–20) పౌరాణిక నాటకాలను విరివిగా వెలువడసాగాయి. వాటిలో బలిజేపల్లి వారి సత్యహరిశ్చంద్రీయం (1918) తక్కిన హరిశ్చంద్ర నాటకాలను తోసి రాజని తెలుగు ప్రజల హృదయాలలో నాటుకుపోయింది. క్షేమేంద్రుని సంస్కృత చండకౌశిక నాటి కథను అనుసరించకుండా బలిజేపల్లి వారు శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యాన కథను అనుసరించారు. చండకౌశికం శృంగార వీరరస ప్రధాన నాటకం. బలిజేపల్లి వారుకూడా తమ హరిశ్చంద్ర నాటకాన్ని వీరరస ప్రధానంగా రచించాలని ఎంతయత్నించినా శోక రసానిదే పై చేయి అయింది. హరిశ్చంద్ర నాటకమే ఏడుపు నాటకమని ప్రసిద్ధి వచ్చింది.

చండకౌశిక నాటకంలో హరిశ్చంద్రుడికి విశ్వామిత్రుడికి విద్యల విషయంలో ప్రత్యక్ష సంఘర్షణ వస్తుంది. ఆ సంఘర్షణేచండకౌశిక నాటకానికిబీజం. శంకరకవిని అనుసరించడంవల్ల బలిజేపల్లి వారి హరిశ్చంద్రలో విశ్వామిత్రుడు, వసి

ష్ణుసితో ఘున్నణపడి, ఆ ఘున్నణలో తలదూర్చని హరిశ్చం
ద్రుని నానా అవస్థల పాలుజేస్తాడు. బలిజేపల్లివారి హరి
శ్చంద్రలోని కాటిసీను రసవత్తర సృష్టి. శోకరస పరాకాష్ఠ.
ప్రేక్షక పఠిత హృదయాలను పట్టివేస్తుంది. కన్నీరు బొట
బొటా రాలుతుంది కడమా నాటకమంతా ఒకఎత్తు, కాటి
సీను ఒకఎత్తు బలిజేపల్లివారి ప్రతిభ ఈ కాటిసీనులో కాన
వస్తుంది. నటుతక పాత్ర చిత్రణ వీరి ప్రత్యేకత. ఈ నాట
కంలోని పద్యాలు హృదయం గమంగావుండి మనప్రకురాన్వు.

ఈ సందర్భంలో కందుకూరివారి హరిశ్చంద్రను
కూడా సంస్మరించవలసి ఉంది వీరేశలింగంగారుకూడా
శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానాన్నే అనుసరించారు. వీరి
నాటకమూ కొంతకాలం తెలుగు నాటక రంగాన్ని ఏలిందే.
ఇందులోని కాటిసీను రసవంతమయిందే. అయితే ఆనాడు
మహానటుడుగా పేరుగాంచిన హరిప్రసాదరావుగారు బలిజేపల్లి
వారి హరిశ్చంద్రను చేబట్టడంతో దానికే అధిక ప్రచారం
వచ్చి కందుకూరివారి హరిశ్చంద్ర మరుగున పడిపోయింది.

చిలకమర్తివారి పారిజాతాపహరణం, ప్రసన్నయాదవం,
శ్రీరామల సచ్చిదానందశాస్త్రిగారి సావిత్రి, మారేపల్లివారి
బిల్వణీయం, పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి లవకుశ,
కృష్ణలీల, ఆకెళ్ళ, కాశీనాథుని వీరమల్లయ్యగారి నాటకాలు
ఈ దశాబ్దంలో ఎక్కువ ప్రసిద్ధి కెక్కాయి,

షేక్స్పియర్, షెరిడాన్, మాల్యేరు ప్రభృత పాశ్చాత్య
నాటక రచయితల నాటకాల అనువాదం, సంస్కృత నాట
కాల అనువాదం విరివిగా ఈ దశాబ్దంలో సాగుతూనే ఉంది.

మొదటి ప్రపంచయుద్ధం ముగిసింది. స్వాతంత్ర్యం వస్తుం దని ఆశపెట్టుకున్న భారతీయులకు ఆశాభంగ మయింది. రౌలట్ శాసనం, పంజాబు దురంతాలు, బెంగాలు విభజనా యత్నం, భారతీయులలో జాతీయ భావాలను ప్రజ్వలింప జేశాయి. దేశ మంతటా జాతీయోద్యమం చెలరేగింది. ఈ జాతీయోద్యమ ప్రభావంవల్ల తెలుగులో రెండు రకాల నాట కాలు వెలువడ్డాయి. ఒకటి: పూర్వ చారిత్రక నాటకాలు. రెండు: సమకాలీన చారిత్రక నాటకాలు. పూర్వ చరిత్రలో నుంచి కథ తీసుకుని దేశభక్తిని రేకెత్తించే లక్ష్యంతో వీర శృంగార రసాలు ప్రధానంగా వెలువడిన నాటకాలను ప్రజలు ఎక్కువగా ఆదరించారు. వీటిలోని వచనాలు, పద్యాలు రక్తాన్ని ఉడుకెత్తించి కార్యశూరులను చేసేవిగా ఉంటాయి. పాత్రల మాటున, వాచికం మాటున, ముస్లింలను అడ్డంపెట్టు కుని నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టడం అడుగడు గునా ధ్వనిస్తూనే ఉంటుంది. అందుకే ఈ రకం నాటకాలలో అమిత ప్రజాదరణ పొందిన రోషనార, జేబున్నీసా, రసపుత్ర విజయం నాటకాలను మత ద్వేషం రెచ్చకొడతాయనే మిషతో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

జాతీయ భావం ఉప్పొంగిన ఆ రోజులలో దేశ స్వాతంత్ర్యంకోసం దశాబ్దాల తరబడి పోరాడిన పూర్వ రస పుత్ర, మహారాష్ట్ర జాతి చరిత్ర మన నాటక రచయితలను ఆకర్షించింది. అందుకనే ఈ దశలోవచ్చిన పూర్వ చారిత్రక నాటకాల ఇతి వృత్తాలన్నీ రసపుత్ర మహారాష్ట్ర చరిత్ర లోనివే. మన రచయితల నెక్కువగా ఆకర్షించిన వీరులు

రాణాప్రతాప్, దుర్గాదాసు, భీమసింగు, రాజసింహుడు, శివాజీ, తానాజీ. వీని సాహస కృత్యాలను చిత్రించే నాటకాలే ఎక్కువగా వచ్చినాయి. వాటిలో ఈ ఇచ్ఛాపురపు వారి రసప్రాత విజయం, కొప్పరపువారి రోషనార ప్రజాభిమానాలను ఎంతగానో చూరగొన్నాయి.

రసప్రాత విజయం దుర్గాదాసు సాహస కృత్యాలను చిత్రించిన నాటకం. పేరుకు రాజసింహుడు నాయకుడైనా కథనంతా నడిపించేది యోగివేషంలోని దుర్గాదాసు. ఉదయపురిమీదికిదండెత్తివచ్చిన ఔరంగజేబు కుమారుడు అక్బర్‌ను సైన్యంతోసహా దుర్గాదాసు యోచనమీద ఆరావళి పర్వతాలోయలలో రాజసింహుడు బంధించడం, దాని పరిణామం ఇందలోని ఇతివృత్తం. రాజసింహ విమలల ప్రేమగాథ ఉపకథ. "అనుపమాన దయాభిధైన యక్బరు వైద్యశాలలాయివి వధ్యశాలలయ్యె" మొదలయిన పద్యాలు ఔరంగజేబు నాటి భారతదేశాన్నే గాను, బ్రిటీష్ హయాంలోని భారతదేశాన్నిగూడా కన్నులకు కట్టించి ఉద్రిక్తులను జేస్తాయి.

ఇచ్ఛాపురపువారు రసప్రాత విజయంలో రసప్రాతుల సాహసాలను చిత్రిస్తే కొప్పరపు సుబ్బారావుగారు రోషనారలో మహారాష్ట్రవీరుల సాహసాలను చిత్రించారు. ఇందులో నాయకుడు శివాజీ. ఆ రోజుల్లో మహారాష్ట్ర నాయకుల ప్రభావంవల్ల శివాజీపేరు చెవినబడితేనే వీరావేశం ఉప్పొంగేది.కొప్పరపువారుగ్రాంట్‌డఫ్‌గచించినమహారాష్ట్ర చరిత్రనుంచి కథ తీసుకుని ఈ నాటకం రచించాగు. అప్పటికి సుబ్బారావుగారి వయసు 20 ఏండ్లు రోషనారలోని ప్రధాన

గాధ సింహగడ దుర్గం శివాజీ వశమవడం. ఉపకథ శివాజీ మీది రోషనారప్రేమ. శివాజీ తిరస్కరించినమీద ఆ ప్రేమ ద్వేషంగా మారి శివాజీమీద కత్తికట్టించడం. శివాజీకి సింహగడం దక్కింది. రోషనారకు శివాజీ పట్టుబడలేదు. ప్రేమా ద్వేషం రెండూ నిరర్థకమయ్యాయి. యుద్ధభూమిలో తగిలిన గాయాలతో శివాజీని ఆఖరుసారి దర్శించి ప్రాణాలు విడుస్తుంది రోషనార.

కొప్పరపువారు రోషనార పాత్రను అద్వితీయంగా చిత్రించారు. తెలుగువారి హృదయ సీమలో పీఠం వేసుకున్న స్త్రీపాత్ర రోషనార. నటకావతంస స్థానం ఈరోషనార పాత్రను కడు సమర్థతో నిర్వహించడంతోనే ఈ నాటకానికి బహుళ ప్రచారం వచ్చింది. వ్యక్తిత్వంగల పాత్ర రోషనార. కొప్పరపువారి అపూర్వ సృష్టి రోషనార! ఈ నాటకంలోని "వర స్వారాజ్యమును సుస్థిరముగా మీకలు, ధరపైన నెలకొల్పదలతు రేని," మొదలైన పద్యాలు శివాజి మహారాష్ట్ర వీరుల కిచ్చిన సందేశ పద్యాలే గాదు, కొప్పరపువారు భారతీయుల కిచ్చిన సందేశ పద్యాలు! రోషనార పద్యాలన్నీ గద్యోపాఖ్యానం, పాండవోద్యోగ విజయాలలోని పద్యాలులాగా చిన్న చిన్న మాటలతో ఎంతో అర్థస్ఫూర్తితో అలరారుతూ పఠిత్రప్రేక్షక హృదయాలలో నాటుకుపోయాయి.

ఈ రెండు నాటకాలలోనూ రచయితలు కావలసినంత హాస్యం కుప్పించారు. రెండింటిలోనూ వీర శృంగార రసాలకే ప్రాధాన్యం. ఇద్దరూ నీచ పాత్రలకు చక్కటి గ్రామ్యం వాడారు. వీ రిద్దరూ వాడిన తురక తెలుగు వేదం వారి తురక

తెలుగును జ్ఞప్తికి తెస్తుంది. ఈ రెండు నాటకాలు గద్య పద్య గేయాత్మకాలే.

ఇక రెండో రకం నాటకాలు సమకాలీన చారిత్రక నాటకాలు 1919-20లలో భారతదేశ రాజకీయోద్యమంలో జరిగిన సంఘటనలను, ఆ రాజకీయోద్యమానికి పుష్టి నిచ్చేందుకు, ఇతివృత్తంగా, గాంధీజీ, తిలక్, దాసు, మోతీలాల్ నెహ్రూ, అలీ సోదరులు, బిసెంటమ్మ మొదలయిన రాజకీయ నాయకులను పాత్రలుగాచేసి దామరాజు పుండరీకాక్షుడు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి ప్రభృతులు నాటకాలు రాశారు. దామరాజువారి నాటకాలలోని,"కత్తులు లేవు,", "ఈరాట్నం పున్ చక్ర మా రామచక్రమై, సీమయంత్రాసుర చెండి నై చు," మొదలయిన పద్యాలు, "రామా రామా రామా కలియుగ రామా, గాంధీనామ," మొదలయిన పాటలు ప్రజలలో బహుళవ్యాప్తి గాంచాయి

ఈ జాతీయోద్యమ ప్రభావం మూలంగానే హిందీ, బెంగాలీ, మరాటీ నాటకాలు ముఖ్యంగా చారిత్రక నాటకాల అనువాదాలు వెలువడ్డాయి. శ్రీపాద కామేశ్వరరావుగారి చంద్రగుప్త, రాణాప్రతాప్‌సింహ, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారి చంద్రగుప్త,నూర్జహాన్,షాజహాన్,మేవాడు పతనం, జంధ్యాల శివన్నశాస్త్రిగారి దుర్గాదాసు, రాణా ప్రతాప్, నండూరి శివరావుగారి చంద్రగుప్త, మాచిరాజు దుర్గాశంకరమాత్యుని శివశీలం, దినవహి సత్యనారాయణగారి షాజహాన్, పింగళి నాగేంద్రరావుగారి మేవాడ్ పతనం ఈ ప్రభావంవల్ల వచ్చినవే,

సమాజంలోని కుళ్ళును తొలగించే మహత్ ఉద్దేశంతో పెద్ద ఉద్యమం లేవదీసిన కందుకూరి వీరేశలింగం గారు తమ ఉద్యమానికి సాధనగా ప్రహసన ప్రక్రియను చేపట్టి బ్రహ్మ వివాహం, విచిత్ర వివాహం, మున్సిపల్ నాటకం మొదలైన హాస్య నాటకాలుకూడా, పూర్తి వచనంలో, వాడుకభాషకు చాలా దగ్గరగా ఉండే శైలిలో, రచించారు. ఆనాటి సమాజంమీద అవి తమ ప్రభావాన్నెంత గానో బరపినట్లు నాటి సంఘటనలనుబట్టి తెలుస్తుంది. కాని వారి ప్రధానాశయం సంఘ సంస్కరణ అవడంవల్ల ఈ నాటకాలలో వాదోపవాదాలూ శాస్త్రచర్చలు హెచ్చి నాటకీయత కొంతవరకు దెబ్బతిన్నదనే చెప్పాలి. కన్యాశుల్కం ఆలోటునుతీర్చి సంస్కరణభావంతోపాటునాటకీయతనుకూడా చేకూర్చుకుంది. ఆ తరవాత వచ్చిన సాంఘిక నాటకాలలో బహుళ ప్రచారంలోకి వచ్చినవి- కాళ్ళకూరి నారాయణ రావుగారి చింతామణి (1921), మధుసేవ (1926), సోమరాజు రామానుజరావుగారి రంగూన్‌రౌడి (1929). ఈ నాటకాలు చాలాకాలంపాటు తెలుగునాటకరంగాన్ని ఏలినాయి.

వీరు సాంఘిక సమస్యల లోతుపాతులలోకి వెళ్ళకుండా పైపై విషయాలనే పట్టుకుని నాటకాలు రాయడంవల్ల విజ్ఞానంకంటే వినోదాన్నే ఎక్కువ కలిగించేవిగా తయారయాయి. చింతామణి నాటకంలో వేశ్యలు విటులను ఆకర్షించే ఘట్టాలు, మధు సేవలోని తాగుడు సీనులు ప్రజలలో అణగియుండే మానసిక, ఇంద్రియ దౌర్బల్యాలను రెచ్చకొట్టి అనుషంగిక తృప్తిని మాత్రమే కలిగిస్తాయిగాని నిజమైన

ఆనందాన్నిగాని, విజ్ఞానాన్నిగాని ఇవ్వలేవు. సన్నివేశాలు, పాత్ర చిత్రణ హేతుబద్ధంగా కళాత్మకంగా లేకపోవడంవల్ల ఈ నాటకాలు తెలుగు సాహిత్యానికి ఉపకారంకంటె అపకారమే ఎక్కువ చేశాయి. చింతామణి పాత్రోల్లాసనం సహజంగా జరగలేదు. కలలో కృష్ణుడు కనిపించేసరికి చిత్తవృత్తి మారిపోవడం, చింతామణి నాలుగు చివాట్లు పెట్టేసరికి బిల్వమంగళుడుకూడా బుద్ధి తెచ్చుకుని సన్యసించడం. అలాగే రంగూన్‌రౌడీ నాటకంలో భార్య పాతివ్రత్య మహిమవల్ల రౌడి శంకరరావు రక్షితుడు కావడం సహజంగా లేవు. ఈ నాటకాలలో అసలు సమస్య మరుగునపడి లైంగిక విషయాలే ప్రేక్షక పఠిత హృదయాలలో నాటుకుపోయి చెడును ప్రేరేపిస్తున్నాయి.

ఆనాడు, ఈనాడూ సాంసారిక జీవనంలో గృహస్థులను వేధిస్తున్న సమస్య ఆడపిల్లల పెళ్ళిళ్ళు కన్యాశుల్కపిశాచి వదలి వరశుల్కపిశాచి ఆంధ్రులను ఆవరించింది. మధ్యతరగతి కుటుంబాలవారు వరకట్నంఇవ్వలేక పడేబాధలు వర్ణనాతీతం. ఆనాడు నేటిలాగా పిల్ల ఈడేరినా పరవాలేదనే ధైర్యం ఏ తలిదండ్రులకు ఉండేదికాదు. సంఘంలో గౌరవం కోల్పోతామనే భయం వదలలేదు. అందుచేత గృహస్థుల మనోవ్యథ నేటికంటె అనేకరెట్లు హెచ్చు ఆనాడు, నేడు సంబంధం కుదుర్చుకోవడం వేలాంపాటగా ఉండేది. ఎవరు వరకట్నం ఎక్కువ ఇస్తే వారి పిల్లని చేసుకోవాలనేగాని వంశమర్యాదలు, పిల్లగుణం అందచందాలు పట్టించుకునేవారు కాదు. ఈ కారణాలవల్ల వరకట్నం సంఘానికి చెదపురుగు

లాగా తయారయింది. ఈ పరిస్థితిని వివరించి ప్రజల్లో చైతన్యం కలిగించవలసిన ఆవశ్యకతను గుర్తించి వరకట్నం వల్ల కలుగుతున్న అనర్థకాలను నాటక రూపంగా చిత్రించి ప్రజల ముందుంచినవాడు కాళ్ళకూరి నారాయణరావుగారు. వీరి వరవిక్రయ నాటకం (1923) వరకట్నంమీద దాడి.

ఇందులో పెళ్ళీడునచ్చిన ఆడపిల్లల తలిదండ్రుల మనోవ్యథ, సాధ్యమయినంత కట్నం లాగాలని మొగపిల్లల తలిదండ్రుల ప్రయత్నాలు, పెళ్ళిళ్ళ పేరయ్యల సారథ్యాలు చక్కగా చిత్రితమయినాయి. అసలు సమస్య మరుగున పడలేదు. లింగరాజులో భత్వం ఇతివృత్తానికి బలం చేకూరుస్తోంది. తలిదండ్రుల బాధలకు తానే కారణమని పెళ్ళికూతురు భావించడం, పడేముంగు రాసిన ఉత్తరం ఎంతటివారినైనా కదిలించివేస్తాయి. ఈ నాటకంవల్ల ఆనాడు కొంతకుకొంత సాంఘిక ప్రయోజనం చేకూరిందిగాని తిరిగి నేడు తలఎత్తింది. సమస్య అపరిష్కృతంగానే ఉండిపోయి, తిరిగే వరవిక్రయం లాంటి నాటకాల ఆవశ్యకత కనబడుతోంది.

ఈ కాలంలో (1920-30) పానుగంటివారి లాగానే ప్రదర్శనానుకూలములయిన నాటకాలు అనేకం రాసి పేరు కెక్కినవాడు సోమరాజు రామానుజరావుగారు. వీరి నాటకాలు 30, 40 వరకు ఉంటాయి. వీటిలో సావిత్రి, ప్రతాపరుద్రీయంలాంటి నకిలీ నాటకాలు చాలా ఉన్నా వీరి అదృష్టవిజయం, గంగావతరణం, స్వరాజ్యసాధం, తాజ్‌మహల్ (వచన నాటకం 1925), భీష్మబ్రహ్మచారి, రంగూన్‌కౌడీ (1929)ముఖ్యమైనవి. అ తరవాత రచించిన ధరణికోట(1931),

కాలకేతనం (1934) అనేకసాగ్గు ప్రదర్శిత మయినాయి. వీరి నాటకాలలో సాహిత్యపు విలువలు తక్కువయినా నాటకీయత మాత్రం హెచ్చుగా ఉంటుంది సన్నివేశ కల్పనలో, సంభాషణలు నడపడంలో వీరికి మంచి ప్రజ్ఞ ఉంది.

ఈ దశాబ్దంలో నచ్చిన నాటకాలలో ముత్తరాజు సుబ్బారావుగారి శ్రీకృష్ణ తులాభారం (1922), ముత్తనేని వెంకట చిన్నకేశవులుగారి చండిక, చందాల కేశవదాసు గారి కనకతార(1926), ఉన్నవ లక్ష్మీనారాయణగారి నాయకురాలు (1926), అవటపల్లి హనుమంతరావుగారి కాళిదాసు (1926), పింగళి నాగేంద్రరావుగారి నారాజు (1927), కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి మేవాడుశౌర్యాగ్ని (1927), బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి ఉత్తరరాఘవం (1923) ముఖ్యమయినవి ఆంధ్రోద్యమానికి సంబంధించిన నాటకాలు గ్రంథి సుబ్బరాయగుప్తగారి ఆంధ్రమాత (1921), ద్రోణంరాజు సీతారామారావుగారి ఆంధ్రపతాకం (1921) ఆంధ్రోద్యమ నాటకాలకు ప్రనాదులు.

నాటి రాజకీయాందోళనతోపాటు సాహిత్య రంగంలో కూడా ఆందోళన ప్రారంభ మయింది. పాత రచనా ప్రక్రియలను, రచనా విధానాన్ని భాషను సంస్కరించి కొత్తసాహిత్య రూపాలు తీసుకువచ్చే సంకల్పంతో నాటి యువకులు సాహితీ సమితిని స్థాపించారు. అందులోని సభ్యులంతా మంచి భావుకులు, వ్యుత్పన్నులూ, వ్యవహారిక భాషావాదులు. వీరి కలాల నుంచి నూత్న రూపంలో నాటకాలు,నాటికలు వెలువడ్డాయి. విశ్వనాధ సత్యనారాయణగారు ఈ దశలోనే నర్తనశాల

(1924), అనార్కలీ. సోషిక ప్రళయం రచించాడు. నవలన శాల తెలుగులోని ఉత్తమ విషాద నాటకాలలో ఒకటి. కోచక పాత్రను విషాద నాయకుడుగా చిత్రించిన తీరు ప్రశంసనీయ మయింది. వీరి అనార్కలీ గొప్ప 'లిరిక్' నాటకం ఇందులో వీరు విభావానుభావ వ్యభిచారీ భావాలకు రూపకల్పనచేసి పాత్రలుగా ప్రవేశపెట్టి తద్వారా నాయికా నాయకుల నూన సికావస్థను, పరిణామాన్ని చిత్రించాడు. ఇట్టి రచన అపూర్వం. సత్యనారాయణగారి రచన లన్నింటిలో ఇదే గొప్పదని భావించేవారూ ఉన్నారు. ఏమయినా సత్యనారాయణగారి నాటకాలలో కవిత్వం ముందుకు ఉరుకులు పెడుతూ నాట కీయతకు అడ్డు తగులుతూంటుంది. అందుకే సాహిత్య దృష్ట్యా ఎంతో విలువగలవారి నాటకాలు రంగస్థలంమీద రాణించ లేకపోయాయి.

చింతాదీక్షితులుగారి శబరి (1925) కూడా అపూర్వ రచనే. శబరి చదువుతూంటే మాటర్‌లింక్ బ్లూబాయి రచనా విధానం జ్ఞాపకం వస్తుంది. దీక్షితులుగారు అడవులలోని పక్షులను సైతం పాత్రలుగాచేసి శబరి రామభక్తిని ద్యోతకం చేస్తూ ఉత్తమ నాటకం రచించారు. ఇందులో నవసం గేయంలా నడుస్తుంది.

ఈ కాలంలో మధురాంతకం రాజారెడ్డిగారి విషాద నాటకం కుంభదాణా (1924) వెలువడి ఉత్తమ విషాద నాట కంగా పేరుకెక్కి అనేకసార్లు ప్రదర్శితమయి ప్రేక్షకులను రంజింపచేసింది.

ఇంకోవైపునుంచి రామాయణ భారతాది పురాణాల మీద సనాతన ఆర్యమతం, దాని సిద్ధాంతాలమీద తిరుగు బాటు బయలుదేరింది. వాటిలో అనేక విషయాలను శంకిస్తూ లేచిన ఈ ఉద్యమానికి నాయకుడు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. వీరేశలింగంగారు సాంఘిక సమస్యలమీద దృష్టి నెక్కువగా కేంద్రీకరిస్తే వీరు మత సమస్యలమీద దృష్టి నెక్కువగా కేంద్రీకరించారు మత సంస్కారానికే ఎక్కువగా పాటు బడ్డారు. రామస్వామిచౌదరిగారు కవిరాజు. తిరుపతి వెంకట కవుల శిష్యుడు. సంస్కృతాంధ్ర ఆంగ్లభాషలలో పండితుడే గాక ప్రపంచ మతాలను, తత్త్వశాస్త్రాలను అనరోధనంచేసిన మనీషి. భారతదేశంలో సనాతన మతం పేరుతో సాగుతున్న మోసాలు, దోపిడీలు గ్రహించారు. పండితులు, మతాధి కారులు మతతాత్త్విక గ్రంథాలకు చెప్పుచున్న వ్యాఖ్యా నాలు వారికి సహేతుకంగా కనిపించలేదు. వీరికి భారతియుద్ధం పాండవులు అన్యాయంచేసి గెల్చుగనే దృఢనమ్మకం కలి గింది. వాదనకు తగిన ఉపపత్తులు దొరికాయి ఈదృఢ్నిశ్చయంతో వారు భారతగాథను కురుక్షేత్ర సంగ్రామం అనే పేరుతో రచించి 1912లో ప్రకటించారు.

ఇంక రామాయణంలో అరణ్యమధ్యంలో ఎవరికీ ఏ హానీ తలపెట్టకుండా, మోక్షగామియై తపస్సు చేసుకునే శూద్రకుని, వర్ణాశ్రమ ధర్మాలను ధిక్కరించాడనే నేరం మోపి, తమ ఆధిక్యత కాపాడుకోటానికి బ్రాహ్మణులు రామునిచేత చంపించిన గాథ చౌదరిగారిలో కోపాగ్నిని రేకి

త్తించింది. ఈ దురవస్థాయిని ద్యోతకంచేస్తూ శంబుకవధ నాటకం 1922లో ప్రకటించాను.

భావాలు ఆధునికమేగాని చౌదరిగారి రచనా విధానం మాత్రం పురాతనమే. వీరు గద్య పద్యాత్మకంగా స్వగతాది పాతలక్షణాలతోనే ఈ నాటకాలు రచించారు.

ఆ రోజుల్లో రామస్వామిచౌదరిగారి లాగానే పౌరాణిక చారిత్రక గాథలను నూత్నదృష్టితో నూత్న వ్యాఖ్యానాలతో నాటకాలు రచించిన వారిలో ముఖ్యులు గుడిపాటి వెంకటచలంగారు, సామినేని ముద్దుకృష్ణ ముఖ్యులు

గుడిపాటి వెంకటచలంగారు ఫ్రాయిడ్ లైంగిక సిద్ధాంతాలను క్షుణ్ణంగా చదివి, జీర్ణింపజేసుకుని వాటిని గాఢంగా విశ్వసించిన మేధావి. మన సంఘంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలు వారినికదిలించివేశాయి. కలం పట్టి సంఘంమీద తిరుగుబాటు ప్రకటించారు. సాహిత్య ప్రక్రియ లన్నింటినీ సాధనగా చేసుకున్నారు. చిత్రాంగి, పద్మరాణి (1921), సావిత్రి (1923), శాపవిమోచనం (1926), మంగమ్మ (1930), నాటకాలు, సత్యం శివం సుందరం (1923) అనే నాటికలు వెలువడి సాహితీపరులలో, ప్రజానీకంలో సంచలనం కలిగించాయి. సావిత్రి మాటర్ లింక్ భావాల ప్రభావంతో రచించిన నాటకం. ఆ కథే వేరు, ఆ పాత్ర చిత్రణే వేరు. అందులో యముడు సావిత్రీసత్యవంతుల ప్రేమను పరీక్షిస్తాడు ఒక్కరాత్రి తన కామవాంఛ తీర్చితే సత్యవంతుడికి ప్రాణం పోస్తానని చెపుతాడు. సావిత్రి అంగీకరించి తీరా పడక గదిలోకి వెళ్ళిన తరవాత యముని కైజారుతో పొడవబోతుంది. యముడు ఆమె

సాహసాన్ని మెచ్చుకుని సత్యవంతుడికి ప్రాణ దానంచేస్తాడు. ఈ నాటకాన్ని ఓహో అని కొందరు మెచ్చారు. కొందరు ఛీ అని తిట్టారు. చలంగారిలా పొగడ్త లందుకున్న రచయిత అన్ని తిట్లు తిన్న రచయిత ఆ రోజుల్లోనేగాదు ఈ రోజుల్లో కూడా ఉన్నాడో లేడో! వీరి కిలానికున్న పదును మరే తెలుగు రచయితకు లేదనవచ్చు.

ఇక చిత్రాంగి!

ధర్మవరంవారి చిత్రాంగి ఒళ్ళు తెలియని కాముకి. రాజరాజు స్త్రీ చేతి కీలుబొమ్మ. సారంగధరుడు చలనంలేని రాతిబొమ్మ, ధర్మనిష్ఠుడు.

కాళ్ళకూరివారి చిత్రాంగి, ప్రబంధ యుగంనాటి పతివ్రత. రాజరాజు ధర్మప్రభువు. సారంగధరుడు భీరువు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చిత్రాంగి సుకుమార వీరకన్య. రాజరాజు ధర్మభ్రష్టుడు. సారంగధరుడు ఉద్యోగ నిగ్రహాలమధ్య కొట్టుకునే వ్యక్తిత్వంలేని వ్యక్తి.

చలంగారి చిత్రాంగి, ప్రేమైకమూర్తి. త్యాగమూర్తి. రాజరాజు కపటి. సారంగధరుడు పరిణామశీలి.

ధర్మవరంవారి విషాద సారంగధర సనాతన హింసా ధర్మ సూత్రాలకు వ్యాఖ్య. చలంగారి చిత్రాంగి సాంఘిక, నైతిక సూత్రాలకు వ్యాఖ్య శ్రీపాదవారికి రాజరాజు చరిత్రకు వ్యాఖ్య

పాత్ర చిత్రణలో ఈ విభిన్న దృక్పథాల ననుసరించే ఆ మూ రచయితలు కథ మలుచుకున్నారు. ధర్మవరంవారి చిత్రాంగి కాముకి. తిరస్కృత ప్రేమ ద్వేషంగా మారింది.

రాజరాజు ఆమె చేతిలో కీలుబొమ్మ ప్రతీకారం తీర్చుకుంది. సారంగధరుడి ధర్మనిష్ట అతనిని బలిగొంది.

కాళ్ళకూరివారి చిత్రాంగి కన్యాగౌర్వత మిషతో రాజరాజును దూరాన ఉంచి, ప్రేమ వ్యర్థమయేసరికి గోదావరిలో దూకుతుంది. రాజరాజు ధర్మప్రభువు. తెలివి తెచ్చుకుని చిత్రాంగీ సారంగధరుల వివాహం జరిపిస్తాడు.

శ్రీపాదవారి చిత్రాంగి సుకృతీయ పీరకన్య కాబట్టి తన ప్రేమ నిరర్థక మయేసరికి రాజరాజుమీద కత్తిదూసి, "నిన్ను తాకకూడదు. నువు చండాలుడివి," అని తానే పొడుచుకుని రాచ మర్యాద నిలబెట్టుకుంది.

చలంగారి చిత్రాంగి ప్రేమమూర్తి. త్యాగశీవి కాబట్టి సారంగధరుడికి ఆపద రాకుండా రాజును వివాహమాడి, "మట్టుకుంటే ఇద్దరి ప్రాణాలు సరి," అని బెదిరించి తనప్రేమ మూలంగానే సారంగధరుడు హతుడైనాడని అతని పాద సన్నిధినే పొడుచుకు ప్రాణం విడుస్తుంది.

ధర్మవరంవారి నాటకం ప్రక్రియాత్మక గద్య పద్య గేయాత్మక విషాద రూపకం. కాళ్ళకూరి వారిది సుఖాంత సంభాషణా ప్రబంధం. శ్రీపాద వారిది విషాద వచన చారిత్రక నాటకం. చలంగారిది విషాద వచన ప్రేమా కలాపం!

చలంగారు రచనలకు సమకాలీన సాంఘిక జీవితం ఆలంబనం. సంఘంలో స్త్రీ పురుషుల అసమానత, స్త్రీల సాంఘిక శానిసత్వం, అర్థ లేని కట్టుబాట్లు చలంగారి నిశిత విమర్శకు గురి అయాయి.

58A

కొందరు ప్రముఖ నాటక రచయితలు



కందుకూరి వీరేశలింగం పంతులు



గురజాడ అప్పారావు



ధర్మవరం రామకృష్ణమాచార్యులు



దామరాజు పుండరీకాక్షుడు



కొప్పరపు సుబ్బారావు



ఆచార్య ఆత్రేయ



పెమ్మరాజు
వేణుగోపాలకృష్ణమూర్తి



పి. వి. రాజమన్నారు



వాసిరెడ్డి భాస్కరరావు



సుంకర సత్యనారాయణ



అనిశెట్టి సుబ్బారావు



బి. టి. రాఘవాచార్యులు



కొర్రపాటి గంగాధరరావు



పినిశెట్టి శ్రీరామమూర్తి

ఇక ముద్దుకృష్ణగారి అశోకం (1930) సీతారాముల దాంపత్య జీవితాసక, మనస్తత్వాలకు నూత్నవ్యాఖ్య. అశోకం పేరు విజ్ఞుల 'మొదమకు మేత.'

అశోకంలోని రామునె ధ్యేయం ప్రజానురంజనమేగాని ప్రేమకాదు. ఇక రావణునికో ప్రేమేజీవితం. సీతకరుణామూర్తి. అశోకవనంలో రావణుడు తన మనసును విప్పిచెప్పి ప్రేమను అర్థించేసరికి, రామాయణంలోని సీతలా అశోకంలోని సీత దూషించలేదు. జాలిపడింది. రావణుడు మూర్ఛపోతే అతని తలను తొడపై నిడుకుని ఉపచారం చేస్తుంది. ముద్దుకృష్ణ, చలంగార్లు నాటక రచనలో పాతవిధానాలను వీడి ఇబ్సెన్ మొదలయిన పాశ్చాత్య నాటక విధానాలనే చేపట్టి నాటకాలు, నాటికలు పూర్తిగా నచనంలో రాశారు.

ఈ దశలో (1920-30) వచ్చిన నాటకాలలో పింగళి నాగేంద్రరావుగారి వింధ్యరాణికి విశిష్ట స్థానం లభించింది. ఇది ఆంగ్ల నాటక రచయిత ఆస్కార్ వైల్డ్ రచించిన "డచెస్ ఆఫ్ పాడుపా" (Duchess of Padua) నాటకానికి అనుసరణ. ఇందులోని వచనమంతా ద్విపద నడక నడిచి ఒక విభమైన సృుందాతనం అలవర్చుకుంది. ఆంగ్ల నాటక కర్తలు వాడిన బ్లాంక్ వర్సులాగా ఉంది. నాటకీయతకు తోడ్పడుతోంది. ఆంధ్రదేశమంతటా ప్రదర్శితమయి మెప్పుపొందింది.

1928లో చిలకమర్తివారి షష్టిపూర్తి మహోత్సవం జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వారు భాసనాటకాలను (కర్ణభారం, అభిషేకంమినహా) అనువదించి ఒక సంపుటిగా ప్రకటించారు అంతకు పూర్వమేవారు 1913లో

భాసుని స్వప్నవాసవదత్త, 1915లో మధ్యమవ్యాయోగం అనువదించాడు. మానవల్లి రామకృష్ణకవి కర్ణభారం, బాల చరితం, అవిమారకం, అనువదించి వున్నాడు. చిలకమర్తివారి అనువాదాలతో భాస నాటక చక్రం తెలుగులోకి వచ్చింది.

ఈ దశలో పేరొక్కనదగ్గ వ్యక్తి పాపట్ల కాంతయ్యగారు. వీరు గొప్ప సంగీత పండితులు. రసజ్ఞులూ. నాటక కీర్తనలు రాయడంలో మేటి. తొలుత రాజమండ్రి గున్నేశ్వరరావుగారి చింతామణీ నాటక సమాజంవారికి, అతరవాత మైలవరం బాల భారతీ సమాజంవారికి నాటకాలకు, రక రకాల కీర్తనలు, మట్లు రచించి ఇచ్చారు. వీరు సాహిత్యకల్పనలో, స్వరకల్పనలో దిట్టలు. వీరి కీర్తనలు చిలకమర్తి, తిరుపతి వెంకట కవులు, బలిజేపల్లివారి పద్యాలు లాగానే మనోహరంగా ఉండి, జనాన్ని బాగా ఆకర్షించేవి. వీరి పాటల అచ్చు ప్రతులు వేలకు వేలు అమ్ముడయ్యాయి. అయితే వీరి పాటలు జనులను ఆకర్షించ గలిగాయేగాని, నాటక ప్రయోగానికి, అభినయానికి అడ్డుగా తయారయి నాటక కళ క్షీణించడానికికూడా కొంత కారణ మయ్యాయి

1920ప్రాంతాలకే నాటకాలలో ఔచిత్యానౌచిత్యాలు సంద ర్భాసందర్భాలు పాటించకుండా పద్యాలు పాటలు పార్శీ మట్లు, డ్యూయెట్లతో నాటకాలను నింపివేయడం మూలంగా, హార్మోనియం తబలా మోతలతో నాటక ప్రదర్శనాలు కేవలం సంగీత ప్రదర్శనాలుగా తయారయి అభినయం ప్రయోగ విలువలు దిగజారిపోయి నాటకరంగం అభా

సగా తయారుకావడం నాటక కళావేత్తలను, నాటక కళాభిమానులను కలవరపెట్టింది. దానివాద సుప్రసిద్ధ నాట్యాచార్యులు బి.టి రాఘవాచార్యులుగారు ఆనాటి పతన నాటక రంగాన్ని యథాతథంగా ప్రతిబింబింపజేస్తూ నాటక ప్రయోగ అభినయాలలోని లోట్లను చూపుతూ,అవహేళనచేస్తూ సంగీత భద్రసభ అనే నాటకం వెలువరించారు. ఇలాంటి అవహేళన నాటక రచనకు వీరే ఆద్యులు. అంతేగాక వీరునటుల ఉపయోగార్థం నాటక దీపిక (1924) అనే స్వతంత్ర నాటక లక్షణ గ్రంథంకూడా ప్రచురించారు. విజయవాడలో ఆ రోజుల్లోనే జరిగిన చింతామణి నాటక పోటీ పరీక్షలను పురస్కరించుకుని పోటీ ప్రదర్శనాలను, నటుల అభినయ రీతులను, చింతామణి నాటకాన్ని సమీక్షిస్తూ బలే చింతామణ అనే చిన్న విమర్శ గ్రంథం ప్రకటించారు

1908 లో ప్రపంచ నాటక చరిత్రను ఇంగ్లీషులో ప్రచురించి తెలుగువారికి ప్రపంచ నాటకాలను, నటులను పరిచయంచేసిన కోలాచలం శ్రీనివాసరావుగారు "ఆంధ్ర నాటకములు-కొన్ని సమయములు," అనే దీర్ఘ వ్యాసం ప్రకటించారు. అందులో నాటక రచనా విధానంమీద, నటనమీద కొన్ని సలహా లిచ్చారు. ఈ వ్యాసం ఆధారంచేసుకుని ముత్తరాజు సుబ్బారావుగారు, పురాణం సూరిశాస్త్రిగారు మొదలయిన నాటక కళావేత్తలు కృష్ణాపత్రికలో వ్యాసాలు ప్రకటించారు.

నాటి నాటకరంగం హీన స్థితికి పద్యాలు, పాటలే కారణమని తలచి తిరిగి వచనంలో నాటకాలు రాయవలసిన

ఆవశ్యకతను ప్రబోధిస్తూ శ్రీపాద కామేశ్వరరావు ప్రభృతులు వ్యాసాలు ప్రకటించారు. ఉపన్యాసా లిచ్చారు. భమిడి పాటి కామేశ్వరరావుగారు పద్యాలకు సంగీతం జోడించడం తప్పని వ్యాసాలద్వారా, ఉపన్యాసాలద్వారా ప్రబోధించ సాగారు.

తెలుగు నాటక ప్రదర్శనాలను, నటుల అభినయ వైఫి రులను సమీక్షిస్తూ నాట్యాంబుజం (1923), నాట్యాశోకం (1925), పాశ్చాత్య నాటక రచనారీతులను తెలిపే నాట్యో త్పలం (1924), విమర్శక పారిజాతం (1925), పురాణం సూరి శాస్త్రిగారు ప్రచురించారు. గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు ఆంధ్ర నాటకరంగం (1924), పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారు ఆంధ్ర నట ప్రకాశిక (1930) ప్రకటించారు. నట ప్రకాశికా ప్రచురణ సందర్భంలో శాస్త్రిగారు దేశ మంతా తిరిగి నాటకకళమీద ఉపన్యాసా లిచ్చారు.

1924లో బందరులో ఆంధ్ర నట సాహిత్య సభలు జరిగాయి. ఆ సభలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, కాశీ కృష్ణమాచారి, ఉమర్ ఆలీషా, వెదుగుమూడి శేషగిరిరావు, హరినాగభూషణం, నెల్లూరి నాగరాజరావు మున్నగు నాటక కళావేత్తలు పాల్గొని చర్చలు జరిపారు. బుర్రా శేషగిరిరావు గారు 1923లో నాటకకళ అనే పత్రిక స్థాపించి అనేక వ్యాసాలు ప్రచురించారు. బందరు, గుంటూరు మొదలయిన పట్టణాలలో నాటక పోటీలు జరిగాయి.

ఇలా 1920-30 మధ్యకాలంలో విమర్శనా వ్యాసంగం ఉధృతంగా జరిగింది. ఈ దశాబ్దిని తెలుగు నాటక

రంగంలో ప్రప్రథమ విమర్శనాయుగం అని పేర్కొన వచ్చును ఈ ఉద్ధృత వివరణలవల్ల 1930 నాటికి నూతన నాటకరూపాలు. నూత్న నాటకరంగం అవతరించడానికి రంగం తయారు గాజొచ్చింది

1930 వరకు నాటకాలు రచించిన తెలుగు రచయితలు కందుకూరి, గురజాడ, చలంలాంటి ఏ బహుకొద్దిమందో తప్ప తక్కినవారంతా ఆదర్శవాదులు. పురాణాలలో పేర్కొన్న ధర్మాలను, సాంఘిక, నైతిక సూత్రాలను గట్టిగా నమ్మి వాటిని తమ నాటకాలద్వారా ప్రచారం చేసినవారే. స్త్రీకి పతియే దైవం, మొదలయిన నీతి సూత్రాలను, దైవభక్తి, పితృభక్తి, కర్మ, పునర్జన్మ మొదలయిన మత సిద్ధాంతాలను శివ కేశవుల లీలలను దృశ్యమానం చేయడమే వీరి పరమావధి. అందుకు సహజంగా పురాణాలనుంచి, గత చరిత్రనుంచి ఇతివృత్తాలను తీసుకున్నారు. వారి నాటకాలలోని ప్రధాన పాత్రలు, త్రిమూర్తులు, అవతార పురుషులు, దేవతలు, రాజులు రాణులు. నాటకరచనా విధానంకూడా పాతపద్ధతియే.

కాని 1930 నాటికి జాతీయాంతర్జాతీయ సాహిత్యం మనకు అందుబాటులోకి వచ్చి మన రచయితలకు వాటితో పరిచయం ఏర్పడింది. నవచైతన్యం విరిసింది. ఇబ్సెన్, షా, చెకోవ్, టాల్‌స్టాయ్ ప్రభృతుల నాటకాలను, ప్రపంచ మత సాంఘిక నైతిక చరిత్రలమీద గ్రంథాలను మన రచయితలు అధ్యయనం చేయసాగారు. అవి తెలుగు నాటక రచయితల మీద ఎనలేని ప్రభావాన్ని నెరపినాయి. ఆ ప్రభావం పలితంగా వచ్చిందే పి. వి. రాజమన్నారుగారి 'తప్పెవరిది ?'

నాటకం. గురజాడ కన్యాశుల్కం తరవాత వాస్తవికతకు ప్రాధాన్యమిస్తూవచ్చిన సాంఘిక నాటకం ఇదే. ఇదిపూర్తిగా వచన నాటకం. సారంగధర గాథనే రాజమన్నారుగారు సాంఘిక నాటకంగా రూపొందించారు. నాయిక భర్తకు ఎదురు తిరగడం ఇందులోని కథాంశం. పూర్వాచారాల మీద అభిమానంగల వారిని ఈ తిరుగుబాటు నాటకం కలవర పెట్టిందిగాని యువకులలో ఉత్సాహం రేకెత్తించింది. దీనితో కొత్తనీతికి దోహదం కలిగింది. తప్పెవరిది విప్లవ నాటకం అని పేరు తెచ్చుకుంది. సనాతన ధర్మాలమీద తిరుగుబాటు ప్రకటించింది.

రాజమన్నారుగారి 'తప్పెవరిది' తరవాత ఇబ్సెన్ ప్రభావంతో వచ్చిన ఇంకో నాటకం రంగా రాంగారి దంపతులు. ఇందులో భార్యా సమస్య విషయంలో ఆధునిక భావాలకు, పూర్వ భావాలకు సమన్వయ పరచాలనే యత్నం జరిగింది. ఆ తరవాత వచ్చిన నాటకం బళ్ళారి రాఘవ రచించిన సరిపడని సంగతులు. సరిపడని సంగతులలో రాఘవ అనేక సమస్యలను ఎత్తుకుని దేనినీ సవ్యంగా నిర్వహించలేకపోయారు ఈ మూడు నాటకాలు విజయవంతంగా ప్రదర్శిత మవడంతో వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబింపజేస్తూ పూర్తిగా వచనంలో నాటకాలు రాసి విజయం పొందవచ్చనే ధైర్యం యువ రచయితలకు కలిగింది.

రాజమన్నారు, రంగారామ్ నాటకాల ఛాయలోనే వచ్చిన మరొక ఉత్తమ నాటకం మల్లాది అవధానిగారి గాలివాన. సంఘంలో స్త్రీకి తగిన స్థానం లభించాలంటే ఆర్థిక

స్వాతంత్ర్యం కావాలనే సిద్ధాంతమే ఈ నాటకానికి ఇతివృత్తం.

1930 లో ప్రారంభమయిన ఉప్పుసత్యాగ్రహం, రాజకీయాందోళన తరవాత గాంధీజీ దృష్టి హరిజన సమస్యమీద పడి, హరిజనోద్ధరణకు తీవ్ర కృషి చేయసాగారు. ఆ కృషి ప్రభావం తెలుగు నాటక రచయితలమీద పడింది. ధర్మవరం గోపాలాచార్యులుగారి అస్పృశ్యవిజయం, కృష్ణకౌండిన్యగారి, పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారి నందనార్, తాండ్ర సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పతితపావన, మునిమాణిక్యం నరసింహారావుగారి తిరుగుబాటు(1938)హరిజన సమస్యను ఇతివృత్తంగా తీసుకుని రచించిన నాటకాలలో ముఖ్యమైనవి. నందనార్ పూర్వహరిజన భక్తునిగాథ. పతితపావన కాల్పనిక నాటకం.ఈ మూడూ గద్య పద్యాత్మకాలే. మునిమాణిక్యంవారి తిరుగుబాటు వచన నాటకం. ఈ నాటకా లన్నింటిలో సవర్ణులు హరిజనులను హింసించడం చిత్రించారు. తిరుగుబాటు చాలా తీవ్రమయిన నాటకం. సవర్ణుల బాధలకు తట్టుకోలేక హరిజనులు రెచ్చిపోయి తిరగబడి ప్రతీకారం తీర్చుకోవడానికి బయలుదేరడంతో నాటకం ముగుస్తుంది. హింసను ప్రేరేపించేదిగా ఉందని ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వం దీనిని నిషేధించింది.

1935లో వెలువడిన, కాళ్ళకూరి గోపాలరావుగారి నాటకం, వాల్మీకి ఒక విశిష్ట రచన. మనః పరిణామమే ఈ నాటకానికి ఇతివృత్తం. జన్మతా బ్రాహ్మణుడయినా కుల భ్రష్టుడయి తస్కరులకు నాయకత్వం వహించి క్రూరుడుగా

పేరొందిన ప్రాచేతసుడు తాపసకవీంద్రుడుగా మారిన విధం ఇందు చిత్రితమయింది. పూర్వ నాటకాలలోని నాయకులు విశుద్ధచరితులు. బాహ్య ఆంతర సంఘర్షణాలతో పోరాడి శీలంకాపాడుకున్న వారుకొందరు,సంఘర్షణకుతట్టుకోలేక భ్రష్టులైనవారు కొందరు. మొదటి తరగతి నాయకులకు హరిశ్చంద్రుడు, రెండవదానికి బిల్వమంగళుడు ఉదాహరణ. కాని దుష్ట ప్రతినాయకుడు బాహ్య ఆంతర సంఘర్షణల మూలంగా పశ్చాత్తాపం చెందిన ఉదాంతాన్ని నాటకాలుగా రాశారేగాని దుష్టుడిని, అంతలోనూ తస్కర నాయకుని నాయకునిగాచేసి అతను మనఃపరిణామంద్వారా విశుద్ధ చరితుడుగా మారినట్లు నాటకం రచించినవారు లేరు. ఇదియే ఈ నాటకంలోని ఇతివృత్తం విశిష్టత. ఇలాంటి నాటక రచనకు వీరే ప్రథములులు. ఈ నాటకంలోని కథాసంవిధానం, పాత్రచిత్రణ, సంఘటనా నిర్వహణ అద్భుతం గొలుపు తాయి. నాటకం గద్య పద్య గేయాత్మంగా నడిపినా, చమత్కారిణి, కుశీలవుడు, నిపాదుడు (బోయలు)కు వీరు పెట్టిన గ్రామ్యభాష ఎంతో సహజంగా వుంది. గ్రామ్యభాషలో వీరు రచించిన గేయాలు జానపద గేయాలను తలపునకు తెస్తాయి.

1935లోనే ఒక ఇతివృత్తాన్నే తీసుకుని పోటాపోటీగా ముగ్గురు రచయితలు నాటకాలు రచించారు. అవే కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి వేనరాజు, కవి రాజు త్రిపురనేని రామస్వామిచౌదరిగారి ఖూనీ, ధనికుల బుచ్చివెంకట కృష్ణయ్యచౌదరిగారి విప్లవం లేక వేనరాజు.

ఈ ముగ్గురి దృక్పథం వేరు వేరు విశ్వనాథవారి దృక్పథంలో వేనరాజు, "మనుజుల ప్రాణాలతో జెరలాడునంతటి క్రూరుడు". వేదాలను, ఆర్యరుషుల మతమును ధిక్కరించిన పాషండుడు, రాక్షసుడు. లలితకళాభిజ్ఞత మొదలయిన ఎన్ని సుగుణాలున్నా వేద, ఆర్యరుషి ధర్మాలను ధిక్కరించినందున వధ్యుడు అతని వధ సమర్థనీయం. ఇక రామస్వామిచౌదరి గారి వేనుడుతోటి ప్రాణులను ప్రేమించే ఉత్తమ పురుషుడు, ధర్మప్రభువు, మతసంస్కర్త. వీరి దృష్టిలో వేనరాజు వధ ఖూనీ. అందుకే వీరు తమ నాటకానికి ఖూనీ అని పేరు పెట్టారు. ఇక బుచ్చి వెంకటకృష్ణయ్యచౌదరిగారి దృష్టిలో, "స్వార్థపరులై మూఢనమ్మకాలతో దురహంకార ప్రేరితులైన నిరంకుశుల బారినుండి నిరక్షరాస్యులైన ప్రజా బాహుళ్యాన్ని సముద్ధరించగోరి, భావదాస్య నిర్మూలనకే తన జీవితాన్నర్పించిన" విప్లవకారుడు. ఈ దృష్టితోనే వీరు తమ నాటకానికి విప్లవం లేక వేనరాజు అని పేరుపెట్టారు. వీరి దృష్టిలోనూ వేనరాజు వధ సమర్థనీయంగాదు. ఈ ముగ్గురి నాటకాలకు ఆధారం భాగవత చతుర్థస్కంధంలోని వేనుని కథ. ఈ కథను నాటకంగా రూపొందించడంలో ఈ ముగ్గురూ తమతమ దృక్పథానికి అనుగుణంగా కథను మలుచుకున్నారు, సంఘటనలను సృష్టించారు. వేనుని పాత్రను చిత్రించారు. తమ తమ దృక్పథాలకు బలం చేకూర్చడానికి కావలసిన కొత్త పాత్రలను సృష్టించారు ఈమూడు నాటకాలకు బీజం, వేనునికి సనాతన వైదిక మతావలంబకులకు భావ సంఘర్షణ. ఈ భావ సంఘర్షణ ఆ యా సంఘటనలవల్ల పరా

కాష్టకు వెళ్ళి వేనరాజు వధతో అంతమవుతుంది. వేనుని వధిం చింది ఈ మూడు నాటకాలలోను అతని ఆత్మీయులే.

-ఈ ముగ్గురు రచయితలు చేయి తిరిగిన రచయితలు కావడంవల్ల తమ దృక్పథాలకు బలం చేకూరే ఉపపత్తులను సమర్థవంతంగా పాఠకుల ముందుంచ గలిగారు. విశ్వనాథ, ప్రతిపురనేనివారి నాటకాలలో సిద్ధాంత చర్చలు ఎక్కువ. ప్రక్రియ తక్కువ. అందుకే ఈ రెండూ నాటక రంగంమీద అంతగా రాణించలేకపోయాయి. ఇక ధనేకులవారి విప్లవంలో ప్రక్రియ ఎక్కువ, చర్చలు తక్కువ. అందుకే ఇది పలుసార్లు ప్రదర్శిత మయింది.

ఈ దశలోనే వ్యష్టిలోకి వచ్చిన నూతన నాటక రూపం పద్య, గేయ నాటక నాటికా రచన. దీనిని చేపట్టి రస వత్తరమయిన నాటకాలు రచించినవారు శివశంకర స్వామి వారు. వావిలాలవారి నందకరాజ్యం, కందుకూరివారి వెనీసు వర్తకుడు, రెంటాలసుబ్బారావుగారి అధిలబింబం పద్య నాట కాలయినా అవి పాఠక ఆదరణలేక మరుగున బడ్డాయి. మరు గునబడ్డ ఈ నాటక రూపాన్ని శివశంకరస్వామివారు పునరుద్ధ రించారు. వీరి పద్మావతీ చరణచారణచక్రవర్తి (1936) జయ దేవుని గీత గోవిందావిర్భవాన్ని చిత్రించే పద్య నాటకం. ఇది కేవలంచదువుకోవడానికేగాక ప్రదర్శన యోగ్యతనుకూడా సంతరించుకుని ప్రదర్శితమై ప్రేక్షకుల మెప్పును పొందిన నాటకం. దీక్షిత దుహిత, కవిప్రియ, సహజసూనపంధీ రమ ణీయ కళా ఖండాలు. వీటిలోని సంభాషణలు చక చకా సాగు తూంటాయి. నాటకీయతకు అడ్డురావు. దీక్షితదుహిత,అప్పయ

దీక్షితుల కుమార్తె మంగళాంబ పునర్వివాహానికి సంబంధించి నది. బాల వితంతువు అయిన మంగళాంబకు పునర్వివాహం చేయడమా మానడమా అనే అప్పయదీక్షిని ఆంతర సంఘర్షణను వీరు నేపథ్య గానంద్వారా చిత్రించి, ఇట్టి రచనలకు మార్గదర్శకు లయ్యారు. కవిప్రియ బిల్హాకవి ప్రేమగాథ. సహజ యౌవనధీచండీదాసు ప్రేమగాథ. శివశంకరస్వామివారి పద్య నాటకాలలో కవిత్వాంకంకె నాటకీయత ముందుకు దూకు తూంటుంది.

ప్రేమకు అవధులులేవు. ఎంతటి త్యాగానికయినా దారి తీయిస్తుందని నిరూపించుతూ రావు వెంకటమహీపతి గంగాధరరామారావు (పిఠాపురం యువరాజు)గారు 1932లో ఆ లోకమునుండి ఆహ్వానం అనే నాటకం ప్రచురించారు. ఈ నాటకంలో వీరు నూతన భావాలను, నూతన ప్రపంచాన్ని చిత్రించి చూపారు. వీరి నాటక రచనా విధానంలో శైలిలో ఒక విశిష్టత, ఒక నూత్నత గోచరిస్తుంది.

దేశానికి వెన్నెముకగా, నిత్యావసరమయిన ధాన్యం పండించి మానవకోటి కడుపునింపే అన్నదాతగా పేరొందిన రైతుజీవితంఇతివృత్తంగా తీసుకుని ఇంతకు పూర్వం సంస్కృత రచయితలుగాని, తెలుగు రచయితలుగాని నాటకం రాయలేదు. 1920 నుంచి జాతీయోద్యమంలో భాగంగా రైతు జనోద్ధరణ ఉద్యమం సాగింది. రైతు విలువను దేశ నాయకులు, ప్రజలు, వీరితోపాటు తెలుగు రచయితలు గుర్తించారు. "ఆగునా జీవాలు, సాగునా లోకాలు రాజుగా మనమెంచి రైతు జూడకపోతే" అంటూ కవులు గానం చేయ

సాగారు. ఈ రైతుఉద్యమ ప్రభావంవల్ల తెలుగులో శ్రీలిగా వచ్చిన నాటకం రైతుబిడ్డ. రచన-సబ్నవీసు రామారావు. ఇందులో రైతు నిత్యజీవితాన్ని, అతని కష్టసుఖాలను, ఆశలను, ఆలోచనలను, మనస్తత్వాన్ని చక్కగా కళ్ళకు కట్టినట్టు చిత్రించారు. నాటకంలో వీరు వాడినభాష జీవద్భాష. గ్రామీణభాష వృత్తికి సంబంధించిన పదాలు, మాండలీకాలు ఇందులో కోకొల్లలు.

నాటక ప్రయోగంలో నూతనాధ్యాయం ప్రారంభం కావడానికి ఆలంబనమయిన మహానాటకం వేలూరి చంద్రశేఖరంగారి కాంచనమాల (1939). అచ్చుకాక పూర్వమే 1938లో బందరులో ప్రదర్శితమయి కళావేత్తల మెప్పుపొందింది. ఇదీ సారంగధర లాంటిదే. అశోకుడి భార్య తిష్యరక్షిత సవతి కుమారుడు కుణాలుని ప్రేమించి, తిరస్కృత మయి అతని కనులు పీకించిన విషాదగాధ. రచనలో సంభాషణలలో శైలిలో ఒక విశిష్టత ఈ నాటకంలో గోచరిస్తుంది. తిష్యరక్షిత పాత్రను అతి సమగ్రతతో తీర్చిదిద్ది మధురవాణి, రోషనారా పాత్రలలాగా మరపురాని పాత్రగా రూపొందించారు చంద్రశేఖరంగారు. బౌద్ధ సాహిత్య ప్రభావితులయిన వీరు బౌద్ధ యుగానికిచెందిన ఈ నాటగాన్నెగాక రవీంద్రుని అబలాయత నాటకాన్ని అనువదించి ప్రచురించారు (1921). రసానుగుణమయిన రంగురంగుల తెరలతో విశిష్ట రంగాలంకరణతో, కాలోచిత వేషధారణతో బందరులో ప్రదర్శితము నూతన ప్రయోగరీతికి మార్గదర్శకమయింది కాంచనమాల నాటకం.

ఈ దశాబ్దంలో (1930-40) లో వచ్చిన విషాద నాట కాలలో సురవరం ప్రతాపరెడ్డిగారి ఉచ్చల విషాదం స్వతంత్ర నాటకం. కథ కాశ్మీసు చరిత్రకు సంబంధించినది. కాశ్మీరు రాజు ఉన్నతాధికారులలో ప్రబలిన అవినీతిని అణచి వేయడానికి సంకల్పించగా, వేనరాజును అతని ఆత్మీయులే వధించినట్లు, ఉచ్చలుని అతని ఉప్పుతిన్న ఉన్నతాధికారులే హత్యచేయడం దీని ఇతివృత్తం. అనువాద నాటకాలలో పురిపండ అప్పలస్వామిగారి ఉత్కల పతనం (1931), శ్రీపాద కామేశ్వరరావుగారి కళాపహాడ్ (1931) ముఖ్యమైనవి.

స్వతంత్ర నాటకాలలో చిలుకూరి నారాయణరావు గారి అంబ (1937) పౌరాణిక వచన నాటకం. కె సుబ్ర హ్మణ్యశాస్త్రిగారి భక్త కుచేల(1933), చందాల కేశవదాసు గారి బలిబంధనం (1935), ముత్తినేనివారి తులసీదేవి (1932), ధర్మవరం గోపాలాచార్యులుగారి సుభద్రార్జునీయం (1932), ముత్తరాజు సుబ్బారావుగారి మార్కండేయ, ఊటుకూరివారి పాషాణి; బాలసరస్వతి భక్త తుకారం ప్రసిద్ధి కెక్కిన పౌరా ణిక నాటకాలు సాంఘిక నాటకాలలో కాళ్ళకూరి హాను మంతరావుగారి కాలేజీ గరల్, లేడీ డాక్టర్; గాలి బాల సుందరరావుగారి అపోహ అనేకసార్లు ప్రదర్శిత మయినాయి. ఎన్. కె. బోసు నాటకాన్ని అనుసరించి గుండిమెడ వెంకట సుబ్బారావుగారు గద్య పద్యాత్మకంగా రచించిన చారిత్రా త్మక నాటకం ఖిల్జారాజ్య పతనం, దేశమంతటా అనేకసార్లు ప్రదర్శితమవడమేగాకుండా తర్జన భర్జనకు గురయింది. వారి

మేవాడు పతనంకూడా ఈ కాలంలో రచించిందే. ముత్తరాజు వారి చంద్రగుప్త, రణతిక్కనకూడా ముఖ్యమైనవే.

త్రిపురనేని వారి 'ఘూనీ' ప్రభావంతో ఈ దశాబ్దిలో వచ్చిన నాటకం ఆమంచర్ల గోపాలరావుగారి హిరణ్యాకశ్యపుడు. ఇదికూడా విప్లవ నాటకమే. ఇందులో హిరణ్యాకశ్యపుని రాక్షస ప్రకృతిగల వానినిగాగాక నాస్తికునిగా, మహోదారునిగా చిత్రించారు. ఆస్తికుడయిన శుక్రాచార్యుడు హిరణ్యకశ్యపుని నాస్తికమత ప్రచారంవల్ల ఆస్తిక మతానికేగాక తన అస్తిత్వానికే ముప్పు వస్తుందనే భయంతో ప్రహ్లాదుని లోబరచుకుని నరసింహమూర్తి వేషం వేసుకుని హిరణ్యకశ్యపుని హత్యచేస్తాడు, ఈ నాటంలో.

1940 నాటికే యువకులలో నవచైతన్యం కలిగింది. మార్క్సిస్టు సిద్ధాంతాలు, భౌతికవాదం, అతివాదభావాలు యువకులను ఆకర్షించాయి. కనువిచ్చి చూచారు. కనిపించే దేమిటి? జీర్ణావస్థలోనున్న సాంఘిక ఆర్థిక వ్యవస్థ. ధనికుడు, పేద అనే రెండు వర్గాలు. ఈ రెండువర్గాలమధ్య నిత్యసంఘర్షణ-ధనికుడు దరిద్రుని పీల్చి పిప్పిచేస్తూ భోగభాగ్యాలలో తులతూగుతూంటే దరిద్రుడు తిండిలేక మూల్గడం వారికి దృశ్యమానమయింది సంఘంలో పెద్దమనుష్యులు చెడపురుగుల్లాగచేరి బూజుపట్టిన మూఢనమ్మకాలను, మూఢచారాలను ప్రచారంచేయడం మతంపేరిట, దేవుడిపేరిట చురన్యాయాలు జరుగుతూండడం గోచరించింది. అభ్యుదయ భావాలతో పొంగిపొరలే యువ రచయితలు ఈ అన్యాయాలను, ఈ వర్గ పోరాటాన్ని వాస్తవిక దృష్టితో పరిశీలించి వాస్తవిక

తమ ప్రాతిపదికగా చేసుకుని చిత్రించడానికి కలం పట్టారు. వీరి లక్ష్యం ప్రజాశ్రేయస్సు. ప్రజలు తమ హక్కులను సంపాదించుకోడానికి జరిపే పోరాటాలను చిత్రించి, వారి శ్రేయస్సుకు దోహదమిచ్చే రచనలను చేయడమే వారి ధ్యేయం.

దీనితో ఆంధ్ర నాటక సాహిత్యం ఇంకోదశను, అభ్యుదయ దశను చేరుకుంది. ఈ నూతన దశలో వచ్చిన నాటకాలలోని విశిష్టత రెండు విధాలు. ఒకటి వస్తువు, రెండు శిల్పం.

పతనావస్థలో నున్న భూస్వామ్య విధానాన్ని ఏదో విధంగా నిలబెట్టుకోడానికి ఎంతటి దారుణాలు చేయుడానికయినా తయారయే జమిందారులు, ధనిక భూస్వాములకు వారి కారినుంచి తప్పించుకుని, శాసన శృంఖలాలను తెంచుకొని స్వేచ్ఛగా జీవించడానికి సంఘటిత పడుతున్న బీద రైతులు, కూలీలకు మధ్య నిత్యసంఘర్షణ అభ్యుదయ నాటకాలకు మూల వస్తువయింది.

పూర్వ నాటకాలలో పురాణ పురుషులు, రాజు, రాణి, మంత్రులు, రుషులు మొదలయిన పై తరగతి పాత్రలకే ప్రాధాన్యం హెచ్చుగా ఉండేది. వారే నాటకాలలో నాయికా నాయకులు. వారి సుఖ దుఃఖాలను చిత్రించడమే రచయిత పరమావధిగా పెట్టుకున్నాడు. చివరకు చింతామణి, వరవిక్రయం, మధుసేవ, తప్పెవరిదినాటకాల నాయకులు సామాన్య ప్రజకాదు. ధనిక వర్గానికి చెందినవారు. నందనారు హరిజన కులానికి చెందిన వాడయినా మహా భక్తుడవ

డంవల్లనే అతని గాధ నాటకంగా రాయడం, అతనికి నాటక నాయకత్వం లభించడం జరిగింది. కాని కాలం మారింది. రచయితల దృష్టికూడా మారింది నాటకాలలో, నాటికలలో సామాన్య మానవుడికి ప్రాధాన్యం పెచ్చింది. నాటకనాయకత్వం లభించింది. మధ్య తరగతి గుమాస్తా, రైతు, కూలి, బడి పంతులు, పతితులు, తాడితులు, వారి సుఖ దుఃఖాలు, జీవిత సంఘర్షణలు, వారి ఆలోచనలు, వారిస్వప్నాలు, శాంతి కాముకత్వం, ధనిక బీదవర్గాల నిత్య సంఘర్షణ ఈఅభ్యుదయ యుగ నాటక సాహిత్యంలో చిత్రిత మవుతున్నాయి.

ధనిక బీదవర్గాల మధ్య నిత్యసంఘర్షణను, ధనిక వర్గాల దోపిడీ విధానాన్ని, తమ హక్కులకోసం, తమ శ్రేయస్సుకోసం, దున్నేవారికి భూమికోసం ప్రజానీకం సాగించిన పోరాటాన్ని ప్రముఖంగా చిత్రిస్తూ నాటకాలు రచించిన జంట రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగార్లు సర్వ సమానత్వంతో సర్వ సౌభాగ్యాలతో సర్వజనులు సుఖంగా జీవించే నవ సమాజాన్ని నిర్మించుకోవాలని కలలుకంటూ, ఆ లక్ష్యసిద్ధికి మహదావేశంతో కలం పట్టిన అభ్యుదయ రచయితలు సుంకర, వాసిరెడ్డి. వీరు రైతు ఉద్యమంలో ఆరితేరిన ప్రజాసేవకులు. వీరి ముందడుగు (1946), మాభూమి (1947) నాటకాలు చరిత్రనే సృష్టించుకున్నాయి. సన్నివేశ కల్పనలో, పాత్రోచిత సంభాషణలు నడపడంలో పాత్ర చిత్రణలో, రసపోషణలో జానుతెలుగు ప్రయోగంలో విశిష్టత, విప్లవతత్వం వీరి నాటకాలలో గోచరిస్తుంది.

నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి నల్లగొండజిల్లాలో జరిగినప్రజాపోరాటమే మాభూమిఇతివృత్తం.“ఈపోరాటంలో 240 గ్రామాలపై పోలీసు దాడులు జరగాయి. 8500 మంది అరెస్టు అయ్యారు. రు. 12 లక్షల 25 వేల విలువగల ఆస్తి లూటీ చేయబడింది. 52 మంది వీరులు ప్రాణాలను కోల్పోయారు నైజాం కిరాతకుల చేతుల్లో 64 గురు స్త్రీలకు-మన తెలుగు సోదరీమణులకు – మానభంగం జరిగింది వీరిలో ఇద్దరు మరణించారు. ఈ మహోజ్వల పోరాటమే మిమ్మల్ని ఈ నాటకం రాయడానికి ప్రోత్సహించింది,” అని రచయితలే మాభూమి నాటక పీఠికలో తెలియజేశారు.

తెలంగాణా ప్రజా పోరాటం భారతీయుల దృష్టినే కాదు, శాంతి కాముక ప్రపంచ ప్రజాకోటి దృష్టినే ఆకర్షించింది. ప్రజాకోటి దృష్టి నాకర్షించిన ప్రజాపోరాట నిజ స్వరూపాన్ని నాటకంగా చిత్రించి చూపాలనే మహదాశయంతో సుంకర, వాసిరెడ్డి రచించిన ఈ నాటకానికి కన్యాశుల్కానికిలాగానే, ఆంధ్రదేశం స్వాగతం పలికింది. మాభూమినికూడా ‘ముందడుగు’కంటే మరో ముందడుగు అని ఆంధ్రప్రజలందరూ అభినందించారు. అచ్చువేసిన రెండు వేల ప్రతులూ మొదటి రెండుమూడ్నెల్లోనే అయిపోయ్యాయి. ఆంధ్రదేశంలో ఇప్పటికి (1947) 125 ‘మాభూమి’ నాటక దశా లేర్పడి, వేయికిపైగా ప్రదర్శనా లిచ్చాయి. ఇప్పటికి సుమారు 20 లక్షల మంది ప్రజాల కీ నాటకం చూపబడింది. (మాభూమి పీఠిక).

రాజకీయ నాయకులు, పండితులు, కవులు, నాటక కర్తలు, పత్రికా రచయితలు, మంత్రులు, నటులు, గాయకులు మొదలయిన రక రకాల ఆంధ్ర ప్రజానీకం మా భూమి నాటకాన్ని తిలకించి పరవశులయి ప్రశంసా పత్రాలను అంద జేశారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, "ఈ నాటక రచన కొద్దిలో మిక్కిలి అందంగా వుంది. ఇంకులో అచ్చమైన తెలుగు జాతీయము కుప్పలు కుప్పలుగా వుంది. మా భూమి ఉన్న భాష తెలుగు గడ్డ తో బుట్టిన భాష... ఈ నాటకం బందగీ సమాధితో మొదలు పెట్టుతుంది. చివర సమాధులతో బూర్తిఅవుతుంది. ఒక కావ్యానికి ఆద్యంతాలు ఇంత చక్కగా బిగించడం ఒక శిల్పపు నేర్పు..." అని మా భూమిని ప్రశంసించారు.

"...తిక్కన్న తర్వాత మళ్ళీ ఈ నాడు జాతీయమైన భాష విన్నాం. ఆ నాటి తెలుగు ఔన్నత్యం పునరుద్ధరించ బడుతూందని ఈ కవులు రుజువు చేశారు..." అని సింగళి లక్ష్మీకాంతంగారు కొనియాడారు

"మా భూమి తెలంగాణా ప్రజల్లో అసమర్థతను పార ద్రోలి తెలంగాణాలో ఒక విప్లవ జ్యోతిని వెలిగించుతోంది. ఆంధ్ర నాటక రంగంలో ఒక కొత్తశకం ప్రారంభమయింది" అన్నారు కొప్పరపు సుబ్బారావుగారు.

"...శ్రీ గురజాడ అప్పారావుగారే ఈ నాటకాన్ని చూచి ఉన్నట్టయితే, 'తాము పడ్డ కష్టాలన్నీ ఫలించినాయి' అని అని ఉండేవారని నా భావం... ఇక్కడ కూర్చున్నంత సేపూ నాటకం చూస్తున్నంతసేపూ నాటకం చూస్తున్నట్టు

లేదు. ఈ దృశ్యాలన్ని మన కళ్ళ యెదుట జరుగుతున్నట్లే ఉంది..." అని గిడుగు సీతాపతిగారు అభినందించారు.

ఆ నాటి మంత్రులుకూడా ఈనాటకాన్ని చూసి ఎంత గానో మెచ్చుకుని ఉపన్యాసా లిచ్చారు. కాని ఆ మంత్రులే రాజకీయ పరిస్థితుల ప్రాబల్యంనల్ల ఈ నాటకాన్ని నిషేధించ డమే విచిత్రం! కన్యాశుల్కం తరవాత అంత ప్రజాదరణ పొందిన నాటకం మా భూమి!

మాభూమి నాటకంలో ప్రధానరసం వీరరసం. ఉత్సాహం స్థాయీభావం. సంఘం స్థాపించుకుని దేశముఖి దౌర్జన్యాలను ఎదిరించి నిలబడి, 'కదిలించి బలగాన్ని ఎదిరించి వైరులను, శక్తి చూపించగల సమయమిదే లేలెమ్మా' అనే ఉత్సహపూరిత కృతనిశ్చయమే ఈ నాటకానికి బీజం (Premise or seed). రెండవరంగంలో సంఘం వ్యాప్తి చెందడం, కథానాయకుడు వీరారెడ్డి ప్రభృతులు దేశముఖుకు ఎదురుతిరిగి లెవీ ఇవ్వనిరాకరించడం ప్రయత్నం. ఇందులోనే దేశ ముఖసంఘాన్ని విచ్ఛిత్తి చేయడానికి ప్రయత్నం ఆరంభమవు తుంది. వీరారెడ్డికి దేశముఖుకు సంఘర్షణ ప్రారంభం. మూడో రంగంలో వీరారెడ్డికి పరిస్థితులన్ని అనుకూలించి, "పేదల రక్తము పీల్చు దేశముఖు పిశాచిసాలన నశింపజేయగ" బయలుదేరడం పరివ్యాప్తి. నాలుగో రంగంలో వీరారెడ్డి అరెస్టు ఫలాగమం అనిశ్చయం కావడం సందిగ్ధస్థితి (Crisis), ప్రతినాయకుడు దేశముఖు బలం పెరగడం. అయిదోరంగంలో మంగలిరాముడు వీరారెడ్డిని విడుదలచేసి తీసుకురావడం. వీరారెడ్డి ఇంట హింసాకాండ జరుగుతున్న దేశముఖు అతని

అనుచరులు ప్రజలు వచ్చేసరికి పారిపోవడం సీయతఫల ప్రాప్తి అంటే ఫలప్రాప్తి తప్పదని రూఢియగుట. ఆరో రంగంలో దేశముఖు నల్లగొండ పారిపోవడం, అసలా ఊరికి తిప్పలు తెచ్చి అందరి కొంపల్ని తీసిన పట్వారీ వీరారెడ్డికి లొంగిపోవడం, అంతటితో దేశముఖు దౌర్జన్యకాండ అంతమై పోవడం ఫలప్రాప్తి.

మొదటి అయిదు రంగాలలో వీరరసం ప్రధానం. చివరికి అంకం మొదటిభాగం సీతాదాదాల మరణ వృత్తాంతం శోకరసం. చివరకు విజయలక్ష్మిని చేపట్టిన ఉత్సాహంతో "వీరులారా, ధీరులారా!...ఇది మాభూమేనోయ్, ఇది మాభూమేనోయ్!" అనే బృందగానంలో వీరరస స్థాపన. వీరి ముందడుగు, ఆపనింద నాటకాలుకూడా ఎంత గానో ప్రజాదరణ పొందినా సుంకర వాసిరెడ్డి నాటక రచనా దక్షతకు, ప్రజా నాట్యమండలి ప్రయోగ కౌశల్యానికి పరాకాష్ట మాభూమి!

'మా భూమి' కన్న ముందుది 'ముందడుగు', నాటక రచనా శిల్పంలో, ప్రయోగ విధానంలో ముందడుగు 'ముంద డుగు'. ప్రజలలో నవచైతన్యంకలిగించి ముందడుగు వేయించిన నాటకం ముందడుగు! వేళ్ళూనుకున్న జమీందారీ వ్యవస్థలో నలిగిపోయే రైతులసముద్ధరణకు సాగిన జమీను రైతుల పోరా టానికి దోహదమిచ్చిన నాటకం ముందడుగు. వందల ప్రదర్శ నాలలో లక్షాదిజనులను తనియింపజేసిన నాటకం ముందడుగు.

ముందడుగు నాటక ఇతివృత్తం జమీందారీ యుగపు దురాచారాలు, తత్ఫలితంగా రైతులు పడే బాధలు. రచయి

శలు రైతు బిడ్డలు, రైతు ఉద్యమంలో కాకలుతేరిన ప్రజా సేవకులు కావడంవల్ల ఆ దురాచారాలను, రైతుల బాధలను, జమీందారుల కుటిలపన్నాగాలను, ఆపన్నాగాలను ధైర్యంగా చిత్రించి చూపాము.

తెనాలిలో జరిగిన గుంటూరుజిల్లా రైతు మహాసభలో మొదటిసారిగా నలభై వేల ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శితమై మెప్పు పొందింది. ప్రజా నాట్యమండలివారు దీనిని రసానుగుణమయిన రంగు తెరలతో, కట్టుబాటుతో, ప్రజలకు చైతన్యం కలిగించాలనే దృష్టితో ప్రదర్శించడం నాటక రచనకు వన్నెపెట్టింది

పీరి రెండో నాటకం అపనిందకూడా ప్రజాదరణ పొందిన నాటకం. సంఘసంస్కారమే ప్రధానోద్దేశంగా మధ్య తరగతి ప్రజలకోసం రాసిన సాంఘిక నాటకం. తాను వలచిన యువతి తనను తిరిగి ప్రేమించలేదనే కక్షతో ఆమె మీద నీలాప నిందలువేసే నీచ ప్రవృత్తిని ఇందులో రచయితలు చక్కగా చిత్రించారు.

మహాకవి శ్రీశ్రీ నన కవనానికి కావాలని కోరిన "కదలి కదలించి పెను నిద్దుర వదలించి, మును ముందుకు సాగించి, పరిపూర్ణప్ర బతుకిచ్చే," గుణం సుంకర వాసిరెడ్డి నాటక త్రయంలో భాసిస్తోంది.

ఈ కోవకుచెందిన నాటకాలలో కొండముది గోపాల రాయశర్మగారి ఇదీలోకం (1946) ప్రసిద్ధికివచ్చింది. ఇందులో శర్మగారు పెట్టుబడిదారీ విధానంలోని చెడును,

చీకటి వ్యాపారం, ఆకలి బాధలను చక్కగా చిత్రించారు. ధనిక భూస్వాముల దగ్గర పనిచేసే పాలేళ్ళ దుర్భర జీవితాన్ని కనులకు కట్టేటట్లు, మనసు కరిగేటట్లు బోయి భీమన్నగారు పాలేరు (1946) అనే నాటకంలో విశదీకరించారు. వేదాంత కవిగారు "ఆకలిమంటలు" నాటకంలో ఆకలి ప్రజలలో తిరుగుబాటును రేకెత్తించడం.'కష్టకాలంలో'జమీందారులు, మతాధికారులు బీదలను పీడించడం చిత్రించారు.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించింది. అయితే ఈస్వాతంత్ర్యం లభించడానికి విషాద సంఘటనలు, విషమ రాజకీయాలు దారితీశాయి. కనీవినీ ఎరుగని హింసాకాండ జరిగింది. ప్రజా హృదయాలు, కళాకారుల హృదయాలు విదళితమయినాయి. ఆ హింసాకాండను చిత్రించే నాటకాలు 1947-48 సంవత్సరాలలో చాలా వెలువడ్డాయి. వాటిలో విశిష్టమైనది ఆచార్య ఆత్రేయ రచించిన ఈనాడు (1948) నాటకం. ఒకే ఇంటిలో అన్నదమ్ములవలె నివసించే హిందూ ముస్లిం కుటుంబాలలో బ్రిటిషువారు మతంపేరిట కలహాలు రేకెత్తించి హత్యలకు దారితీయించడమే దీని ఇతివృత్తం. ఒకే సెట్టు. హృదయాలను పిండిచేసే సంఘటనలు, గుండెకు సూటిగా గుచ్చుకునే సంభాషణలు ఇతివృత్తానికి బలం చేకూర్చాయి.

కొండముది గోపాలరాయశర్మగారి ఏకదేశం (1947) బ్రిటిష్‌వారి విభజించి పాలించే రాజనీతికి సాంకేతిక రూపం. కె. యల్. నరసింహారావు, పత్తిగొడుపు రాఘవరాజు

ప్రభృతులు స్వాతంత్ర్యోద్యమంలోని వివిధ దశలను తమ తమ నాటకాలలో చిత్రించారు.

తిరుపతి కవుల పాండవోద్యోగవిజయాలు తరవాత అంతటి స్థాయిలోను ప్రచారానికి వచ్చిన నాటకాలు కొప్పరపు వారి తారాశశాంకం (1948), తాండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రిగారి రామాంజనేయయుద్ధం(1949) ఈదశలోవచ్చినవే. ఈ రెండూ ప్రయోగ సౌలభ్యాన్ని అతవరుచుకున్న నాటకాలు.

పాత కథలే తీసుకుని కథా విన్యాసంలో, పాత్ర చిత్రణలో కొత్త పోకడలు పోయిన రచయిత ఊటుకూరి సత్యనారాయణగారు. వీరి ద్రౌపది, శివాజీ (1943), అనార్కలీ (1941), వీరాభిమన్యు (1950) అనేకసార్లు ప్రదర్శితమయి మన్ననల నొందినాయి. నండూరి రామకృష్ణమాచార్యులుగారి ధర్మచక్రం (1950) బిందుసారుడు బౌద్ధ మతాన్ని స్వీకరించిన గాథ. వీరే ఛత్రపతి శివాజీ నాటకంలో శివాజీ శౌర్య పరాక్రమాలను రాజ నీతిని చిత్రించారు. శేషుబాబు తిష్యరక్షిత గాథను అశోక రాజ్యంలో (1945) రమణీయ నాటకంగా రచించారు. ఈ దశాబ్దంలో వచ్చిన పౌరాణిక నాటకాలలో ఎన్నదగినది పైడిపాటివారి ఉషాసుందరి.

స్వాతంత్ర్య సంపాదనా ఉత్సాహంలో మన పూర్వీకులు గొప్పదనాన్ని, శౌర్య పరాక్రమాలను, ఉదాత్త స్వభావాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని వాటిని నాటకాలుగా నెలువరించినవారు కణ్వశ్రీగారు. వీరు ఆ నాడు (1948) ప్రజలని ఎంతగానో ఆకర్షించింది. ప్రప్రథమంగా భారతదేశం ఘోరీ

వశ్మై శానిసత్వంలో పడ్డగాధ దీనిలోని ఇతివృత్తం. పృథ్వీ రాజు, జయచంద్రుడు, ఘోరీల మనస్తత్వాలను పీరుచక్కగా చిత్రించారు. అనంయక్యతానార్థం స్వాతంత్ర్యానికి ముప్పు అని ఈనాటకందారా కణ్వశ్రీగారు ప్రజలకు,నాయకులకు గుర్తుకు తెచ్చారు. డి.వి.కృష్ణమూర్తిగారి విషాద తిమ్మరుసు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి రాజరాజు ఉత్తమ విషాద నాటకాలు. రాజరాజులోని భాష, వాతావరణం, పాత్ర చిత్రణ మనలను ఆ కథాకాలంనాటికి తీసుకు వెళతాయి. మనం ఆ కాలంలో నివసిస్తున్న ట్టనిపిస్తుంది

ఆంధ్రరాష్ట్రోద్యమానికి దోహదం చేయడానికి ఆవేశంతో ఈదశాబ్దంలో రచయితమయిన నాటకాలు చాలా వెలువడ్డాయి. వాటిలో వేదాంతకవిగారి తెలుగుతల్లి ఆంధ్ర రాష్ట్రోద్యమ ప్రభావంవల్ల వెలువడి తిరిగి దాని నెంతో ప్రభావితం చేసిన నాటకం. ఆంధ్రదేశమంతటా అనేకసార్లు ప్రదర్శితమై ప్రజాహృదయాలనుచూరగొన్ననాటకం.ఇందులో నాటి ఆంధ్రుల దుస్థితి చిత్రితమయింది. వావిలాల సోమయాజుల గారి నాయకురాలు (1946) రక్తాన్ని ఉడుకెత్తించే వీరరస ప్రధాన నాటకం. ఇదీ అనేకసార్లు ప్రదర్శితమయి మన్ననల నందుకుంది. గుళ్ళపల్లి నారాయణమూర్తిగారి ఆంధ్రజ్యోతి, రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారి కొండవీడు (19౨0) ఆంధ్రులపూర్వ వైభవాన్ని తలపుకు తెచ్చే నాటకాలు.

ముద్దుకృష్ణగారి టీకప్పులో తుఫాను (1940), అడ యికప్పిళ్ళై (1941) చక్కని వినోదాన్ని కలిగించేనాటకాలు. హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు మోల్యేర్

నాటకాలను అనుసరించి రచించిన పెళ్ళి ట్రయినింగు, పెళ్ళి కంట్రోలు, పూర్ణాంగం, మాయలమాలోకం అనేక పార్లు ప్రదర్శితమయి, ఎంతో వినోదాన్ని చేకూర్చాయి.

1944 లో ఆంధ్ర నాటక కళాపరిషత్తువారు సాంఘిక నాటక ప్రదర్శనాల పోటీలు ప్రారంభించడంతో సాంఘిక నాటక రచనకు ఎంతో ప్రోద్బలం లభించింది. ప్రతి సంవత్సరము పోటీలకోసం కనీసం నూరు సాంఘిక నాటకాలయినా తయారవుతున్నాయి. అయిదు సంవత్సరాల కితం వెలువడిన నాటకాలు, ఒకసారి పోటీకి వచ్చిన నాటకాలు ఇక పనికిరావని నిబంధించడంతో కొత్త నాటకాలను నాటక సమాజాలవారు రాయించుకోవలసి వస్తోంది.

నాటక కళా పరిషత్తువారు నాటక రచనకు బహుమతి పర్వవచడంతో రచయితలు శ్రద్ధగా కొత్త పోకడలతో, కళాత్మకంగా రచనలు సాగించ పూనుకున్నారు. తెలుగు నాటక రచయితలుమీద పరిషత్తు ప్రభావం చెప్పనలవికానిది.

ఈ పోటీల ప్రభావంవల్ల మొదటిదశలో వచ్చిన మంచి నాటకం కొండముది గోపాలరాయశర్మగారి ఎదురీత (1947). ఇందులో శర్మగారు సంఘ సంస్కర్తలను ఎదుర్కొనే సమస్యలను, అడ్డంకులను, చిక్కులను చిత్రించారు. గుళ్ళపల్లి నారాయణమూర్తిగారు 'విడాకులా?' నాటకంలో విడాకుల సమస్య చిత్రించి ప్రజలముందు పెట్టారు. బోయి భీమన్నగారి అసూయ (1948) ఆ నాటి విద్యార్థి జీవితాన్ని ద్యోతకం చేసే నాటకం.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ దానినే స్వాతంత్ర్య సంపాదనకు సాధనంగా చేసుకోవడంవల్ల దాని ప్రభావం రచయితలమీద పడింది. అహింసా సిద్ధాంతానికి మూలపురుషుడయిన బుద్ధ భగవానుని జీవితంమీదకు రచయితల దృష్టి మరలింది. పానుగంటివారి బుద్ధబోధ సుధతరవాత తిరిగీ ఈదశాబ్దంలోనే బుద్ధుని మహాభినిష్క్రమణను చిత్రించే నాటకాలు వెలువడ్డాయి. వాటిలో ఆత్రేయ, గోపాలరాయ శర్మగారి గౌతమబుద్ధ నాటకాలు ప్రశంసనీయ మయినవి.

మధ్య తరగతి కుటుంబాలు ఘరానా కోసం, పరువు కోసం పాకులాడుతూ నానా బాధలూ పడడం ప్రప్రథమంగా కొండముదివారు న్యాయం (1947) అనే నాటకంలో చిత్రించారు.

ఈ దశాబ్దంలోనే ప్రపంచ ఖ్యాతిగాంచిన పాశ్చాత్య నాటకాలు చాలా తెలుగులోకి వచ్చాయి కొప్పరపువారి ఇనపతెరలు; అవసరాల వెంకటనర్సుగారి జ్యోతిర్మయి; శ్రీశ్రీ వరదల సంపెంగతోట; సోమంచివారి కల్యాణి: ముప్పన చిన అంకయ్య కుళ్ళు సరుకు; గౌతమ మేడిపళ్ళు; విద్వాన్ విశ్వంగారి ప్రజా విరోధి అలాంటి నాటకాలే.

సాంఘిక, ఆర్థిక పరిస్థితులకారణంగా, మనోదౌర్బల్యం కారణంగా పతితలయిన స్త్రీలసముద్ధరణే ఇతివృత్తంగా ప్రప్రథమంగా వెలువడిన నాటకం పిఠాపురం యువరాజాగారి "తీరని కోరికలు-తరువాత." ఇందులో పతిత సముద్ధరణకు పూనుకున్న సంస్కర్తను అపార్థం చేసుకుని, ఆ పతితలను తిరిగి పూర్వ

జీవితానికి మళ్ళించడానికి సంఘం యత్నించడం ఈ నాటకంలో చిత్రితమయింది

ఈ దరలో వచ్చిన నాటకాలలో మల్లాది అచ్యుత రామశాస్త్రిగారి సకుటుంబాయి, జంపనవారి వెంకటేశ్వర మహాత్మ్యం, ఊర్వశి; గుండిమెడవారి పృథ్వీప్రతి, కోటగిరి వెంకట కృష్ణారావుగారి అభినవపాండవం, బెబ్బులి; కాజ రాధాకృష్ణశాస్త్రి అమరజ్యోతి మొదలైనవి ప్రసిద్ధిగాంచాయి.

ఈ దశాబ్దంలో (1940-50) వచ్చిన నాటకాలలో మా భూమి తరవాత అంత స్థాయిలోనూ అశేషప్రజానీకాన్ని కదలించిన నాటకం ఆచార్య ఆత్రేయ యన్. జి. ఓ లేక గుమాస్తా. ఇందులో మధ్యతరగతికి చెందిన గుమాస్తా దుర్భర జీవితం ప్రేక్షక పాఠక హృదయాలను ద్రవింపజేసేటంత నేర్పుతో ఆత్రేయగారు చిత్రించారు. గుమాస్తా జీవితమే దీని ఇతివృత్తం. ఆ గుమాస్తా కంపుకొట్టే ఇంటిలో కాపరంచేస్తూ, దాని ఫలితంగా కుటుంబంలోని వారికి వచ్చిన రోగాల నివారణకు డబ్బు లేలేక, అద్దెకు ఇంటి యజమాని పెట్టే బాధలు భరిస్తూ, పరువుకోసం పాకులాడుతూ 'చావాలేక, బతకాలేక' మనో వేదనతో కుళ్ళుతూ చివరకు భౌతిక ఆంతర భావాలను తట్టుకోలేక చెల్లెలి పెళ్ళికోసం లంచంపట్టి జైలుపాలుకావడంతో గుమాస్తా జీవిత గాథ ముగుస్తుంది. గుమాస్తా హృదయ సంక్షోభాన్ని దీర్ఘస్వగతంలోనో పెట్టి వర్ణించకుండా చిన్న చిన్న క్రియలతో, చిన్న చిన్న మాటలతో ద్యోతకం చేయడం ఆత్రేయగారి ప్రత్యేకత.

సంభాషణలను అవసరమయిన చోట్ల చకచకా నడపడంలో జాగా ఇవ్వవలసినచోట ఇస్తూ, వాటికి పదునుపెట్టి వదులుతూ నాటకం నడిపాము. గుమాస్తాతమ్ముడు గోపీ నోట వచ్చే ఒక్కొక్క మాటా ఒక్కొక్క శూలం. పైకి పొంగకుండా లోలోపల కలచివేసే గోపీ భాధ అతనికి సత్యాన్ని గోచరింప చేసింది. "చదివి విజ్ఞానం గడించడం మానవుడైనవాడికి అవసరమే. కాని అంతకన్నా ముఖ్య బతకడం," అన్న గోపీ మాటలే ఈ నాటకంలోని సందేశమేమో?

ఒకే సెట్టుమీద జరిగే ఈ గాథ ప్రేక్షక హృదయాలను గుప్పిట పట్టేస్తుంది.

యన్.జి ఓ నాటకంతో తెలుగు నాటక సాహిత్య చరిత్రలో మరో అధ్యాయం ప్రారంభ మయింది. నాటక రచయితలమీద, వారి నాటకాలమీద ఈ నాటక ప్రభావం ఎంతయినా పడింది. ఈ నాటకంలో ఆత్మీయ విప్లవ శంఖం వినిపిస్తుంది.

ఆటంబాంబు జపాన్‌మీద అమెరికా ప్రయోగించడంతో ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముగిసింది. కాని అగ్రరాజ్యాలవారు ఒకరినిచూసి ఒకరు భయపడి పోటాపోటీగా మారణాయుధాలు తయారుచేయసాగారు. నాటి ప్రపంచ రాజకీయ పరిస్థితులలో ఏ క్షణాన ప్రపంచయుద్ధం విరుచుకు పడి మానవజాతి మనుగడకే ముప్పువస్తుందోనని ప్రపంచ ప్రజలు గడగడలాడసాగారు ఈ దారుణ పరిస్థితిని అరికట్టడానికి ప్రపంచ శాంతికాముకులు కదలి, 'యుద్ధంవద్దు, శాంతి కావాలి. మారణాయుధోత్పత్తి ఆపాలి' అనే నినాదంతో

శాంతి ఉద్యమం లేవదీశారు. ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. ప్రపంచ శాంతి ఉద్యమ ప్రభావం ప్రపంచ రచయితలమీదకూడా పడింది ప్రపంచ శాంతి సంస్థాపనలో తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనే సంకల్పంతో ప్రపంచ రచయితలు, వారిలాగానే తెలుగు రచయితలు వారి చేతిలోని ఆ యుద్ధం - కలం పట్టారు. యుద్ధంనద్దు శాంతి కావాలనే ఆ తేయ శంఖారావం వారి విశ్వశాంతి, అశోక సామ్రాట్ నాటకాలలో వినిపించి చెవులలో గింగురు మంటూంటుంది.

యుద్ధాల మూలకారణాలను నిర్మూలించడం ఎలా అనే ఆ తేయ జిజ్ఞాసకు, వేదానా తపస్సుకు "నరము దీర్ఘాన్వేషణకు ఫలితం విశ్వశాంతి నాటకం. ఈ సమస్యకు మూలమైన వ్యవస్థాక్రమాన్ని దాని అంతిమ ఫలితాలైన విజ్ఞానపు వైరితలలను మన కళ్ళెదుట నగ్నంగా ప్రదర్శించిసూత్రంగా తన్నివారణోపాయాలనుసూచించి మనలను కార్యోన్ముఖులను గావించారు" (ప్రకాశిక) ఆ తేయ. ఈ నాటకంలోని పాత్రలు వ్యక్తులుకారు. వారి వారిపేర్ల సాంకేతికాలు. మంచుగుండు తయారీ ఫ్యాక్టరీ యుద్ధానికి సాంకేతికం.

యుద్ధాలను సృష్టించి లాభం పొందాలనే వారొకవంక, యుద్ధోన్మాదాన్ని నిర్మూలించి శాంతిని స్థాపించాలనే వారొకవంక మనకు విశ్వశాంతి నాటకంలో తారసిల్లుతారు. ఈ రెండువర్గాల వారికీ, ఈ రెండు సిద్ధాంతాలకు సంఘర్షణే ఈ నాటక కథావస్తువు.

ఆ నాటకంలోని ఇంకో విశేషం 'యుద్ధం' అనే అంతర్నాటకం ఈ అంతర్నాటకంలో యుద్ధ భీభత్సస్వరూపాన్ని, దాని మూలంగా కలిగే భౌతిక నైతిక పతనాన్ని హృదయాలకు హత్తుకునేట్టు చిత్రించారు ఆత్రేయ. మనమూ 'యుద్ధంవద్దు, శాంతికావాలి' అని ఘోషించి తీరుతాం.

మహాకవి శ్రీశ్రీ పూర్వ యవనికలో చెప్పినట్లు "నాటక రంగమనే వైద్యశాలలో జరుగుతున్న ఒక చికిత్సా విధానమే ఈ విశ్వశాంతి".

అశోక సామ్రాట్ నాటకంలో ఆత్రేయ - చరిత్ర చెప్పుతున్నట్టు రక్తసిక్తమైన యుద్ధ భూమిని చూసి, కొడుకును కోల్పోయిన వృద్ధమాత ఆక్రందనం విని హృదయం ద్రవించి ఆయుధ విసర్జన చేసినట్టుగాక, యుద్ధాలతో విసిగెత్తిన ప్రజ విప్లవం లేవదీసి, యుద్ధం ఆపి శాంతి స్థాపించమని ఒత్తిడి తేగా, అశోకుడు ప్రజాభిప్రాయాన్ని మన్నించి ఆయుధ విసర్జనచేసినట్టు చిత్రించారు. ఇందులోనూ యుద్ధోన్మాదం నశించి ప్రజాభిప్రాయానికి, శాంతి ఉద్యమానికి విజయం లభిస్తుంది. రాజ్యం రాజుదికాదు ప్రజలదని నిరూపిత మవుతుంది.

కాశ్మీరు యుద్ధంలో పోరాడే సైనికులు యుద్ధ భీభత్స స్వరూపాన్ని, మారణహోమాన్ని కళ్ళారా చూసి, అనుభవించి యుద్ధంమీద యుద్ధం ప్రకటిస్తారు పడాల రామారావు గారి 'సందేశం' అనే నాటకంలో.

ముందడుగు, మా భూమి నాటకాలలో చిత్రితమయిన ప్రజా పోరాట మహదాశయం ఇంకా సిద్ధించలేదు. ప్రజా

పోరాటాలు ఎదో ఒకరూపంలో ఇంకా సాగుతూనేఉన్నాయి. తెలుగు అభ్యుదయ రచయితలు ఈ పోరాటాలను ఇంకా నాటక రూపంలో చిత్రిస్తునే ఉన్నారు.

మా భూమి నాటకంలో పట్టణాలు పట్టిన దేశముఖులు నిజాం పోలీసు సహాయంతో తిరిగి వచ్చి గ్రామాలలోని ప్రజలను నానా హింసా పెట్టడం, వాసిరెడ్డి భాస్కరరావుగారు పోతుగడ్డ (1953) నాటకంలో చిత్రించారు.

"ఏంతో మనసం తరవాత, జీవితానుభవం తరవాత ...ఏర్పడిన తత్త్వ దృష్టితో" బెల్లంకొండ రామదాసుగారు అతిధి అనే నాటకం రచించారు మిల్లుకు మనిషికి, న్యాయానికీ అన్యాయానికీ జరిగిన సంఘర్షణే ఈ నాటక ఇతివృత్తం. ఇందులోని నాయకుడు కుల గోత్రాలకు, ఊరు పేరుకు అతీతుడయిన 'అతను!' ఇందులో ధనికులు పేదవారిని తియ్యని మాటలతో ఎలా మోసగించి వారి పోరాటాన్ని ఎలా చల్లార్చారో, వారి చేతనే వారి నాయకుడు 'అతను' ను ఎలా చంపించారో ద్యోతకం చేశారు.

ప్రజా పోరాటాల ప్రధాన సమస్యలలో బంజరుభూమి సమస్య ఒకటి బీదరైతు, కూలీ ప్రజానీకంలో ఇంత స్వంత కొండ్రడ సాగుచేసుకుని, తాను సుఖిస్తూ, అధిక పంట పండించి దేశానికి అర్పించాలనే కోరిక బలీయమయింది. ఈ కోర్కె బలీయం కావడంవల్లనే వినోభాభూదాన ఉద్యమం లేవదీశారు.సమస్యకు ప్రధాన్యం వచ్చింది.

సుంకర సత్యనారాయణ, కె.వి. రమణారెడ్డి, పి. వేణు ప్రభృతులు ఈసమస్యను, బంజరుభూమిపోరాటాన్ని చిత్రస్తూ

నాటకాలు రాశారు. సుంకర భూమికోసం (1954) అనే నాటకంలో ధనిక భూస్వామి వర్గానికి, బీద ప్రజానీకానికి మధ్య ఘర్షణను చిత్రించారు. పెద్దరైతు భూమికోసం పడే శ్రమను ఆసరా చేసుకుని ధనిక భూస్వామి అతనిని చేరదీసి బంజరుఇచ్చి సాగుచేసిన తరువాత అతనిని వెడలగొట్టడమే ఈ నాటక ఇతివృత్తం. చిన్నచిన్న మాటలతో ఎంతో అర్థాన్ని పొదివి బీదరైతు హృదయ ఆవేదనను ఇందులో సుంకర ద్యోతకం చేశారు.

దేశం నలుమూలలా జరుగుతూన్న బంజరు పోరాట ప్రభావంవల్ల వచ్చిన నాటకం. కె. వి. రమణారెడ్డి, పి వేణుగార్ల అన్నపూర్ణ (1962). "అనేక గ్రామాలలో జరుగుతున్న పోరాటంయొక్క అనేక లక్షణాలను గుదిగుచ్చి ఈ నాటకంలోని ప్రధాన సమస్యగా రూపొందించాం," అని రచయితలే పీఠికలో చెప్పారు. అయినా మనకు కొట్టవచ్చినట్లు కనిపించేది బంజరు సమస్య. దాని చుట్టూనే నాటకమంతా పరిభ్రమిస్తుంది. గాడిదలదిబ్బ గోభూమి, పందికొక్కుల గుంట పోరంబోకు. ఈ రెంటి ఆక్రమణకోసం బీద ధనిక వర్గాలకు కలిగిన ఘర్షణే ఈ నాటక ఇతివృత్తం.

జమీందార్లు, ధనిక భూస్వాములు చేతులు కలిపి బీదరైతులను, సామాన్య కుటుంబీకులను ధనాశతో, కామాంధతతో ఎలా నానా అవస్థలుపెట్టి నాశనం చేయాలని చూస్తారో పినిశెట్టి శ్రీరామమూర్తిగారు 'పల్లెపడుచు' 'అన్నాచెల్లెలు' నాటకాలలో హృదయ విదారకంగా వ్యక్తిక

రించారు ఈ రెండు నాటకాలు [పేమిక పరితల గుండెలను పట్టివేస్తాయి అందుకే వండలసాస్లు [పదర్శితమయినాయి.

ధనిక భూస్వామి జమిందారుని చంపించి, ఆయన భార్యను వశం చేసుకుని నిర్దాక్షిణ్యంగా రక్త బంధువులను నానా అనస్థల పాలుచేయడం, అతని భావను జైలులో పెట్టించి, స్వంతమేనల్లుని, మేనగోడలను వీధిపాల్జేయడం, ఆ ఓడ్డలు వీధివెంట బిచ్చమెత్తుకునే పరిస్థితి రావడం పినిశెట్టి [పేమిక హృదయాలను కరిగించే విధంగా రచించారు జమిందారిణి చివరకు ఆమె [పియుడు ధనిక భూస్వామి దురాశకు బలైపోతుంది. జమిందారీ పతనాన్ని ఇలా సూచించాడు రచయిత. ధనిక భూస్వామికొడుకే సబుఇనస్సు క్రూరంగా న్యాయం పక్షంవహించి తండ్రిని అరెస్టు చేయడం ఈ నాటకంలోని విశేషం.

ధన మదాంధుని కామాగ్నికి ఇంధనమయిపోయిన నిర్మల చరిత సీతగాథే అన్నాచెల్లెలు నాటకంలోని ఇతివృత్తం. సీతను లొంగదీసుకోడానికి వేరు మార్గంలేక ధన మదాంధుడైన మిల్లు యజమాని కుటపన్ని ఆమెను కాపాడే వాళ్ళందరినీఆమెనుంచివేరుచేసిఆకలిని సృష్టిస్తాడు.ఆకలిబాధలో తీయని ఎూటలకు మోసపోయి ఆధన మదాంధుని కామానికి బలై, చివరకు న్యభిచారిణి అనిపించుకుని అన్నచేతిలో మరణిస్తుంది. సత్యం గుర్తించి అన్న తనూ పొడుచుకుంటాడు. ఇందులో ధనికులు తమ అభీష్టం నెరవేర్చుకోవడానికి వేసే ఎత్తులు, చూపే ఆశలు పేదల నిజాయితీ నిర్మలజీవనం బహుశక్తివంతంగా చిత్రించారు పినిశెట్టి. అన్నాచెల్లెలు

నాటకం ఆకలి రాక్షసికి బలయిన అన్నాచెల్లెళ్ళ విషాద గాథ !

పడాల 'భూదేవి', కోడూరి అచ్చయ్యగారి 'పెత్తందారు', కొడాలి గోపాలరావు 'తిరుగుబాటు', కణ్వశ్రీ 'ఇదా ప్రపంచం', బల్లా ఈశ్వరుడుగారి 'నేటి న్యాయం', నవకుమార్ 'ప్రజావిజయం', భూషణబాబు 'స్వతంత్రభేరి', సోమసుందర్ 'మందీ-మనిషి', లక్ష్మీకాంతమోహన్ 'సమ్మె పిలుపు' ఈ కోవలోసవే.

నేటి ప్రాంతాలు ముఠా తత్వాలకు నిలయమయి పోయాయి. ఎప్పుడూ తగాదాలు. కుట్రలు, ఖూనీలు, కోర్టుల చుట్టూ తిరగడం విపరీతమయిపోయింది. పరిస్థితుల ప్రభావం వల్ల ఈ కక్షలలో తల దూర్చవలసి వచ్చిన అమాయకులు, నిజాయితీపరులు బలయిపోతున్నారు. ఈ అమాయకులను, నిజాయితీపరులను తమ వేపుకు తిప్పుకొని వారు తమ స్వార్థాలకు వినియోగపడకపోయేసరికి నాశనం చేసేస్తున్నారు పార్టీ నాయకులు.

గ్రామాలలోని ఈముఠాతత్వాలను, దురన్యాయాలను చిత్రిస్తూ అనిసెట్టి సుబ్బారావుగారు రచించిన మా వూరు (1954) ఈ దశలోని ఉత్తమ నాటకాలలో ఒకటిగా లెక్క వేయవచ్చు. చెరువుకింద భూమి మాలపల్లికి దక్కకుండా చేయాలని ధనిక భూస్వాముల పన్నిన కుట్ర, ఆ కుట్రలో పరిస్థితుల ప్రభావంవల్ల ఇరుక్కుని అఖరి క్షణంలో సత్యాన్ని గ్రహించి, ఆ సత్యం కోసం నిలబడి, రెండు పార్టీలకు దూర

మయి హతమయిపోయిన బడిపంతులు శివశంకరం అంతర సంఘర్షణ మా వూరు!

ప్రదీప్త చైతన్యంగల వ్యక్తిత్వానికి పరిసర సాధారణ సమాజంతో పరిస్థితులతో జరిగే సంఘర్షణకు ప్రతినిధే బడి పంతులు శివశంకరం. "ఈ ప్రధాన సంఘర్షణ కేంద్రంగా చేసుకుని 'మా వూరు' నాటకం పరిభ్రమిస్తుంది. చరిత్రలో అనాదిగా సాగి వస్తున్న అవన్యచైతన్య వేదనే ఇతివృత్తంగా ఈ నాటకం ప్రయాణం చేస్తున్నది. చైతన్యమే ఈ నాటకానికి హీరో. అది పొందే వేదనే ఇతివృత్తం." (పీఠికలో బెల్లంకొండ రామదాసుగారి వ్యాఖ్య.)

అనాదినుంచి మానవుడిని భయం నీడలా నెన్నంటి వుంది. ఆ భయంతోనే మానవుడు కుంగిపోతున్నాడు. అల్పాయుష్కుడవుతున్నాడు. భయంతోనే జీవితానికి రూప రేఖలు దిద్దుకుంటున్నాడు. దేవుడిని దేవతలను సృష్టించుకున్నాడు. భయంతోనే మారణాయుధాలను తయారుచేసుకుని మానవజాతి మనుగడకే ముప్పు తెచ్చి పెడుతున్నాడు. మానవ జీవితాన్ని అంతగా పెనవేసుకున్న భయాన్ని, ఆ భయంతో మానవుడుచేసే చేష్టలను, ఘర్షణను ఆత్రేయగారు భయం అన్న నాటకంలో చక్కగా చిత్రించారు

తెర తొలగక పూర్వమే వినిపించే, "భయం యుగం భయం యుగం, మహాభయంకరయుగం" అనే పాటలో భయ నిజస్వరూపం గోచరించి, నాటకంలో క్రమక్రమంగా బహు ముఖాలుగా విస్తరించుకుంటుంది. ఈ నాటకంలోని ప్రతి వారు భయంతో కుంగిపోయేవారే. భయమే వారి ప్రవర్త

నకు మూలకారణం. భయంలేనివాడల్లా ఓ. సి శంకరం ఒకడే. రకరకాల భయాలతో కుంగిపోయే వ్యక్తులు ఒకచోట చేరితే, వారిమధ్య భయం ఎరగనివ్యక్తి నిలబడితే సంఘర్షణ! అదే భయం నాటకం.

"ఇంకెంతోకాలం ఈ భయంతో బతకలేం. భయాన్ని యే నాటికయినా జయించాలి," అనేదే ఈ నాటకం మానవ కోటికిచ్చే సందేశం.

తెలుగువారికి కాదు, తెలుగు తెలియని భారతీయులను, విదేశీయులనుకూడా ఆకర్షించి మెప్పుపొందిన నాటకం "భయం".

రాజకీయాలను హాస్యంతోరంగరించి తీయనిమంచులా సేవింపజేసి కవ్వించి నవ్వించి, కళ్ళు తెరిపించే నాటకాలలో కొడాలి గోపాలరావుగారి "ఛైర్మన్", కొండేటి సుబ్రహ్మణ్యంగారి "ప్రెసిడెంటు పట్టయ్య" ఉత్తమ నాటకాలు

పదవీ కాంక్షతో అసమర్థులు స్థానిక సంస్థలలో ప్రవేశించి నీతీ నిజాయితీ వదలి తమ పదవులు నిలుపుకోవడానికి ఎటువంటి ఘాతుకాలకైనా తయారవుతారో, వారి రాజకీయాలు, పదవీ వ్యామోహం మూలంగా ప్రజల కెలాంటి ఇక్కట్లు సంప్రాప్తిస్తాయో, రాజకీయాలు, పార్టీ కక్షలు నీతి పరులను సైతం ఎలా తప్పుదోవపట్టిస్తాయో, మతం పేరుతో మతాధికారులు ఎలా హత్యలకు సైతం సిద్ధమవుతారో, ఛైర్మన్ నాటకంలో గోపాలరావు నిరూపించారు. ఇందులోని ఛైర్మన్, కౌన్సిలర్లు మనకు ప్రతి మున్సిపాలిటీలోనూ తారసిల్లుతూనే ఉంటారు. నాటకం చదువుతూన్నంతసేపూ, ప్రద

ర్శనం చూస్తున్నంతసేపూ వాస్తవిక జగత్తులోని రాజకీయా లను అద్దంలో చూస్తున్నట్టుంటుంది.

ఇక ప్రెసిడెంటు పట్టయ్య నిశానీ పద్దు. "జీవితంలో రాజీ పడలేక, పోరాడలేక సిద్ధాంతములకు, అనుభవములకు మధ్య నలిగి" పోతాడు. "విభిన్న మనస్తత్వములు, విరుద్ధ ప్రవృత్తులుగల"పట్టయ్య కుటుంబం రాజకీయాల మూలంగా "విపరీత విపత్కర పరిస్థితులకు గురవు"తుంది.

ఈ రెంటిలోనూ రక రకాల యాసలవల్ల హాస్యానికేం కొదువ వుండదు. హాస్యం చాటున నేటి కుళ్ళు రాజకీయాల మీద అధిక్షేప చురకలు దోబూచులాడుతూంటాయి.

గైతు జీవితాన్ని, అతని ఆశలను, భాధలను, ధనిక భూస్వాములు అతనినిపెట్టే కష్టాలను చిత్రించిన నాటకాలలో కొడాలి గోపాలరావు పేదగైతు, గైతుబిడ్డలు ముఖ్యమైనవి. పేదగైతు వందలసార్లు ప్రదర్శితమయి ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాటకం. పేక్ష నిజరుగాపు అసామీలో గైతు నిత్యజీవితం, అమాయకత్వం చక్కగా చిత్రించారు.

ధనిక భూస్వామేగాక పెట్టుబడిదారీవర్గం బయలు దేరింది. ఈ వర్గం ఫ్యాక్టరీ యజమాని, మాస్టరువీవరు, అద్దె కొంపల యజమాని మొదలయిన అనేక రూపాలలో అవత రించి దరిద్రులను పీడించసాగాయి. ఈ పీడనను కొడాలి గోపాలరావుగారు కూలి నాటకంలో, బోయ భీమన్నగారు కూలిరాజు నాటకంలో, పడాల రామారావుగారు నేతిబిడ్డ నాటకంలో చిత్రించారు. ఈ నాటకాలు వందలసార్లు దేశ మంతటా ప్రదర్శితమయినాయి

స్వాతంత్ర్యం వచ్చింది, ఇంకేం జీవితాలు మెరుగయితాయని గంపెడాశ పెట్టుకున్న ప్రజలకు అశాభంగం కలిగింది పరిస్థితులు ఎదురుతిరిగాయి. ఈ స్వాతంత్ర్యానంతర దేశ రాజకీయ సాంఘిక పరిస్థితిని, ఆశాభంగాన్ని చిత్రించే నాలుగు కాలు ఆచార్య ఆత్రేయ వాస్తవం. (1955), పడాల రామారావు ఇదా స్వతంత్రం. (1953) మొదలయినవి - వెలువడ్డాయి.

భారతవర్ష పంచవర్ష ప్రణాళికలలో భాగంగా గ్రామోద్ధరణ, పంచాయతీపాలనను చేపట్టి ప్రచారం చేయడంతో గ్రామోద్ధరణకు సంబంధించిన నాటకాలు వెలువడ్డాయి. కె. యల్. నరసింహారావుగారి కొత్తగుడి (1950), అడుగు జాడలు (1956), పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారి గ్రామసేవ, పైడిపాడి సుబ్బరామశాస్త్రిగారి అంకితం, నండూరి సుబ్బారావుగారి గ్రామసేవక్, కొర్రపాటి 'అందరి అనందం', కావ్యశ్రీ 'కలెక్టరు' ముఖ్యమయినవి.

నాటక కళ మహోన్నతమయిన కళ. లోకకళ్యాణాన్ని చేకూర్చగల కళ. మానవ హృదయాలలో మాయని ముద్ర వేసి వారిని ఉన్నత జీవితానికి మరలించగల కళ. ప్రాణాలను కాపాడగల కళ. ఈ సత్యమే డి. వి. నరసరాజుగారి నాటకం (1951) అనే నాటకంలో గోచరిస్తుంది. పాశ్చాత్యనాటకాన్ని ఆధారంచేసుకుని రచించిందయినా స్వతంత్ర నాటకమని భ్రమ గొల్పేటంత చక్కగా నరసరాజుగారుపట్టుకొచ్చారు. యువతీ యువకుల ప్రేమలత వెనుతుఫానులో చిక్కుకోగా ఒక నాటక రచయిత నాటకం రచించి దాని రిహార్సలును యువకునికి

చూపి అతనిలో పొడచూపిన అనుమానాన్ని తొలగించి, ప్రేమలతను రక్షించి, నాటక కళకు గొప్ప గౌరవం, ప్రయోజనం సంపాదించిపెడ్తాడు. సంభాషణలు సహజంగాఉంటాయి. హాస్య రసం దోబూచులాడుతూంటుంది. అనేకసార్లు ప్రదర్శిత మయి ప్రజాభిమానాన్ని పొందిన నాటకం "నాటకం."

"నాటకంలో జీవించి, జీవితంలో నటించే ఒకానొక మానవుని అయోమయావస్థకు రూపకల్పనే ప్రఖ్యా శ్రీరామమూర్తిగారి 'మనిషిలో మనిషి.' నటీనటులు పాత్రలోలీనమై పోవడం సాధ్యమేనా? సాధ్యమైతే వాంఛనీయమేనా? ఈ ప్రశ్నకు సమాధానం ఈ నాటకంలో దొరుకుతుంది. 'ఈ జీవ సబనల సారూప్యాన్ని తాదాత్మ్యాన్ని సూచిన ప్రాయంగా నిరూపించడమే 'మనిషిలో మనిషి' (1962) ముఖ్యోద్దేశం. అభినయకళలో పెద్ద సమస్యగా తయారైన ఈ తాదాత్మ్యత, మనస్తత్వ శాస్త్రానికీ అందీ అందని ఈ సమస్య నాటకరూపం తెలుగులో రావడం ఇదే మొదలు. ఇది మెదడకు కావలసినంత పని కల్పిస్తుంది. ఇందులోని హాస్యం వినోదం కలిగిస్తుంది.

నేటి నాటకరంగc పరిస్థితులను ప్రతిబింబింపజేసే ఇంకో నాటకం కోడూరిపాటి రంగస్థలం. (1962) ఇందులో ఔత్సాహిక నటుని విషాద జీవితం, కంట్రాక్టర్ల దౌష్ట్యంద్వో తకం చేశాడు కోడూరిపాటి.

నాటక పోటీలలో విజయమే లక్ష్యంగా పెట్టుకుని ఆ లక్ష్యసిద్ధికి అనుగుణంగా నాటక రచనను, ప్రయోగాన్ని

రూపొందించుకోవడం కళను ఖూనీ చేయడమే. ఈ ఇతివృత్తముతో వచ్చినదే కొ్రరపాటి "పోటీనాటకం".

ప్రపంచమే ఒక రంగస్థలం. మానవులే పాత్రలు. వీరు సమర్థవంతంగా కలిసి కట్టుగానటిస్తే లోకానికి శాంతిచేకూరుతుంది. అయితే మానవుడికి మానవుడికి మధ్య నీలి తెరలు, అడ్డువస్తున్నాయి. వాటిని తొలగించుకుంటేనే శాంతి లభిస్తుంది. ఈ సత్యాన్నే ఇతివృత్తంగాతీసుకుని అంగర సూర్యారావుగారు రచించిన నాటకం 'నీలి తెరలు'. ఇందులోని ప్రతి సంఘటనా ఆ సత్యాన్నే రుజువుచేస్తూ ఆ సత్యంవేపే పయినిస్తుంది. సూర్యారావుగారు నాటకంలో పొందుపరిచిన నిహారాలు సీను ప్రపంచ నాటక రంగానికి సాంకేతికం.

ధన పిశాచం ఆవహించి మానవుడిని దానవుడిగా తయారుచేస్తుంది. ఈ సత్యాన్ని కొడాలి గోపాలరావుగారు దొంగవీరడు, లంకె బిందెలు నాటకాలను, కొ్రరపాటి గంగాధరరావుగారు నిజరూపాలు నాటకంలోనూ చిత్రించారు. దొంగవీరడులో ధనాశతో తమ్ముని కుమారుడు, పసికూనను, హత్యచేయడానికి యత్నిస్తాడు రాఘవరావు. భూమిలోని లంకెబిందులు బయటకు తీయడానికి నరబలికి తెగబడతారు లంకెబిందెలలోని ధనిక వైతులు.

సామాన్య సంసారంలో ఒకరిమీద ఒకరికుండే ఆపేక్ష సంస్కృతిమీదకంటె ఆర్థిక పరిస్థితులమీదనే ఎక్కువ ఆధారపడివుంటాయి. స్వార్థానికి అడ్డువచ్చినప్పుడు ఈ ఆపేక్షలు మాయమయిపోతాయి. ఆపేక్షలు ద్వేషంగా మారతాయి. మానవుడు దానవుడవుతాడు. దీనికి రూపకల్పనే

"నిజరూపాలు". ఈ నాటకంలోని పాత్రలందరి నిజరూపాలు నాటకం చివర బయటపడతాయి. ఈ నాటకంలోని స్త్రీ పాత్ర శ్యామల, మాధవుని స్వార్థానికి సాంకేతికం

తండ్రి "పరంధామయ్య పాత్ర స్వార్థాన్ని కరిగి మాసపోసిన ముద్ద". ఈ రెండు స్వార్థాల ఘర్షణే ఈ నాటక కథాంశం. సన్నివేశ కల్పనలో సంభాషణలు నడపడంలో సిద్ధ హస్తుడు గంగాధరరావుగారు అందుకే ఆయన నాటకాలు, నాటికలు ఎంతగానో జనాన్ని ఆకర్షిస్తాయి.

స్త్రీ పాత్రలులేని నాటికలు, హాస్యనాటికలు. నాటకాలు, గంభీర నాటకాలు రకరకాల ఇతివృత్తాలతో అధిక సంఖ్యలో ఈ దశాబ్దంలో రచించిన వారు కొత్తపాటి గంగాధరరావు, కొడాలి గోపాలరావుగార్లు. కొత్తపాటివారు సంపన్న మధ్యతరగతి కుటుంబాలలోని వ్యక్తుల సుఖదుఃఖాలు, మనఃప్రవృత్తులను ఎక్కువ రచనలలో చిత్రిస్తే కొడాలివారు పేదరైతు, కూలి, నిరుద్యోగి మొదలయిన బీద జనుల కష్టసుఖాలను మనఃప్రవృత్తులను చిత్రించడానికి ఎక్కువగా పూనుకున్నారు. వీరిద్దరి నాటకాలు తేలికగా ప్రదర్శించడానికి అనువయినవి కావడంచేత ఔత్సాహిక నాటక సమాజాలవారికి ఎంతో ఉపయుక్తమవుతున్నాయి

స్వాప్నిక జగత్తు విచిత్రమయిన జగత్తు. మానవుడు కట్టుకునే గాలిమేడలు, తీరని కోరికలు స్వాప్నిక జగత్తులో ఏదో ఒక రూపాన ప్రత్యక్షమవుతూంటాయి ఈస్వాప్నికజగత్తును అనిసెట్టి సుబ్బారావుగారు, "గాలిమేడల"లో, శ్రీ వాత్సవ గారు "తీరని కోరికలు"లో చిత్రించి చూపారు. ఇలాంటి

శాస్త్రీయ దృక్పథాన్ని ఇతివృత్తంగా తీసుకుని నాటకాలు రచించి ఆంధ్ర నాటక సాహిత్యంలో వినూత్న శాఖకు ఈ రచయితలు ఫునాదులు వేశారు.

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత క్రమంగా సాంఘిక సమస్యలమీద ముఖ్యంగా వివాహ సమస్యమీద, స్త్రీ సమస్యమీద నూతన దృక్పథం ఏర్పడ సాగింది. ఒకవేపున అధిక వరకట్న వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంకోవేపున ప్రేమ వివాహాలు స్త్రీ ఫునర్వివాహాలు అంతర్వర్ణ వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వారికి సంఘంలో గౌరవస్థానం లభిస్తూనే ఉంది. ఇకపోతే పతితల సమస్య. ఎన్నడో మహాకవి గురజాడ అప్పారావుగారు 'సంస్కర్త హృదయం' అనే కథలో నాయికతో వేయించిన "నాబోటి బొగంపిల్లను ఏ మర్యాదస్తుడు పెళ్ళాడతాడో చెప్పండి మీరే" అనే ప్రశ్న ప్రశ్నగానే ఉండిపోయింది.

"ఒకపిల్ల విధివశాత్తు చెడితే, ఇహ అది బాగుపడ కూడదా? అదలా నరకకూపంలో నశించాల్సిందేనా?" ఈ ప్రశ్న సంఘాన్ని రచయితలను ఎదుర్కొంది, బెల్లం కొండ రామదాసు, అవసరాల సూర్యారావు. పి. వి. రాజ మన్నారుగారలు విభిన్నపరిస్థితులలోని విభిన్న మనస్తత్వాలు గల యువతీ యువకులను తీసుకుని నాటకాలు రచించారు.

పతిత స్త్రీకి ఫునర్జన ప్రసాదించిన నాటకం పునర్జన్మ (1956). లోకంతీరు తెలియని వయసులో ప్రేమే జీవితమను కునే వయసులో ప్రియునితో వెళ్ళిపోయి, అతను పరిత్యజిస్తే ఎలాగో కాలం వెళ్ళబుచ్చుతూ వివాహం చేసుకుని భర్తతో

నిజాయితీగా జీవనయాత్ర సాగిస్తూంటే పూర్వ జీవితం, పూర్వ ప్రియుడు, లోకం ఆమె కాపురంలో చిచ్చుపెడతారు. పూర్వ జీవితానికి మళ్ళించచూస్తారు. అదృష్టవశాత్తూ ఆమె నడవడికి ముగ్ధుడై ఆమె మామగారు సముద్రంలాగా పొంగి ఆచిచ్చును ఆర్పివేసి ఆమె కాపురం నిలబెడతారు ఆమె మనోప్రవర్త నకు, అభ్యుదయ భావాలకు విజయమే ఈ నాటక పరమార్థం.

ఈ నాటకంలో రామదాసుగారు రెండురకాల ప్రేమ లను-దేవతా, రాక్షస ప్రేమలను చిత్రించి చూపారు. ఈ నాటక నాయకుని ప్రేమ దేవతా ప్రేమ. ప్రతి నాయకునిది రాక్షస ప్రేమ. ఈ రెండు ప్రేమల సంఘర్షణలో దేవతా ప్రేమకు జయం లభిస్తుంది. రాక్షస ప్రేమ నశిస్తుంది. నశిస్తూనే దేవతా ప్రేమను ఆశీర్వదిస్తుంది.

ఇంకో రకం పతిత అవసరాల 'పంజరం' లోని పతిత, జ్యోతి. సామాన్య గృహిణి. ఈమె పతనానికి మూల కారణం యవ్వనంకాదు, కామంకాదు. తాళికట్టిన భర్త అనుమానమే కారణం. పిశాచి సమూజం అతనిలో భార్యమీద అనుమానం రేకెత్తిస్తుంది. ముందూ వెనకా ఆలోచించకుండా పుట్టింటికి తరుముతాడు. అమ్మ లక్కలు నోళ్ళు నొక్కుకోగా భరించ లేక పారిపోయి నర్సుగా చేరి వివాహ మాడతానన్న ఒక దుర్మార్గుడి తీయనిమాటలకు మోసపోయి అతనిచేతిలో చిక్కు కుంటుంది. ఆమె భర్త పశ్చాత్తాపంచెంది పిచ్చివానివేషంలో ఆమెను వెతుక్కుంటూ వచ్చి ఆ విషసర్పం పన్నిన విషవల యంలోనుంచి తప్పించుతాడు. ఆమె పతనానికి మూలకారణ మయిన భర్తే ఆమెను కాపాడి తనను కాపాడుకుంటాడు.

ఈ నాటకంలోని ప్రతి వాక్యంలోనుంచి వ్యంగ్యం దూసుకు వస్తుంది ప్రతాపరుద్రీయంలోని పిచ్చియుగంధరుని, విక్రమోర్వశీయంలోని పిచ్చి పూరగవుడిని కలిపి ముద్దచేసి ఈ కొత్త రూపురేఖలు దిద్ది రంగస్థలంమీదికి ఈ నాటకం లోని పిచ్చివానిని వదలి నట్లనిపిస్తుంది.

పంజరం నాయిక భౌతిక ఆంతరస్థితికి సాంకేతికం. గర్భసంధి (Climax) లో నాటకం ప్రారంభించి, ముఖ ప్రతిముఖ సంధులను నిర్వహణ సంధికిముందు కథనంద్వారా స్థాపించి చివరకు నిర్వహణ సంధిని సాధించే శిల్పసంప్రదాయా నికి 'పంజరం', 'పునర్జన్మ' మచ్చు తునకలు!

ఇక రాజమన్నారుగారి మనోరమ (1959)నాటకంలోని మనోరమ దేవదాసి. గుడి సేవలో జీనయాత్ర సాగిస్తోంది. పూజారి దక్కులేని మనోరమ మానాన్ని దోంగిలించిన తుచ్ఛుడు తన నీచ స్థితికి కుమిలిపోయే మనోరమను ఆమె చమత్కారపు మాటలకుముగ్ధుడైన ఒకయువకుడు వివాహమాడ తాడు. పూజారి కష్ట స్థితిలో ఉంటే జాలివేసి మనోరమ అనా లోచితంగా ఇచ్చిన ఉంగరం ఆమె కాపురానికి విచ్ఛిత్తి కలి గిస్తుంది. నిజం గ్రహించి భర్త ఆమెను తిరిగి స్వీకరిస్తాడు. నాటకం ఆసాంతం చమత్కారపు సంభాషణలతో సహజ సంఘటనలతో కౌతుకంతో సాఫీగానడుస్తుంది. ఏ అండదండా లేక సాహసంతో తన జీవిత రేఖను తానే స్వయంగా తీర్చి దిద్దుకున్న దిట్ట మనోరమ. 'బొట్టు పెద్దది చెయ్యి'-ఒక చమ త్కృతి, ఒక వ్యంగ్యం, ఒక తళుకు పొదువుకున్న ఈ మూడు

మాటలు నాటకాంతాన నాయకునిచేత అనిపించడం రాజ మన్నాగారి రచనా చమత్కృతికి తార్కాణం.

ఎంతో నాటకీయతను పొంది పరచుకుని అనేకసార్లు ప్రదర్శితమయిన నాటకం మాస్టర్జీ. రచన బెల్లంకొండ రామదాసుగారు. వ్యాపారంలో భాగస్వామిని మోసంచేసి అతని ఆకలి చావుకు కారణమయిన మార్వాడీ సేటును, అతని ధనాశను ఆధారంచేసుకుని మరణించిన భాగస్వామి కుమారుడు మాస్టర్జీ వంచించి ధనమంతా అపహరించి హత్యచేసి అమాయకులనుకూడా రంగంలోకి ఈడ్చి బలిపెట్టి జూచిన గాధే మాస్టర్జీ నాటకం. ఇందులోని జంతర్ మంతర్ పాత్రల సృష్టి హాస్యానికి, వినోదానికి తావిచ్చింది.

అపరాధ పరిశోధక నవలలు, సినిమాల ప్రభావం తెలుగు నాటక సాహిత్యంమీద అమితంగా పడింది. తెలుగులో అపరాధ పరిశోధక నాటకాలు వెలువడ సాగాయి. దీనికి ఆద్యులు ప్రఖ్యాత శ్రీ రామమూర్తిగారు. వీరి కాళరాత్రి (1955), ఫణి (1957) పాశ్చాత్య నాటకాల అనువాదాలు. వీటిల్లో హంతకుల మనస్తత్వం, హత్యకు దారితీయించిన పరిస్థితులు, అపరాధ పరిశోధన చక్కగా చిత్రితమయి వళ్ళు ఝుల్లుమనిపిస్తాయి. అనేకసార్లు ప్రదర్శితమయ్యాయి. వీటి ప్రభావంవల్ల అపరాధ పరిశోధన నాటకాలు నాటికలు కుప్పతిప్పలుగా రాసాగాయి. అయితే ఈ రచయితలు నకిమార్గం పట్టి నాటక సమస్యను సహజ పాత్రోత్పాదనంతోగాక పోలీసు సహాయంతో పరిష్కరిస్తున్నారు. పూర్వ నాటకాలలోని దేవతల స్థానాన్ని పోలీసులు ఆక్రమించారు.

జానపద సినీమాల ప్రభావంవల్ల జానపద గాథలను తెలుగు రచయితలు నాటకాలుగా రాయజొచ్చారు. శాల నాగమ్మ గాథను కణ్వాశ్రీ, సీతంరాజు, బి. యన్. సూరి, మందపాటి నాటకాలుగా రచించారు. అధిక సంఖ్యలో నాట కాలు రచించిన వారిలో సీతంరాజు ఒకరు. వీరి నాటకాలు పట్టణాలలోకంటె గ్రామాలలో ఎక్కువగా ప్రదర్శిస్తున్నారు. వీరి పల్లెపిల్ల, పతిఫలం, దొంపిడి, పేదపడుచు ముఖ్యమైనవి.

కణ్వాశ్రీ రచించిన మాయాబజారులాంటి పౌరాణిక నాట కాలో తప్ప పౌరాణిక నాటకాలు కొత్త ఇతివృత్తాలతో పూర్వపు స్థాయిలో రావడంలేదు.

మనకు స్వాతంత్ర్యం రావడం, ఆంధ్రరాష్ట్రోద్యమం తారాస్థాయి నందుకుని ఆంధ్రరాష్ట్రం సిద్ధించడం మూలంగా ఆంధ్రాభిమానం ప్రబలమయింది. ఆంధ్ర వీరుల జీవితగాథలు నాటకాలుగా రచించసాగారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడించిన అల్లూరి సీతారామరాజు గాథను పలువురు నాట కాలుగా వెలయించారు. పితూరి పేరుతో పడాల రామా రావు, మన్య విప్లవజ్వాల పేరుతో ధూళిపాళ సూర్యనారా యణమూర్తి, అల్లూరి సీతారామరాజు పేరుతో గబ్బిట వెంకటరావు, ఆకుల సుబ్రహ్మణ్యంగార్లు రచించిన నాట కాలు ముఖ్యమయినవి. పెమ్మరాజు వేణుగోపాలకృష్ణమూర్తి గారు పూర్వాంధ్ర వీరుల శౌర్య పరాక్రమాలను, నాగమ నాయకుడు, వీరకాపయ, వీరపాండ్య కట్టబొమ్మన నాటకా లలో, నంబూరి బంగారయ్యగారు ఆంధ్ర తేజంలో కన్నస్వామి మహోద్రీయం నాటకంలో ద్యోతకం చేశారు.

పూజించ వలసిన కవి ప్రతికి ఉండగా చీ కొట్టి, అత నింక ప్రతకడని తెలియగానే అతని మృత్యువును ఆధారం చేసుకుని కీర్తి ప్రతిష్టలు, ధనం గడించాలనిచూసే నీచ బుద్ధి లను, నేటి కవి అనుభవించే దుర్భర జీవితాన్ని భమిడిపాటి రామకృష్ణ 'కీర్తిశేషులు' నాటకంలో మయ్యబట్టాడు.

ఆశ చిత్రమయిన నాటకం. రచన కుంచి అంజనేయులు. ఇది వచన గేయంలో నడుస్తుంది. "రంగస్థలంమీద కవిత్వంచదువుతూంటే వింటున్నామనే చైతన్యం ప్రేక్షకుల్లో కలుగనీయకుండా కథాగమనంలో వారికి సత్యభ్రాంతికల్పించ గలిగే టంతగా నాటకీయత"ను సొంతం చేసుకున్నది. దీని లోని పాత్రలు - కవి, కాలం, చరిత్ర, ప్రేక్షకుడు, గుమాస్తా ఆశ-సాంకేతికాలు. నాటక రచనలో ఇదొక నూత్న ప్రక్రియ, నూత్న ప్రయోగం. "కవిభావం జాతికి జీవం, అతనికలం జగతికి బలం" అనేదే ఈ నాటకం అందించే సందేశం.

లోకం ఏమనుకుంటుందోనని భయపడుతూ లోకం వశవడిలో నడిచే అమాయకుల్ని రాచి రంపాన్ని పెడుతుంది. సతిదిద్దపోతుంది. అతనికి జరిగిన అన్యాయాన్ని విస్మరించి చివరకు మానవుడిని అవసాన సమయంలో ప్రాణముండగానే బయటపెట్టి మంటుంది లోకం ఇటువంటి లోకం గుడ్డిది. ఈ గుడ్డిలోకంచేసే దాగుణాలను మనసులను కదిలించివేసే టట్టు 'గుడ్డిలోకం' అనే నాటకంలో కొత్తపాటి చిత్రించాను.

సంస్కృత నాటకాల అనువారం యథాప్రకారం సాగుతూనేఉంది. భాస నాటకాలను, ముద్రారాక్షస మృచ్ఛ

కటికాలను శిష్ట వ్యవహార నచన నాటకాలుగా రంగస్థలాను కూలంగా భమిటిపాటి కామేశ్వరరావుగారు అనువదించారు.

రవీంద్రుని శతజయంతి మహోత్సవాలను పురస్కరించుకుని బెజవాడ గోపాలరెడ్డి, అబ్బూరి రామకృష్ణారావు, శ్రీనివాస చక్రవర్తి, వివరించి ప్రభృతుల టాగూరు నాటకాల అనువాదాలు వెలువడినాయి. జగన్నాధ్‌గారి మహారాష్ట్ర నాటకానువాదాలు వచ్చాయి.

పాశ్చాత్య నాడకానువాదాలలో డి. వి. నరసరాజు గారి "వీలునామా," రెంటాల, బెల్లంకొండ, గిడుతూరి, సోమంచి అనువదించిన "ఇనస్పెక్టర్ జనరల్" నాటకానువాదాలు, భమిడిపాటివారి మోల్సేర్ మెరిడాన్ నాటకానువాదాలు, సోమంచి యజ్ఞశాస్త్రిగారి 'విశ్వంపెళ్ళి','న్యాయం' శివంగారి 'నేరము-శిక్ష', 'వాసురాలు', 'ముద్దుకృష్ణ', 'ఆడవాళ్ళ తెలివి' గొల్లపూడి మారుతీరావుగారి 'రాగ రాగిణి', కొర్రపాటి 'విషకుంభాలు', 'సంక్రాతి' అనేకసార్లు ప్రదర్శిత మయినాయి. ఎ.యస్. అవధాని ఆదర్శాలు, శ్రీనివాస చక్రవర్తి నీటికాకి, పతితజీవులు, జైత్రయాత్ర, కోడూరి అచ్చయ్య గారి 'తప్పునాదే' విద్వాన్ విశ్వం 'మహాశిల్పి', దండమూడి మహీధర్ 'చంద్రయ్యలో చైతన్యం' జోగిరాజుగారి 'అనామకులు' వి యస్. శర్మగారి "ఫాస్ట్", వావిలాల, అమరేంద్ర, దుర్భరామమూర్తి, లక్ష్మీకాంతమోహన్‌గార్ల పేక్సిపియర్ అనువాదాలు, ఉపాధ్యాయుల సూర్యనారాయణ మూర్తిగారి 'పంకజాక్షి', పి. వి. ఆచార్ 'ఆపద్బాంధవులు' ముఖ్యమైనవి.

ప్రేమతత్వం, దాని వివిధరూపాలు, గతులు, ప్రేమలోనుంచి జనించే త్యాగనిరతి, ఈర్ష్యాద్వేషాలు చాలా మంది నాటక రచయితలు చిత్రించారు. బుచ్చిబాబుగారి 'అత్మవంచన'లో నాయిక తమ ఇంట వారాలు చేసుకుని చదువుకున్న యువకుని ప్రేమిస్తుంది. బీదరికం వారిద్దరిమధ్యా గోడలావుంది. ఆ గోడను ఆమె దూకలేదు. అతను పడగొట్టలేడు. నిజానికి ఆమె ఎవరినీ ప్రేమించలేదు, తన్నుతప్ప. చివరకు ఆమె సౌఖ్యంకోసం అతను ఆత్మహత్య చేసుకుంటాడు. బుచ్చిబాబుగారీ నాటకంలో కొత్తపోకడలు చూపించారు. వాచంగా ఎవరూ తమ ప్రేమను వెల్లడించరు. అంతా వ్యంగ్యమే. నాయికా నాయకుల హృదయ సంక్షోభాన్ని చిన్నచిన్న క్రియలలో, చిన్నచిన్న మాటలలో ద్యోతకం చేసిన బుచ్చిబాబుగారి కళానైపుణ్యం మెచ్చతగ్గది. చలం గారి శశాంక, జయదేవ, పురూరవ, బోయి భీమన్నగారి రాగ వాశిష్టం, నాగిభూషణ్ విషాదాంతం, ముప్పన చినఅంకయ్య శిథిలాలయం, మూడభూషి వెంకటాచారి ప్రభ, గన్నిశెట్టి శారద ప్రేమతత్వాన్ని చిత్రించే నాటకాలే

వివాహ సమస్యను ప్రత్యేకంగా తీసుకుని రచించిన నాటకాలలో రాంషా లక్ష్మీపతిగారి అమ్మాయిలు, భమిడిపాటి రాధాకృష్ణ ఇదేమిటి, పినిశెట్టి కులంలేనిపిల్ల, కన్న కొడుకు, గన్నిశెట్టి భలేపెళ్ళి, మునిమాణిక్యం గృహప్రవేశం, సోమంచిహారి కట్నంలేని కళ్యాణం ముఖ్యమైనవి.

ఔత్సాహిక నాటక రంగాన్ని జీవిక నాటక రంగంగా మార్చే యత్నంలో ఆలంబనగా ఉపకరించిన నాటకాలు

పాలగుమ్మి పద్మరాజుగారి సాంఘిక నాటకాలు రక్త కన్నీరు, శాంతినిలయం. రక్త కన్నీరు తెలుగు నాటక రంగంలోఇంకో నూతనాధ్యాయాన్ని సృష్టించింది. కొన్ని వందల ప్రదర్శితమయి పట్టుగా రచించి, కట్టుగా ప్రదర్శిస్తే పౌరాణిక నాటకాలలాగా వచన సాంఘిక నాటకాలుకూడా ధన వార్జించిపెట్టగలవని రుజువు చేసింది.

మల్లాది విశ్వనాధశర్మ, వెంకటకృష్ణశర్మ సోదరులు చాలా నాటకాలు రచించారు. అవి అచ్చుకాలేదుగాని సురభి నాటక సమాజాలవారు వందలసార్లు వాటిని ప్రదర్శించారు.

'చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు'అనే సుమతీశతక పద్యానికిరూపకల్పనే ఆత్రేయగారి కప్పలు,పిని శెట్టిఆత్మీయులు.

సరికొత్త పాత్రలతో గ్రామీణ జీవితంలోని ఒక భాగాన్ని చిత్రిస్తూ దాసరి గోపాలకృష్ణ రచించిన నాటకం చిల్లరకొట్టు చిట్టెమ్మ. ఇందులోని పాత్రలు చిల్లరకొట్టు పెట్టుకొని జీవించే చిట్టెమ్మ, ఇంటింటికే తిరిగే అవిఇవీ అమ్మకొనే, జోడీల సీతయ్య, పువ్వుల పున్నయ్య, బట్టల బంగారం, పప్పుల వదిలెట్టి, దత్తుడు సామాన్య వ్యక్తులు. ఈ సామాన్య వ్యక్తులతో ప్రతి గ్రామంలో నిత్యమూ జరిగే సంఘటనలతో ఈ నాటకం విరాజిల్లుతోంది. చిట్టెమ్మ అమాయకత్వాన్ని, కలుపుగోలుతనాన్ని ఆధారం చేసుకుని ఆమెను వశంచేసుకోవాలని పీరంతా యత్నించి తుదకు ఆమె మరణానికి కారకులవుతారు. గ్రామీణ జీవితంలోని ఈ భాగం మన కనుల కట్టేటట్టునేర్పుగా గోపాలకృష్ణరచించారు.

సరికొత్త ఇతివృత్తంతో వచ్చిన నాటకం రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'నిజం'. పెద్దలు తమ స్వార్థంకోసం కోర్టులలో న్యాయవాదుల సహాయంతో నిజాన్ని అబద్ధంగానూ, అబద్ధాన్ని నిజంగానూచిత్రించడంబట్టబయలు జేసే నాటకంఇది. శాస్త్రిగారు న్యాయవాదులేమో నాటకాన్ని అతిస్వాభావికంగా నడిపించారు. అన్యాయంగా ఉరిశిక్షకు పాల్పడ్డ యువకుడు, నాటకాంతాన, "నిజమైన లోకం నిలబడాలంటే నిజం నిలబడాలి...నిజానికి నిలబడతామని నాకో చిన్న వాగ్దానం మీకు వీలయితే చేయండి," అని అడిగింది మేజిస్ట్రేటు, జైలు సూపరింటిండులనేగాదు మనల్ని కూడా.

ఒక వ్యక్తి మరణానికి 'నేను కారణం' 'నేను కారణం' అని భావించుకుని, వాదించే పలువురు వ్యక్తుల మనస్తత్వాన్ని పోతుకూచి సాంబశివరావుగారు 'హంతకులు'లో చిత్రించారు.

1950-62మధ్య కాలంలో వచ్చిన నాటకాల ఇతివృత్తాలలో ఉన్నంత వైవిధ్యం ఇంకే దశాబ్దంలోనూ కనిపించదు.

ఇకశిల్పం: రంగస్థలం సమకాలీనాలనుబట్టి నాటకరచనా శిల్పంలోమార్పులురావడం అన్నికాలాలలో,అన్ని దేశాలలో కానవస్తుంది. నాటక కళ విషయంలో ప్రబలే దృష్టికూడా ఈ మార్పుకు కారణ మవుతూంటుంది. నేను వాస్తవికతా దృష్టి ఎక్కువ కావడంతో పూర్వంలాగా కాక సెట్టు కట్టి వలసి వచ్చింది. పూర్వంలాగా అనేక స్థలాలలో కథ జరిగితే అన్ని సెట్లు కట్టడం సాధ్యంకాదు, ఏట్రాలీ స్టేజీయో, వర్తుల రంగస్థలమో అయితే తప్ప. ఆ సెట్టులను మార్చడానికి కాలం చాలా పట్టి నాటక గమకం దెబ్బతింటుంది. ప్రేక్షకులకు విసు

గెత్తుతుంది. అందుకని ఇప్పుడు ఒకే సెట్టుమీద అంటే ఒకే స్థలంలో, ఒక టే అంకంలో నాటక మంతా నడుపుతున్నారు, (ఉదా- భయం). నేటి పరిస్థితులలో నటీమణుల కొరత ఏర్ప డడంవల్ల స్త్రీ పాత్ర లేకుండానే నాటకాలు రాస్తున్నారు (ఉదా- దొంగవీరడు). నాటకానికి గమకం చేకూర్చడానికి గర్భసంధి (Climax)లో నాటకం ప్రారంభిస్తున్నారు. పాత్రల మానసికావస్థలను దీర్ఘ స్వగతం ద్వారా గాకుండా నేపథ్య గేయగానం (భరతమునిచెప్పిన ధృవగానం) ద్వారా ద్యోతకం చేస్తున్నారు. నాటకమంతా ఒక పాత్ర ఇంకో పాత్రకు చెప్పు తున్నట్టు నడిపిస్తున్నారు (పితూరీ). నాటకంలో ఛాయా నాటకం పొందుపరుస్తున్నారు(భూమికోసం). ప్రేక్షకులుకూడా నాటక ప్రదర్శనంలో భాగస్వాములేనని ప్రేక్షకులలో నటీ నటులను కూర్చోబెట్టడం, వారితో నటీ నటులు మాట్లాడడం ప్రవేశపెడుతున్నారు (గాలిమేడలు). అంక రంగ విభజన చేయ కుండా, కొంతకాలం గడిచిందని తెలియజేయడానికి విద్యు ద్దీపాలు ఆర్పి వెలిగిస్తున్నారు.

ఇదీ గత నూరేళ్ళ ఆంధ్ర నాటక సాహిత్య ప్రగతి ! ఈ ప్రగతిని, ఈ ప్రగతిలో ప్రబలిన వివిధ ధోరణులను, ఆ ధోరణుల అవతరణకు కారణాలయిన పరిస్థితులను, ఆ ధోరణు లకు ప్రాతినిధ్యంవహించే నాటకాలను, ఇతివృత్తాలను, రచనా విధానాలను దిజ్ఞాత్రంగా సమీక్షించి పాఠకులకు పరిచయం చేయడమే నా లక్ష్యం. స్థలాభావంచేత ఇంకా ఎక్కువ నాట కాలను సమీక్షించలేకపోయినందుకు చింతిస్తున్నాను. నాటక రచయితలు నన్ను మన్నిస్తారనే నమ్ముతున్నాను. శెలవు.



రచయిత

శ్రీనివాస చక్రవర్తి

జననం. 13-3-11 కృష్ణాజిల్లా హనుమంతపురం. బందరు నోబుల్ కాలేజీలో బి. ఏ. వరకు విద్యాభ్యాసం. తెలుగు దిన, వార పత్రికలలో సహాయ సంపాదకులుగా చాలా సంవత్సరాలు పని చేశారు. నాట్యకళ పత్రిక సంపాదకులుగా నాటక కళకు ఎంతో సేవచేశారు. పాశ్చాత్య నవలలు, నాటకాలు చాలా తెనిగించారు. నాటక కళా రంగానికి సంబంధించిన ఈ క్రింది గ్రంథాలు రచించారు.

Bibliography of Telugu Stageable Plays

అభినయం

నటన

నాట్యశాల

నాటక పోటీలు

ఆంధ్రనాటక సమీక్ష

నటశిక్షణ

"వెంకటరత్నా," విజయవాడ-2.

Check List

Book Number	NPROIA272	Date	25/3/2023
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, M : 109		
Missing Pages	NO		
Prepared By	Adilakshmi	Cutting By	Adilakshmi
Scanned By	Amrutha	Pages	117
Quality Checking	Ramya		